అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

ఆదివారం 20 -01-2019

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 5 సంచిక : 22 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal | www.navatelangana.com | 12 + 16 పేజీలు + సోపతి | వెల : 8.00

పునరంకితం

బంగారు తెలంగాణ నిర్మాణానికి..



ఉభయసభలనుద్దేశించి ప్రసంగిస్తున్న గవర్నర్ నరసింహన్

- అనేక రంగాల్లో దేశంలోనే అగ్రగామి
- ఎన్నికల హామీలు నెరవేర్చేందుకు చిత్తశుద్ధితో కృషి
- ఎస్టీ, మైనార్టీ రిజర్వేషన్లపెంపునకు కేంద్రంతో పోరు
- మరో 119 గురుకులాలు ఏర్పాటు
- మార్చి నాటికి మిషన్ భగీరథ పూర్తి
- ఐదేండ్లలో ప్రాజెక్టుల నిర్మాణం : ఉభయసభలనుద్దేశించి గవర్నర్ నరసింహన్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

'గత నాలుగున్నరేండ్లలో ప్రభుత్వం మ్యానిఫెస్టోలో ప్రకటించ కుండానే అనేక ప్రజోపయోగ, సంక్షేమ కార్యక్రమాలను అమల్లోకి తెచ్చింది. అదే విధంగా రానున్న ఐదేండ్లలోనూ రాష్ట్ర సమగ్రాభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని, ఎప్పటికప్పుడు ప్రజల అవసరాలకు అనుగుణంగా నూతన లక్ష్యాలను, ప్రణాళికలను, పథకాలను నిర్దేశించుకుంటూ నా ప్రభుత్వం పురోగమిస్తుంది. ప్రజల బతుకుల్లో సుఖసంతోషాలు వెల్లివి రిసే బంగారు తెలంగాణ నిర్మాణం కోసం ప్రజలు అందించిన అపూర్వ విజయం పునాదిగా నా ప్రభుత్వం పునరంకితం ...9లో



గవర్నర్ ప్రసంగాన్ని వింటున్న కేసీఆర్



బహిరంగ సభలో స్పీచ్‌లా..

గవర్నర్ ప్రసంగంపై భట్టి విమర్శ ● సభలో నిర్మాణాత్మక పాత్ర పోషిస్తాం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ప్రజలకు ఇచ్చిన హామీలపై ఎలాంటి స్పష్టత ఇవ్వకుండా గవర్నర్ ప్రసంగం బహిరంగ సభ ను తలపించేలా ఉందని సీఎల్పీనేత మల్లు భట్టి విక్రమార్క విమర్శించారు. పింఛన్లు, నిరుద్యోగభృతి, ఇంటింటికి నీళ్ల, ...10లో

కేంద్ర ఉద్యోగాల్లో భర్తీ నిల్

బీజేపీ హయాంలో నిలిచిన సర్కారు నౌకరీ

- లక్ష్యాన్ని మించి నియామకాలు జరిపినట్టు గణాంకాలు
- ఈబీసీలకు 10శాతం రిజర్వేషన్లు అంటున్న మోడీ
- ఇది ఎన్నికల ఎత్తుగడే : రాజకీయ పరిశీలకులు





న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల భర్తీయే లేనప్పుడు ఈబీసీలకు 10శాతం రిజర్వేషన్ కల్పించి లాభమేంటన్న ప్రశ్న తలెత్తుతోంది. కొత్తగా ఉద్యోగాలు భర్తీ చేయటం అటుంచితే, పదవీ విరమణ ద్వారా ఏర్పడిన ఖాళీల్నే కేంద్ర ప్రభుత్వం భర్తీ చేయలేకపోయింది. తద్వారా తగ్గిన కేంద్ర ప్రభుత్వ ఉద్యోగల సంఖ్య 75,231. 2018-19 బడ్జెట్ గణాంకాల్లో ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వమే పొందుపర్చింది. ప్రభుత్వ ఉద్యోగుల సంఖ్యపై కేంద్రం గణాంకాలతో గారడీ చేసింది. 2015లో 1.9లక్షలు, 2016లో 2.4లక్షలు, 2017లో 3లక్షల ఉద్యోగులు పెరిగినట్టు చూపింది. కాంట్రాక్ట్ పద్ధతిలో జరిపిన డ్రైవర్, ఫూన్ నియామకాల్ని లెక్కించి గణాంకాల్ని పెంచి చూపింది. నిజానికి ఈ నాలుగున్నరేండ్లలో లక్ష్యానికి అనుగుణంగా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఖ్య పెరగలేదు. రిటైర్ అవ్వటం ద్వారా ప్రతీ ఏటా ఏర్పడిన ...9లో

మోడీ పాలనలో పెరిగిన అప్పులు 49శాతం

దేశానికున్న రుణభారం 82లక్షల కోట్లు వివరాలు 9లో

అద్దంలా రహదారులు

అధికారులకు సీఎం ఆదేశం



మాట్లాడుతున్న సీఎం కేసీఆర్

- పంచాయతీలకు బీటీ రహదారులు
- ప్రాజెక్టుల తర్వాత రహదారులకే ప్రాధాన్యం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలోని రహదారులన్నింటినీ రెండేండ్లలో అద్దంలా మార్చాలని ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావు అధికారులను ఆదేశించారు. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం తర్వాత రహదారుల అభివృద్ధికే అత్యంత ప్రాధాన్యమిస్తామని చెప్పారు. కొత్తగా ఏర్పాటైన గ్రామ పంచాయతీలతో సహా, రాష్ట్రంలోని మొత్తం 12,751 గ్రామ పంచాయతీలకు బ్లాక్ టాప్ (బీటీ) రోడ్డు సౌకర్యం కల్పించాలని ఆదేశించారు. ప్రస్తుతం రాష్ట్రంలో రహదారుల పరిస్థితి ఎలా ఉంది? వాటిని అద్దంలా తయారు చేయడానికి ఏం చేయాలి? అనే విషయంపై ప్రణాళిక రూపొందించాలని సూచించారు. దీనికి అవసరమైన బడ్జెట్ కేటాయించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. రాష్ట్రంలో రహదారుల పరిస్థితిపై సీఎం కేసీఆర్ ...9లో

నామినేషన్ వేశాడని కుల బహిష్కరణ

ఆ కుటుంబంతో మాట్లాడితే జరిమానా..

- మంచిర్యాల జిల్లా గుడిపేట్‌లో ఘటన



నవతెలంగాణ - హాజీపూర్


ఏకగ్రీవం చేస్తామనుకున్న వార్డులో అదే కులానికి చెందిన మరో వ్యక్తి నామినేషన్ వేయడంతో కులపెద్దలు పంచాయితీ పెట్టి, ఆ వ్యక్తిని కులం నుంచి బహిష్కరించారు. ఈ ఘటన మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండంలోని గుడిపేట గ్రామంలో శనివారం జరిగింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. గుడిపేట్ గ్రామ పరిధిలోని నేతకానిగూడేనికి చెందిన పాగిడి మహేందర్ గుడిపేట్ పంచాయతీ 6వ వార్డుకు శుక్రవారం నామినేషన్ ...9లో

అందరి అభివృద్ధి కాదు, అందరి వినాశనం : యశ్వంత్‌సిన్హా

కాపలాదారు కాదు, దొంగ : బీజేపీ ఎంపీ శత్రుఘ్న సిన్హా

- కోల్‌కతాలో ప్రతిపక్షాల ర్యాలీ
- 15 పార్టీలకు చెందిన నేతలు హాజరు
- మోడీ పాలనపై నేతల మండిపాటు






కోల్‌కతా: ప్రధాని మోడీ నాలుగున్నరేండ్ల పాలనలో జరిగింది అందరి అభివృద్ధి కాదు, అందరి వినాశనమని కేంద్ర మాజీ మంత్రి యశ్వంత్‌సిన్హా విమర్శించారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రతిపక్ష పార్టీలన్నీ ఏకం కావాలని సిన్హా పిలుపునిచ్చారు. రాజ్యాంగ వ్యవస్థలను కేంద్రంలోని మోడీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని ఆయన దుయ్యబట్టారు. శనివారం కోల్‌కతాలో జరిగిన ప్రతిపక్షాల ర్యాలీలో బీజేపీ మాజీ నేతలైన యశ్వంత్‌సిన్హా,అరుణ్‌శౌరీ పాల్గొని ప్రసంగించారు. అరుణ్‌శౌరీ మాట్లాడుతూ బీజేపీ తప్పుడు నిర్ణయాలకు ...9లో

జేఈఈ మెయిన్స్‌లో తెలంగాణ తేజాలు

వందశాతం పర్సెంటైల్‌లో నలుగురికి చోటు

- ఫలితాలు విడుదల చేసిన ఎన్‌టీఏ
- ఏప్రిల్ 6 నుంచి రెండో విడత పరీక్షలు



VISHWANTH K TL01347951 | SAI KIRAN ADELLY TL01350614 | JAYANTH PHANI SAI TL01347063 | B KARTHIKEYA TL06303311

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దేశంలోనే ప్రతిష్టాత్మకమైన ఐఐటీ, ఎన్ఐటీల్లో ప్రవేశాలకు నిర్వహించే జాయింట్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ) మెయిన్స్‌లో తెలంగాణ అభ్యర్థులు సత్తాచాటారు. వందశాతం పర్సెంటైల్‌లో దేశవ్యాప్తంగా 15 మంది అభ్యర్థులు చోటు సంపాదించారు. అందులో తెలంగాణ తేజాలు నలుగురు అభ్యర్థులు వందశాతం పర్సెంటైల్ ...9లో

అమెరికాలో భారీ నిరసనలు

వైట్ హౌస్ ఎదుట వేలాది మందితో మహిళల మార్చ్

- న్యూయార్క్, లాస్ ఏంజెల్స్‌తో సహా 31 నగరాల్లో ప్రదర్శనలు

వివరాలు 6లో



భారత్‌లో కాశ్మీర్ అంతర్భాగమే

అది గుండెకాయ లాంటిది : ఓవైసీ



మాట్లాడుతున్న ఎంపీ అసద్

వివరాలు 10లో

విపత్కర పరిస్థితుల్లో మీడియా..


75 శాతం మంది వార్తలకు స్థానమేది..?

ప్రముఖ పాత్రికేయులు పాలగుమ్మి సాయినాథ్ ఆవేదన

- రైతులు, వ్యవసాయ కార్మికులు, మహిళలకు తగ్గుతున్న ప్రాధాన్యత
- ఈ పరిస్థితిని మార్చాలంటూ సూచన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రస్తుతం దేశంలోని మీడియా రంగం విపత్కర పరిస్థితులను ఎదుర్కొంటున్నదని రామన్ మెగసేసె అవార్డు గ్రహీత, ప్రముఖ పాత్రికేయులు పాలగుమ్మి సాయినాథ్ ఆవేదన వ్యక్తం చేశారు. అత్యధిక పత్రికల్లో అనుచిత ధోరణులు, పద్ధతులు చోటు చేసుకుంటున్నాయని.. పాత్రికేయ వృత్తిలో ప్రమాణాలు, విలువలు నానాటికీ కనుమరుగవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్పొరేట్ శక్తుల చేతుల్లో మీడియా సంస్థలు బందీ కావటమే దీనికి కారణమని అన్నారు. ఇలాంటి పరిస్థితుల నుంచి పత్రికలు, ఛానళ్లు బయటపడాలని సూచించారు. 'ఫిల్మ్ ...9లో



మాట్లాడుతున్న సాయినాథ్

పచ్చని పొలాల్లో రియల్ దందా



భూమార్పిడి లేకుండానే వెంచర్లు

కన్వర్షన్ చేయకుండా స్థిరాస్తి వ్యాపారం

- గ్రీన్‌బెల్ట్ స్థలాలూ లేవ్..
- గ్రామాల్లో విచ్చలవిడిగా ప్లాట్లు

నవతెలంగాణ- ఖమ్మం ప్రతినిధి

రియల్ ఎస్టేట్ వల్ల సాగు భూములన్నీ కనుమరుగవుతున్నాయి. పచ్చని పైర్లతో కళకళలాడిన భూములు ఇప్పుడు ఎటు చూసినా వెంచర్లు.. ప్లాట్లే కనిపిస్తున్నాయి. అయితే, ఆ భూములను వ్యవసాయేతర భూములుగా మార్పు చేయించుకోకుండా, కన్వర్షన్ పత్రం పొందకుండానే వ్యాపారం చేస్తున్నారు. ఖమ్మం నగరానికి ఆనుకుని ఉన్న గ్రామాల్లోనూ కోట్లాది రూపాయల రియల్‌ఎస్టేట్ వ్యాపారం సాగుతోంది. పచ్చని పొలాలను పనికి రాని భూములుగా రికార్డులకెక్కిస్తున్నారు. భూమి కన్వర్షన్ చేయకుండా ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు. ఖమ్మం కార్పొరేషన్‌గా ఏర్పడిన తర్వాత నగరానికి ఆనుకుని ఉన్న ఖమ్మం రూరల్ మండలంలోని పలు గ్రామాల్లో రియల్‌ఎస్టేట్ వ్యాపారం పెరిగింది. అయితే, నిబంధనలకు విరుద్ధంగా వెంచర్లు వేస్తూ కోట్ల రూపాయలు గడిస్తున్నారు.

ఏదులాపురంలో 2200 ఎకరాల సాగు భూమి మాయం..

ఖమ్మంరూరల్ మండలం ఏదులాపురం పాత రెవెన్యూ పంచాయతీ పరిధిలో ...10లో

ఇంధన ధరలు పైపైకి..

లీటర్ పెట్రోల్‌పై 17పైసలు, డీజిల్‌పై 19పైసల పెంపు



న్యూఢిల్లీ: దేశంలో ఇంధన ధరల వడ్డన నిరాటంకంగా సాగుతోంది. శనివారం పెట్రోల్, డీజిల్ ధరలు మరోసారి పెరిగాయి. ఈ నెలలో ఇప్పటికే చమురు ధరలు రెండు రూపాయలకు పైనే పెరగడం గమనార్హం. రోజు పైసల చొప్పున పెంచుతున్నా.. అది తడిసిమోపెడవుతుందన్న విషయం నిస్సందేహం. చమురు ధరల పెరుగుదల నిత్యావసర ధరలపై నేరుగా ప్రభావితం చేస్తాయన్న సంగతి తెలిసిందే. దీంతో సామాన్య ప్రజానీకం చమురు ధరల పెంపుపై తీవ్రంగా కలవరం చెందుతున్నారు. తాజాగా లీటర్ పెట్రోల్ ధరపై 17పైసలు, డీజిల్ ధరపై 19పైసలు పెరిగాయి.

దీంతో దేశరాజధానిలో లీటర్ పెట్రోల్ ధర రూ. 70.72, డీజిల్ ధర రూ. 65.16కు చేరింది. ముంబయిలో లీటర్ పెట్రోల్ ధర 17 పైసలు పెరిగి రూ. 76.35కు చేరగా, డీజిల్ ధర 20పైసలు పెరిగి రూ. 68.22కు చేరింది. అలాగే హైదరాబాద్‌లో లీటర్ పెట్రోల్‌పై 19పైసలు పెరగ్గా, డీజిల్‌పై 21పైసలు పెరిగింది. దీంతో లీటర్ పెట్రోల్ ధర రూ. 75.03కు చేరగా, లీటర్ డీజిల్ ధర రూ. 70.84కు పెరిగింది.

బీజేపీ మంత్రి అధికార దుర్వినియోగం

బాంబే హైకోర్టు ఆగ్రహం

ముంబయి: అధికార దుర్వినియోగానికి పాల్పడిన మహారాష్ట్ర బీజేపీ మంత్రి గిరీశ్ బాపట్‌పై బాంబే హైకోర్టు ఆగ్రహించింది. రెవెన్యూ అధికారులు రద్దు చేస్తూ ఒక రేషన్ షాపుకు జారీ చేసిన ఉత్తర్వులను కాదని రాష్ట్ర వినియోగదారుల వ్యవహారాల మంత్రి బాపట్ మళ్లీ ఆ డీలర్‌కు అనుమతులిచ్చారు. సదరు రేషన్ షాపులో అవకతవకలు జరుగుతున్నాయని స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకే సంబంధిత అధికారులు ఆ చౌకధరల దుకాణం లైసెన్స్ రద్దు చేశారు. అయితే ఆ రేషన్ షాప్ ఓనర్‌కు మరోక అవకాశమివ్వాలని పేర్కొంటూ మంత్రి బాపట్ మళ్లీ అనుమతులిచ్చారు. కాగా, ఈ విషయం తెలుసుకున్న స్థానికులు బాంబే హైకోర్టును ఆశ్రయించారు. ఈ కేసు విచారిస్తున్న న్యాయస్థానం.. మంత్రి బాపట్ అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని తెలుపుతూ.. ఆయనకు వార్నింగ్ ఇచ్చింది. మంత్రులు ప్రజా సంక్షేమాన్ని బాధ్యతగా తీసుకోవాలని బొంబాయి హైకోర్టు ధర్మాసనం తెలిపింది. కానీ ఈ కేసులో మంత్రి బాపట్ తనకున్న అధికారాలను దుర్వినియోగం చేశారని, చట్టాన్ని ఖాతరు చేయలేదని వివరించింది.

ఈవీఎంలపై అనుమానాలొద్దు

- సీఈసీ సునీల్ అరోరా



పాట్నా : ఎన్నికల్లో ఓటమి చెందితే ఒకలా..గెలిస్తే మరొకలా రాజకీయ పార్టీలు వ్యవహరిస్తున్నాయని, ఒక ఫుట్‌బాల్ మాదిరిగా ఈవీఎంలతో రాజకీయ పార్టీలు ఆడుకుంటున్నాయని కేంద్ర ఎన్నికల కమిషనర్ సునీల్ అరోరా అన్నారు. ఈవీఎం పనితీరుపై రాజకీయ పార్టీలు వ్యక్తం చేస్తున్న ఆందోళనను ఉద్దేశించి ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రెండురోజుల బీహార్ పర్యటనలో ఉన్న ఆయన అక్కడ శనివారం మీడియాతో మాట్లాడుతూ..."ఈవీఎంల పనితీరును ప్రభావితం చేయటం సాధ్యమయ్యే పని కాదు. వివిధ రాష్ట్రాల్లో ఈవీఎంలపై ఆందోళన వ్యక్తం అవుతోంది. కొన్ని చోట్ల మాత్రమే సాంకేతిక సమస్యలు తలెత్తాయి. అంతే తప్ప...ఈవీఎంలను పూర్తిగా నమ్మవచ్చు. ఇటీవల జరిగిన ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో 1.76 లక్షల ఈవీఎంలను ఉపయోగించాం. కేవలం 6చోట్ల మాత్రమే పొరపాట్లపై ఫిర్యాదులు అందాయి. వాటిపై నిష్పక్షపాతంగా విచారణ జరిపా"మని అన్నారు.

వివక్ష.. యువకులు.. ఆగ్రహం..

మోడీకి 'అణగారిన' ప్రమాదం తప్పదా..?

- సార్వత్రికంలో చూసుకుంటామంటున్న దళితులు
- యూపీలో బీజేపీకి కష్టమే



యూపీలో దళిత యువకుల నిరసన (ఫైల్)



సంజయ్ జాతవ్

న్యూఢిల్లీ: నరేంద్ర మోడీ ప్రధానమంత్రి బాధ్యతలు చేపట్టిన తర్వాత.. దళితులపై దాడులు రోజురోజుకూ పెరుగుతూనే ఉన్నాయి. గుర్రం ఎక్కావని.. మీసం పెంచావని.. ఫేస్‌బుక్‌లో పేరు మార్చుకున్నావని... పెండ్లికి మంచి బట్టలు వేసుకున్నావని... మంచి చెప్పులు వేసుకున్నావని.. ఇక 'గోవు'/'గోమా' చెప్పాల్సిన పనేలేదు.. చనిపోయిన ఆవు చర్మం ఒలిచావని దాడి... అందుకు నిరసనగా వతుకోలులను ముట్టుకోమన్నందుకు చితక బాదడం... సహచర మంత్రులే వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తుంటే.. ప్రధాని మాత్రం మౌన ముద్ర వీడకపోవడం... అణచివేత నుంచి ఆగ్రహం పుట్టుకొస్తున్నది..

పెరిగిపోతున్న దాడులు, కులదురహంకార హత్యలు, వివక్ష, అసమానత వంటి వాటి పట్ల కేంద్రంపై వారు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. అణచివేతకు గురవుతున్న దళితులు తమ గళాన్ని వినిపించేందుకు రానున్న ఎన్నికల్లో తమ శక్తిని నిరూపిస్తామంటున్నారు. ఈ ఏడాది లోక్‌సభ ఎన్నికలే లక్ష్యంగా దళిత వ్యతిరేక ప్రభుత్వాన్ని గద్దెదించేందుకు ముఖ్యంగా యువకులు ఒక్కటవుతున్నారు.

పెండ్లి ఊరేగింపునకు పెద్ద పోరాటం...

200 మంది పోలీస్ ఎస్కార్ట్ మధ్య వరుడు సంజయ్ జాతవ్ గుర్రంపై ఎక్కి వధువు ఇంటికి వెళ్లగలిగాడు. గతేడాది జులైలో ఉత్తరప్రదేశ్‌లో జరిగిన దళితుడు సంజయ్ జాతవ్ పెండ్లి ఊరేగింపు చరిత్ర సృష్టించింది. ఉత్తరప్రదేశ్‌లో 80 ఏండ్ల తర్వాత ఆధిపత్యకులాలు అధికంగా ఉండే గ్రామం మీదుగా ఓ దళితుడు వెళ్ళడం ఇదే తొలిసారి. ఇదంతా జరగడానికి జాతవ్ పెద్ద పోరాటమే చేయాల్సి వచ్చింది. దాడులు.. అవమానాలు... చివరకు కోర్టును ఆశ్రయించగా పోలీసుల భారీ భద్రత నడుమ ఆయన పెండ్లి ఊరేగింపు సజావుగా సాగింది. ఈ విషయం అప్పట్లో దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ముఖ్యంగా దళితుల్లో నైతికబలాన్ని తీసుకొచ్చింది. మరి ఇప్పుడు జాతవ్ పరిస్థితి ఏమిటి? ఆయన కుటుంబానికి ఇప్పటికీ.. పోలీసులు భద్రత కల్పిస్తున్నారు. 'నేను సంప్రదాయ గోడలను బద్దలుకొట్టాను. ఈ ఒక్క విషయంలో మా దళిత వర్గం ప్రేరణ పొందుతున్నది' అని జాతవ్ తెలిపారు. ఇది దళిత యువకుల్లో మనో ధైర్యాన్ని నింపింది.. దాడులను ఎదుర్కొన్న యువకులను భయాందోళనలో కాలం వెళ్లదీస్తున్న ఘటనలూ అనేకం ఉన్నాయి.

యూపీలో బీజేపీకి కష్టమే

దేశరాజకీయాలను శాసించే యూపీలో మొత్తం 80 ఎంపీ సీట్లు ఉన్నాయి. 2014 ఎన్నికల్లో బీజేపీ 71 స్థానాలను గెలుపొందింది. అలాగే దేశవ్యాప్తంగా దళితులకు రిజర్వు అయిన మొత్తం 84 స్థానాల్లో సగానికిపైగా బీజేపీ గెలుపొందింది. ఈ ఏడాది జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఈ విజయాన్ని పునరావృతంచేయడం మోడీకి కష్టసాధ్యమే. ఈ నాలుగున్నరేండ్ల మోడీ పాలనలో కులంపేరుతో దళితులపై దాడులు అనేకం జరిగాయి. దీంతో దళితుల నుంచి బీజేపీకి తీవ్ర ప్రతిఘటన ఎదురుకానున్నది. బీజేపీకి దళితుల మద్దతు తగ్గిందని గతేడాది మేలో ఓ సర్వే స్పష్టం చేసిన విషయం తెలిసిందే. దళితులపై జరిగిన నేరాలు, వేధింపులు 2016లో పెరిగిపోయాయి. ఇందులో 25శాతం వరకు ఒక్క యూపీలోనే చోటుచేసుకోవడం గమనార్హం. అలాగే వారి నిరసన ఉద్యమాలు ఊపందుకున్నాయి. యూపీలో దళిత వ్యతిరేక ఓటు మాయావతి నేతృత్వంలోని బీఎస్పీ కలిసివచ్చే అవకాశం ఉన్నది. ఇప్పటికే అక్కడ ఎస్పీ-బీఎస్పీలు చేతులు కలిపిన విషయం తెలిసిందే. దళితులంతా బీజేపీకి వ్యతిరేకంగా ఉన్నారని జేఎన్‌యూ రిటైర్డ్ ప్రొఫెసర్ ఘనశ్యాం షా చెప్పారు. పాఠశాలలు, పబ్లిక్ వాటర్, పెండ్లి ఊరేగింపులు వంటి అనేక విషయాల్లో నేటికీ దేశవ్యాప్తంగా దళితులు వివక్షను ఎదుర్కొంటున్నారని తమ ప్రాథమిక హక్కులకు దూరమవుతున్నారు.

గళం విప్పుతున్న దళిత యువత

మరోపక్క, దేశవ్యాప్తంగా వివక్షను ఎదుర్కొంటున్న దళిత యువత తమ గళం విప్పుతున్నది. 'ఇది ఒక దళిత విషయం.. మీరు అర్థం చేసుకోలేరు' అని రాసి వున్న టీ-షర్టలను దళిత యువకులు ధరించి తన నిరసన గళాన్ని వినిపిస్తున్నారు. రానున్న ఎన్నికల్లో తమ శక్తిని నిరూపిస్తామంటున్నారు. ఈ ఏడాది లోక్‌సభ ఎన్నికల్లో దళిత వ్యతిరేక ప్రభుత్వాన్ని గద్దెదించడమే తమ లక్ష్యమని వారు అంటున్నారు. నిరుపేదలకు చెందిన చిన్నారులకు ఉచిత విద్య అందించడానికి 2015లో భీమ్ ఆర్మీ పేరిట ఏర్పాటు చేసిన దళిత గ్రూపునకు చంద్రశేఖర్ ఆజాద్‌లాంటి వారు కేంద్రంలోని మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉపన్యాసాలిస్తూ దళితుల్లో ప్రేరణను తీసుకొస్తున్నారు. అలాగే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని నిర్వీర్యంచేస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో కేంద్ర ప్రభుత్వ అలసత్వానికి వ్యతిరేకంగా దళిత సంఘాలు గతేడాది ఏప్రిల్‌లో దేశవ్యాప్త నిరసనలు, బంద్‌లు చేపట్టాయి. ఈ నిరసన కార్యక్రమాల్లో యువకులు పెద్దసంఖ్యలో పాల్గొనడం విశేషం. శాంతియుతంగా నిరసన ప్రదర్శనలు చేస్తున్నవారిపై పెత్తందారులు దాడులకు తెగబడ్డారు. ఈ సందర్భంగా 11 మంది దళితులు తమ ప్రాణాలను కోల్పోయారు. కాగా, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్‌లలో దళితులను అరెస్టు చేయడం, అక్రమ కేసులు బనాయించి జైళ్లలో పెట్టడం వారి ఆగ్రహాన్ని మరింత పెంచింది. దళితుల్లో ఉద్యమకాంక్ష పెరుగుతున్నదనీ, రానున్న కాలంలో ఇది ఇంకా తీవ్రమవుతుందని మిలాన్ వైష్ణవ్ అభిప్రాయపడ్డారు. ఆధిపత్యకులాల పార్టీగా ముద్రపడ్డ బీజేపీ దళితుల్లో విశ్వసనీయతను చూరగొని ఈ ఏడాదిలో జరగబోయే లోక్‌సభ ఎన్నికల్లో గెలుపొందడం కష్టసాధ్యమని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

అభివృద్ధిపై తప్పుడు అంకెలు

- చిదంబరం విమర్శ

న్యూఢిల్లీ : నిటి ఆయోగ్ ఇచ్చిన తప్పుడు అంకెలతో తమ ప్రభుత్వం మంచి వృద్ధి రేటు సాధించిందని బీజేపీ ప్రభుత్వం చెప్పుకుంటోందని కాంగ్రెస్ నేత, మాజీ ఆర్థిక మంత్రి చిదంబరం విమర్శించారు. గత యూపీఏ ప్రభుత్వ హయాంలో కంటే అత్యధిక అభివృద్ధి రేటును సాధించామని బీజేపీ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఆ అంకెలను ప్రతీ ఆర్థికవేత్త, గణాంకవేత్తలు తిరస్కరిస్తారని చిదంబరం ట్వీట్ చేశారు. గతంలో ప్రచురించిన సీఎస్ఓ సంఖ్యలు, ఆగస్ట్‌లో రియల్ సెక్టార్ స్టాటిస్టిక్స్‌లో ఎన్ఎస్‌సీ కమిటీ విడుదల చేసినవి మాత్రమే నమ్మదగినవని చిదంబరం అన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన అనంతరం యూపీఏ హయాంలో (2004-2009) మాత్రమే ఒక్క ఏడాది అత్యుత్తమ అభివృద్ధిరేటును సాధించిందని ఆయన పేర్కొన్నారు. బీజేపీ ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి ఈ 4, 5 సంవత్సరాలలో దేశ రుణభారం 50 శాతం పెరిగి 82 లక్షల కోట్ల రూపాయలకు చేరుకుందని కాంగ్రెస్ సీనియర్ నేత అహ్మద్ పటేల్ ట్వీట్ చేశారు.

మతోన్మాద పాలనకు ముగింపు పలకండి

బెంగాల్‌లో డీవైఎఫ్‌ఐ ర్యాలీలో ఏచూరి పిలుపు

దారివిత (ఇస్లాంపూర్) : దేశంలోనూ, రాష్ట్రంలోనూ బీజేపీ, తృణమూల్ కాంగ్రెస్‌లు ప్రజాస్వామ్యాన్ని నాశనం చేస్తున్నాయని సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి విమర్శించారు. డీవైఎఫ్ఐ పశ్చిమ బెంగాల్ రాష్ట్ర కమిటీ నిర్వహించిన మెగా ర్యాలీలో ఏచూరి ప్రసంగించారు. ఇస్లాంపూర్ సబ్‌డివిజన్‌లోని దారివిత పాఠశాలలో పోలీస్‌కాల్పులకు బీజేపీ, టీఎంసీలు మతం రంగును పూయడాన్ని వ్యతిరేకిస్తూ డీవైఎఫ్ఐ ఈ ర్యాలీని నిర్వహించింది. ఈ ర్యాలీలో 3 వేలకుపైగా డీవైఎఫ్ఐ కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ ర్యాలీలో సీతారాం ఏచూరితో పాటు సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు, స్థానిక ఎంపీ ఎండి సలీం, డీవైఎఫ్ఐ జనరల్ సెక్రటరీ అభోయ్ ముఖర్జీ, డీవైఎఫ్ఐ ఇతర నాయకులు పాల్గొన్నారు. వామపక్ష ఉద్యమంలో పాల్గొనందుకు ఈ జిల్లాలోనే 3 వేల మందిపై అక్రమ కేసులు నమోదు చేశారని ఏచూరీ అన్నారు. వీటిలో ఎక్కువగా యువ కార్యకర్తలపై నమోదు చేశారని తెలిపారు. బీజేపీ ప్రభుత్వ విధానాలతో దేశంలో కేవలం 2018లోనే 10 లక్ష మంది తమ ఉద్యోగాలను కోల్పోయారని, మోడీ ప్రభుత్వ విధానాలతో రైతుల ఆత్మహత్యలు కొనసాగుతూనే ఉన్నాయని విమర్శించారు. దేశం నుంచి బీజేపీ -ఆరెస్సెస్‌లను తరిమికొట్టాల్సిన బాధ్యత సామాన్య ప్రజలపై ఉందన్నారు. ప్రజాస్వామ్యంపై దాడులు చేస్తున్న బీజేపీకి, తృణమూల్ కాంగ్రెస్‌కు సారూప్యత ఉందని విమర్శించారు. ప్రజలను దోచుకుంటున్న ఈ రెండు పార్టీలు ప్రజలను అసంతృప్తిని అణచడానికి ఎన్నికల ముందు హామీలు ఇస్తున్నాయని విమర్శించారు.

దారివిత పాఠశాలలో పోలీస్‌కాల్పులు జరగడంతో ఆ ప్రాంతంలో మత ఉద్రికత్తలు తలెత్తాయి. వీటిని నివారించడానికి వామపక్ష కార్యకర్తలు తీవ్ర కృషిచేశారు. అయితే బాధితులకు న్యాయం చేయడానికి బదులు పోలీసులు అక్రమ కేసులు బనాయించారు. సీపీఐ(ఎం) స్థానిక కమిటీ సభ్యులు, యువ కార్యకర్త నిఖిల్ సిక్కదర్‌ను పోలీసులు అసత్య ఆరోపణలతో అరెస్టు చేశారు.

నీట్ నిబంధనల ఫైల్ అదృశ్యం

వెల్లడించిన మెడికల్ కౌన్సిల్

న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా వైద్య, దంత కళాశాలల్లో ప్రవేశాలకు నిర్వహించే నీట్ (ఎన్ఈఈటీ) పరీక్షల కోసం కొత్తగా రూపొందించిన నిబంధనలతో కూడిన కీలకమైన ఫైల్ ఒకటి కనిపించడం లేదు. ఆయా కళాశాలల్లో ప్రవేశం పొందేందుకు అర్హతలను ప్రవేశ పరీక్షలో పొందిన పర్సంటేజ్ నుండి పర్సంటైల్‌కు మారుస్తూ కొత్త నిబంధనలను మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎంసీఐ) రూపొందించింది. ప్రవేశాల ప్రక్రియలో ఇలా మార్పు ఎందుకు చేయాల్సి వచ్చిందో ఎంసీఐ ఆ నిబంధనల పత్రంలో వివరించింది. కొత్త నిబంధనల ప్రకారం తక్కువ మెరిట్ కలిగిన విద్యార్థులకు కూడా వైద్య, దంత కళాశాలల్లో ప్రవేశం లభిస్తుంది. దీని వల్ల ప్రైవేటు కళాశాలలు కూడా లాభాలు పొందుతాయి . అంతేకాక కేవలం అర్హులుగా ప్రకటించిన ధనికులైన విద్యార్థులు సీట్లు కొనుక్కునే చదువుకునే అవకాశం ఉంది. ఈ నిర్ణయానికి సంబంధించిన ఫైల్ ఇప్పుడు ప్రభుత్వం వద్ద గల్లంతయ్యింది. ఫైల్ గల్లంతైనట్టు ఎంసీఐ నిర్ధారించింది. ఈ ఫైల్‌కు సంబంధించిన వివరాలను కోరుతూ న్యాయవాది, సామాజిక కార్యకర్త దేవ్ అశిష్ భట్టాచార్య 2018 డిసెంబరులో సమాచార హక్కు చట్టం కింద పిటిషన్ దాఖలు చేశారు. నీట్‌కు కోసం రూపొందించిన కొత్త నిబంధనలకు సంబంధించిన ఫైల్ నోటింగ్‌లు, నోట్ షీట్లు తదితర వివరాలతో కూడిన పత్రాల కాపీలు కావాలని పిటిషనర్ తన అభ్యర్థనలో కోరారు. కొత్త నిబంధనలు అమలు చేసే విధంగా మెడికల్ కౌన్సిల్ చట్టం నిబంధనల్లో ఈ మార్పులను చేర్చారా లేదా అనే విషయాన్ని కూడా తెలియచేయాలని ఆయన కోరారు. దీనికి డిసెంబరు 19న ఎంసీఐ సభ్యులు స్పందిస్తూ దానికి సంబంధించిన ఫైల్ కనిపించడం లేదని, అందువల్ల కోరిన సమాచారాన్ని పత్రాలను అందించలేక పోతున్నామని తెలిపింది. దీంతో ఈ ఫైల్ కనిపించకపోవడంపై ఢిల్లీ పోలీసు కమిషనర్ అమూల్య పట్నాయక్‌కు జనవరి 14న భట్టాచార్య ఫిర్యాదు చేశారు. ఈ విషయమై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

ఢిల్లీ పోలీసులకు చుక్కెదురు

- న్యాయవిభాగం అనుమతి లేకుండా కన్నయ్య, ఇతర విద్యార్థులపై చార్జ్‌షీటు దాఖలు చేయడాన్ని ప్రశ్నించిన కోర్టు

న్యూఢిల్లీ: జేఎన్‌యూ విద్యార్థి సంఘం మాజీ అధ్యక్షులు కన్నయ్య కుమార్, ఉమర్ ఖాలీద్‌లతో పాటు మరికొందరిపై ఇటీవల చార్జ్‌షీటు దాఖలు చేసిన ఢిల్లీ పోలీసులకు చుక్కెదురైంది. ఈ విషయంలో న్యాయవిభాగం అనుమతి లేకుండా పోలీసులు చార్జ్‌షీటు దాఖలు చేయడాన్ని ఢిల్లీలోని పాటియాల హౌజ్ కోర్టు తప్పుబట్టింది.' మీకు(ఢిల్లీ పోలీసులు) న్యాయ విభాగం నుంచి అనుమతి లేదు. అలాంటప్పుడు విద్యార్థులపై చార్జ్‌షీటు ఎందుకు దాఖలు చేశారు?' అని న్యాయస్థానం ఢిల్లీ పోలీసులను ప్రశ్నించింది.

న్యాయవిభాగం నుంచి అనుమతి కోసం పదిరోజుల గడువు ఇవ్వాలని కోర్టును ఢిల్లీ పోలీసులు కోరారు. దీంతో స్పందించిన మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ దీపక్ షెరావత్.. పోలీసులకు ఫిబ్రవరి 6 వరకు గడవు విధించారు.



పార్లమెంటుపై దాడి వ్యూహకర్త అఫ్జల్ గురు స్మారకార్థం 2016, ఫిబ్రవరి9న జేఎన్‌యూ క్యాంపస్‌లో చేపట్టిన ర్యాలీ, దేశవ్యతిరేక నినాదాలకు కన్నయ్య కారణమని ఆయనతో పాటు మరికొందరు విద్యార్థులపై అప్పట్లో ఎఫ్ఐఆర్ నమోదైంది. దాదాపు మూడేండ్ల అనంతరం ఈనెల 14న కన్నయ్య, ఉమర్ ఖాలీద్, అనిర్‌భన్ భట్టాచార్యలతో జమ్మూకాశ్మీర్‌కు చెందిన మరో ఏడుగురు విద్యార్థులపై ఢిల్లీ పోలీసులపై 1200 పేజీలతో కూడిన చార్జ్‌షీటును దాఖలు చేసిన విషయం తెలిసిందే.

లైంగికదాడి కేసు వెనక్కి తీసుకోలేదని..

- బాధితురాలిని కాల్చిచంపిన దుండగుడు
- గుర్గావ్‌లో ఘటన



చండీగఢ్ / లక్నో: లైంగికదాడి కేసును వెనక్కి తీసుకోలేదని బాధితురాలిని కాల్చి చంపాడు ఓ దుండగుడు. ఈ ఘటన హర్యానాలోని గుర్గావ్‌లో చోటుచేసుకున్నది. బాధితురాలి తల్లి తెలిపిన వివరాల ప్రకారం.. బాధిత యువతి ఓ నైట్ క్లబ్‌లో డ్యాన్సర్. ఆ క్లబ్‌లోనే ఫరీదాబాద్‌లోని టిగావ్‌కు చెందిన సందీప్‌కుమార్ అనే వ్యక్తి బౌన్సర్. 2017 మార్చిలో ఆ యువతిపై సందీప్‌కుమార్ లైంగికదాడికి ఒడిగట్టాడు. అనంతరం ఈ విషయంలో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇక అప్పటి నుంచి లైంగికదాడి కేసును వెనక్కి తీసుకోవాలంటూ ఆ యువతిని సందీప్ బెదిరించేవాడు. అయినా ఆ యువతి కేసును వెనక్కి తీసుకోవడానికి నిరాకరించేది. ఈ క్రమంలో సందీప్.. నతాపూర్‌లోని యువతి ఇంటికి ఉదయం వెళ్లాడు. కేసు వెనక్కి తీసుకోవాలని కోరాడు. కొన్ని నిమిషాలు మాట్లాడేది ఉన్నదని నమ్మించి ఆ యువతిని కారులో ఎక్కించుకున్నాడు. అనంతరం ఆ కారును దూరంగా తీసుకెళ్లాడు. కేసు వాపసు తీసుకోవాలని లేకపోతే యువతిని చంపేస్తానని ఆమె తల్లికి ఫోన్ చేసి బెదిరించాడు. కొద్దిసేపటికే యువతిని ఆ దుండగుడ కాల్చి చంపాడు. గుర్గావ్-ఫరీదాబాద్ ఎక్స్‌ప్రెస్‌వేపై యువతి మృతదేహాన్ని గమనించిన ఓ వ్యక్తి పోలీసులకు సమాచారం అందించాడు. యువతి తల్లి ఫిర్యాదు మేరకు సందీప్‌పై కేసు నమోదు చేసినట్టు గుర్గావ్ పోలీసులు వెల్లడించారు.

యూపీలో యువతిపై సామూహిక లైంగికదాడి

యూపీలో దారుణం చోటుచేసుకున్నది. ముజఫర్‌నగర్ జిల్లాలో ఓ యువతి(22)పై ఇద్దరు దుండగులు సామూహిక లైంగికదాడికి తెగబడ్డారు. ఈఘటన కాక్రోలీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఫిరోజాబాద్ గ్రామంలో శుక్రవారం చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఘటన జరిగిన రోజు బాధితురాలు తన ఇంట్లో ఒంటరిగా ఉంది. రోజువారి పనుల నిమిత్తం యువతి తల్లిదండ్రులు బయటకెళ్లారు. యువతి ఇంట్లో ఎవరూ లేరని అదే గ్రామానికి చెందిన గౌరవ్, రవిలు నిర్ధారించుకున్నారు. అనంతరం ఆ యువతి ఇంట్లోకి ఆ ఇద్దరూ చొచ్చుకెళ్లారు. తమ కోరిక తీర్చాలని యువతిని బలవంత పెట్టారు. తనపై అఘాయిత్యానికి ఒడిగట్టవద్దని యువతి ఎంత వేడుకున్నప్పటికీ ఆ కామాంధులు కనికరించలేదు. చివరకు గౌరవ్, రవిలు బలవంతంగా ఆ అమాయకురాలిపై సామూహిక లైంగికదాడికి దిగారు. ఈ ఘటన గురించి ఎవరికైనా చెబితే అనంతర పరిణామాలు తీవ్రంగా ఉంటాయని యువతిని వారు బెదిరించారు. ఆ తర్వాత అక్కడ నుంచి ఆ ఇద్దరు పారిపోయారు. అయితే తమ కూతురిపై జరిగిన అఘాయిత్యాన్ని పసిగట్టిన యువతి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందుతుల కోసం గాలింపును ముమ్మరం చేశారు. వైద్య పరీక్షల కోసం యువతిని ఆస్పత్రికి పోలీసులు తరలించారు.



చరిత్ర లిఖించనున్న

అసోం రైఫిల్స్ మహిళా దళం

న్యూఢిల్లీ: ఈ సారి రిపబ్లిక్ డే వేడుకల్లో అసోం రైఫిల్స్ మహిళా దళం చరిత్ర లిఖించనున్నది. గతంలో ఎన్నడూ లేని విధంగా తొలిసారిగా అందరూ మహిళలతో కూడిన దళం వేడుకల్లో పాల్గొననున్నది. ఈ వేడుకల సందర్భంగా రాజ్‌పథ్ వద్ద రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్‌కు వారంతా గౌరవ వందనం సమర్పించనున్నారు. దేశం కోసం ప్రాణాలు అర్పించిన పలువురు సైనిక కుంటుంబాలకు చెందిన మహిళలు ఈ దళంలో పాలుపంచుకోనున్నారు. ఇది 2015లో ఉనికిలోకి వచ్చింది. ఈ దళంలో సభ్యురాలిగా ఉన్న సునీతా థాప.. ఓ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన తన భర్త స్తానంలో నియమితులయ్యారు. అలాగే మరో రైఫిల్..గాయత్రి శర్మ.. 2001లో మృతి చెందిన తన తండ్రి స్థానంలో దళంలో చేరింది. 144 మంది సభ్యులుండే ఈ దళానికి మేజర్ ఖుష్బూ కోన్వార్ ప్రాతినిధ్యం వహించనున్నారు.

శ్రీనగర్‌లో భారీగా హిమపాతం

- కార్గిల్‌లో మైనస్ 18.9 డిగ్రీలు నమోదు

శ్రీనగర్ : శ్రీనగర్‌లో భారీగా మంచుకురుస్తున్నది. దీంతో విమాన రాకపోకలకు అంతరాయం కలిగింది. పలు విమానాలు ఆలస్యంగా నడుస్తుండగా, మరికొన్నిటిని రద్దు చేసినట్టు అధికారులు ప్రకటించారు. శ్రీనగర్ ప్రాంతంలో గతంలో ఎన్నడూ లేని విధంగా మంచుకురుస్తోందని వాతావరణశాఖ అధికారులు ప్రకటించారు. రన్‌వే అనుకూలంగా లేకపోవడంతో విమానాలు రద్దు చేయాల్సివచ్చిందని విమానాశ్రయ అధికారులు తెలిపారు. ఒకటీ రెండు రోజుల్లో పరిస్థితి మెరుగుపడొచ్చని అన్నారు. శనివారం నుంచి సోమవారం వరకూ పలు ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించారు. మంచుకూడా ఎక్కువగానే కురుస్తుందని తెలిపారు. శుక్రవారం రాత్రి మైనస్ 1.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. కాశ్మీర్ వ్యాలీకి ముఖద్వారమైన ఖ్వాజీగండ్‌లో మైనస్ 3.4 డిగ్రీలు, కొకెర్నాగ్‌లో మైనస్ 4.5 డిగ్రీలు, కుప్వారాలో 0.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గుల్మార్గ్‌లో మైనస్ 7.0 డిగ్రీలు, పెహల్గాంలో 4.4 డిగ్రీలు, లడఖ్‌లో మైనస్ 9.2, లేహ్‌లో మైనస్ 16.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కార్గిల్లో అత్యధికంగా మైనస్ 18.9 డిగ్రీలు ఉష్ణోగ్రత నమోదైంది. ఈ సీజన్లో ఇదే రికార్డని అధికారులు తెలిపారు. ప్రసుత్తం కాశ్మీర్ 'చిల్లై కలాన్'గా పిలుచుకునే ఈ 40 రోజులపాటు అత్యంత చలిగా ఉంటుంది. వాస్తవంగా చిల్లై కలాన్(ఎక్కువ చలి) జనవరి 31తో ముగుస్తుంది. ప్రస్తుతం కాశ్మీర్‌లో చలిగాలులు తీవ్రంగా వీస్తుండటంతో మరో 20 రోజులపాటు కొనసాగనుందని అధికారులు అంచనా వేస్తున్నారు.



యువత మేల్కొంటేనే దేశ భవిష్యత్

లక్ష్యంతో ముందుకెళ్లాలి.. సమాజమే కుటుంబంగా భావించాలి

- పౌరహక్కుల పోరాట యోధులు అన్నా హజారే

గ్రామాలను దత్తత తీసుకోవాలి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

యువత మేల్కొంటేనే దేశ భవిష్యత్ ఉంటుందని, లేకుంటే రాజకీయ నాయకుల, అవినీతి పరుల చేతుల్లో నలిగిపోతుందని పౌరహక్కుల పోరాట యోధులు, పద్మభూషన్ అవార్డు గ్రహీత అన్నా హజారే అన్నారు. దేశానికి ఎంతో చేయాలని యువతకు ఉంటుందని, కానీ, ఎలా చేయాలో తెలియక వెనుకడుగు వేస్తున్నదన్నారు. యువతకు దశ, దిశ తెలిస్తే అద్భుత విజయాలు సాధిస్తారన్నారు. మొదలు చిన్న చిన్న లక్ష్యాలను పెట్టుకుని ఒక్కో దాన్ని చేరుకుంటూ జీవిత లక్ష్యాన్ని ఏర్పర్చుకుని దాని కోసం పాటుపడాలని, లక్ష్యాల సాధనలో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొంటూ యువత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలోని నోవాటెల్‌లో తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో అంతర్జాతీయ యువజన నాయకత్వ సదస్సు శనివారం ప్రారంభమైంది. జాగృతి అధ్యక్షురాలు కవిత, అన్నాహజారేతో కలిసి జ్యోతిప్రజ్వలన చేసిన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం జరిగిన 'గాంధేయ మార్గంలో సుస్థిర అభివృద్ధి, ఆవిష్కరణలు' అనే అంశంపై జరిగిన సదస్సులో అన్నా హజారే మాట్లాడుతూ.. యువకునిగా ఉన్నప్పుడు నా దగ్గర డబ్బు, పవర్ ఏమీ లేవని, జీవితంపై అసంతృప్తితో 25 ఏండ్ల వయస్సులో ఆత్మహత్య చేసుకోవాలనుకున్న క్రమంలోనే గాంధీ, వివేకానంద పుస్తకాలను చదివి నిర్ణయాన్ని మార్చుకున్నానన్నారు. నాలుగు గోడల మధ్య మందిరాల్లో చేసే సేవ కన్నా గ్రామ సేవ ముఖ్యమన్నారు. యువత గ్రామాలను దత్తత తీసుకుని అభివృద్ధి చేయాలని సూచించారు. గ్రామాల అభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. జీవితంలో లక్ష్యాన్ని చేరాలంటే కొన్నింటిని త్యాగాలు చేయాల్సిందేనని, అందులో భాగంగానే తాను పెండ్లిని పరిత్యజించానని చెప్పుకొచ్చారు. అభివృద్ధి కోసం ప్రకృతిని ధ్వంసం చేయొద్దని హితవు పలికారు. రాలేగావ్ సిద్ధిలో వర్షపు నీటి నిల్వ కోసం తాము చేపట్టిన నీటి సంరక్షణ చర్యలను వివరించారు. జీవితమంటే తినటం, తాగటం, చావటం కాదని, జీవితం ఆదర్శంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. కోటీశ్వరులకు విగ్రహాలు పెట్టి జయంతిలు, వర్ధంతిలు జరుపరని, అదే దేశ, సామాజిక సేవలు చేసిన ఎల్లకాలం ప్రజలు గుర్తుకు పెట్టుకుంటారని పలువురి మహనీయులను ప్రస్తావించారు. అవినీతి అంతం కోసం పోరాటం చేయటం వల్లనే నేడు ఆర్టీఏ యాక్టు వచ్చిందని గుర్తుచేశారు. ఎంపీ కవిత మాట్లాడుతూ..ప్రపంచంలో ఉన్న సమస్యలన్నీ మనం సృష్టించుకున్నవేనని అన్నారు. సుస్థిర అభివృద్ధికి యువత ఉత్సాహంగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. మన వల్ల ఉద్భవించిన కొన్ని సమస్యలైనా ఈ సదస్సు ద్వారా పరిష్కారం అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. సమస్యల పరిష్కారం కోసం యువత కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సదస్సులో 135 దేశాలకు చెందిన 550 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. లింగసమానత్వం, తాగునీరు-పరిశుభ్రత, వాతావరణంలో మార్పులు-మానవాళి బాధ్యత, పర్యావరణ అనుకూల విద్యుత్, నాణ్యమైన విద్య-ఉద్యోగ అవకాశాలు, తదితర అంశాలపై చర్చాగోష్ఠిలను నిర్వహించారు. ఎంపిక చేయబడిన 8 మందికి జాగృతి తరపున అన్నాహజారే, కవిత కలిసి ఫెలోషిప్ అవార్డులను అందజేశారు. అన్నా హజారేను వేదికపైకి తోల్కొని వెళ్లే క్రమంలో కవిత కింద పడిపోయింది. వెంటనే తేరుకున్న ఆమె అతిథులును తీసుకుని ముందుకెళ్లారు.

30 నుంచి నిరాహార దీక్ష : అన్నా హజారే

లోక్‌పాల్, లోకాయుక్త 2014 చట్టరూపం దాల్చినా, నేటికీ లోక్‌పాల్‌ను నియమించకపోవడాన్ని నిరసిస్తూ ఈనెల 30వ తేదీ నుంచి తన స్వగ్రామమైన రాలేగావ్ సిద్ధిలో నిరాహార దీక్ష చేపట్టనున్నట్టు గాంధేయవాది, మానవ హక్కుల పోరాట యోధులు అన్నాహజారే ప్రకటించారు. హైదరాబాద్ హెచ్ఐసీసీలోని నోవాటెల్‌లో జరుగుతున్న తెలంగాణ జాగృతి అంతర్జాతీయ యువజన నాయకత్వ సదస్సులో పాల్గొనటానికి వచ్చిన ఆయన శనివారం మీడియాతో మాట్లాడారు. తాను అధికారంలోకి వచ్చిన వెంటనే లోక్‌పాల్‌ను నియమిస్తానని ఎన్నికలకు ముందు నరేంద్ర మోడీ ప్రకటించారని, ప్రధాని అయ్యాక ఏమీ చేయలేదని విమర్శించారు. దీనికి నిరసనగా దీక్షకు దిగనున్నట్టు తెలిపారు.

రక్షణరంగ సమ్మెకు సీఐటీయూ సంపూర్ణ మద్దతు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రక్షణరంగ పరిరక్షణ కోసం ఈనెల 23,24,25 తేదీల్లో మూడు రోజులపాటు జరిగే దేశవ్యాప్త సమ్మెకు సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సీఐటీయూ) సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ మేరకు సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు, ప్రధాన కార్యదర్శి ఎం సాయిబాబు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. మేక్ ఇన్ ఇండియా పేరుతో వంద శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ), ప్రయివేటీకరణ చర్యలను గత నాలుగున్నరేండ్లుగా కేంద్ర ప్రభుత్వం శరవేగంగా అమలు జరిపిందని తెలిపారు. ఫలితంగా 42 ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలు, 52 డీఆర్‌డీవో ల్యాబ్స్, 9 ఆర్మీ ఆధారిత వర్క్‌షాప్‌లు, ఇఎంఈ వర్క్‌షాప్‌లు, ఆర్మీ డిపోలు, మిలటరీ ఫామ్స్, అనేక ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ తదితర రక్షణరంగ సంస్థల నిర్వీర్యానికి దారి తీసిందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రక్షణ శాఖ సివిల్ ఉద్యోగుల స్ట్రగుల్ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 23,24,25 తేదీల్లో మూడు రోజులపాటు దేశవ్యాప్త సమ్మె జరగనుందని తెలిపారు. ఏఐడీఈఎఫ్, బీపీఎంఎస్, ఐఎన్‌డీడబ్ల్యూఎఫ్ ఉద్యోగ ఫెడరేషన్లు సంయుక్తంగా సమ్మెకు సన్నాహాలు ప్రారంభించాయని పేర్కొన్నారు. ఈ రంగంలోని ఉద్యోగుల హక్కులకే పరిమితం కాకుండా దేశ రక్షణలో కీలక పాత్ర వహిస్తున్న రక్షణరంగ పరిరక్షణ ప్రధాన అంశంగా ఈ సమ్మె జరుగుతుందని తెలిపారు. దేశ విశాల ప్రయోజనాల కోసం రక్షణరంగ ఉద్యోగులు, కార్మికులు సమ్మెకు సన్నద్ధమవుతున్నారని పేర్కొన్నారు. ఈ దేశభక్తియుత సమ్మెకు రాష్ట్రంలో కార్మికవర్గం, ప్రజానీకం అండగా నిలవాలని కోరారు.

చీరలు, బ్యాట్‌లు పట్టివేత

- ఓటర్లకు పంచేందుకు సిద్ధమౌతుండగా స్వాధీనం



పట్టుబడ్డ చీరలు

నవతెలంగాణ-వేములవాడరూరల్/ముస్తాబాద్

గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభపెట్టి ఎలాగైనా గెలిచేందుకు సర్పంచ్ అభ్యర్థులు అన్ని ప్రయత్నాలూ చేస్తున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రూరల్ మండలంలోని మల్లారం గ్రామంలో గ్రామపంచాయతీ ఎన్నికల్లో వార్డు సభ్యుడిగా పోటీ చేస్తున్న అభ్యర్థి ఓటర్లకు పంచేందుకు సిద్ధం చేసిన చీరలను శనివారం ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు పట్టుకున్నారు. గ్రామంలోని 9 వార్డులో పోటీ చేస్తున్న వెంకటిగౌడ్‌కు అనుకూలంగా అదే గ్రామానికి చెందిన నర్సయ్య మహిళలకు చీరలను పంపిణీ చేసేందుకు సిద్ధమౌతుండగా సమాచారం అందుకున్న అధికారులు నర్సయ్య ఇంట్లో సోదాలు చేశారు. తనిఖీల్లో లభ్యమైన 20 చీరలను సీజ్ చేశారు.

ముస్తాబాద్ మండలం బద్దనకల్ గ్రామంలో సర్పంచ్ అభ్యర్థి చిగురు ప్రవళిక ప్రచారంలో భాగంగా శనివారం ప్లాస్టిక్ క్రికెట్ బ్యాట్‌లు పంపిణీ చేస్తుండగా ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం పట్టుకుని సీజ్ చేసింది. ఎన్నికల నియమ నిబంధనలకు ప్రచారం చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం అధికారి రమేష్ హెచ్చరించారు.

రాజకీయ రచ్చ...

దాడికి యత్నించారని ఒక గ్రూపు అవాస్తవమంటూ మరో గ్రూపు..

- పరస్పర ఆరోపణలతో దిష్టిబొమ్మలు దహనం



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న టీఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ-బయ్యారం

దాడికి యత్నించారని ఒకరు.. అది అవాస్తవమంటూ మరొకరు.. పరస్పర ఆరోపణలతో ఇరు రాజకీయ పార్టీల గ్రూపులు దిష్టిబొమ్మలు దహనం చేసుకున్నాయి. దీంతో ఘర్షణ వాతావరణం ఏర్పడింది. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం ఉప్పలపాడులో శనివారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి..

టీఆర్ఎస్ బలపర్చిన సర్పంచ్ స్థానాల గెలుపు కోసం వైస్ ఎంపీపీ, టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మూల మధుకర్‌రెడ్డి శుక్రవారం రాత్రి ప్రచారం నిర్వహించారు. ఆ తర్వాత మధుకర్‌రెడ్డి కారులో స్వగ్రామైన లక్ష్మినర్సింహాపురం వెళ్తున్నారు. మార్గమధ్యలో ఉప్పలపాడులో కాంగ్రెస్, బీజేపీ, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ కార్యకర్తలందరూ మూకుమ్మడిగా వచ్చి తన కారును ఆపి దాడికి యత్నించినట్టు మధుకర్‌రెడ్డి అన్నారు. తాము చేసిన అభివృద్ధిని ఓర్వలేకే దాడికి యత్నించారని ఆరోపించారు. ఈ ఘటనను నిరసనగా ఉప్పలపాడు సెంటర్‌లో ధర్నా చేశారు. దిష్టిబొమ్మ దహనం చేసేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో టీఆర్ఎస్ నాయకులకు, పోలీసులకు మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. గ్రామ పంచాయతీ ఎన్నికల కోడ్ అమలులో ఉందనీ, ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం సరికాదనీ ఎస్ఐ మురళీధర్‌రాజ్ నచ్చజెప్పినా వినకుండా దిషిబొమ్మ దహనం చేశారు. దీంతో ఘర్షణ వాతావరణం నెలకొంది.

అయితే, టీఆర్ఎస్ నాయకుల ఆరోపణలను కాంగ్రెస్, బీజేపీ, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ కార్య కర్తలు ఖండించారు. మధు కర్‌రెడ్డి దిష్టిబొమ్మకు మెడలో చెప్పుల దండవేసి ఊరేగింపు చేసి దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ వార్డు సభ్యులు బాణోతు పద్మ మాట్లాడుతూ.. మధుకర్‌రెడ్డి గిరిజనుల పట్ల చులకనభావంతో మాట్లాడటం సరికాదనీ, టీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా వేరే పార్టీలో తిరిగితే బెదిరింపులకు పాల్పడటం, డబ్బులు ఎరజూపి విత్‌డ్రా చేసుకోవాలని ఒత్తిడి చేయడం ఎంత వరకు సమంజసమనీ ప్రశ్నించారు. తనను విత్ డ్రా చేసుకోవాలని బెదిరించారనీ, రూ.30 వేలు ఇస్తామని అన్నారనీ చెప్పారు.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

- వాహనాలు, నగదు స్వాధీనం... పీడీ యాక్ట్ నమోదు
- చర్లపల్లి సెంట్రల్ జైలుకు తరలింపు



నవతెలంగాణ-సూర్యాపేట

కదులుతున్న వాహనాల్లో ఉన్న వస్తువులను దొంగిలిస్తున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠాను సూర్యాపేట జిల్లాలో శనివారం పట్టుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఎస్పీ వెంకటేశ్వర్లు విలేకర్లకు వెల్లడించారు. రాజస్థాన్ పాలి జిల్లాకు చెందిన శర్వాన్ లాల్ చౌదరి, రావుదేవ్ జాథ్, ప్రకాష్ కమావత్ ముఠాగా ఏర్పడి జాతీయ, రాష్ట్ర రహదారులపై ప్రయాణించే గూడ్స్ వాహనాలను టార్గెట్ చేసి దొంగతనాలకు పాల్పడేవారు. వాహనాలు కదులుతున్న సమయంలో వాటిపైకి చాకచక్యంగా ఎక్కి వాహనంపై ఉన్న టార్పాలిన్ కవర్‌ను కట్ చేసి అందులో విలువైన వస్తువులను ఇతర వాహనంలోకి ఎక్కించేవారు. ఈ క్రమంలో స్థానిక పోలీసులు గురువారం మొబైల్ ట్రాకింగ్ ద్వారా వీరి కదలికలను గమనించారు. నిఘా పెంచి వారిని అరెస్టు చేశారు. వీరి వద్ద స్కార్పియో, రెండు లక్షల 75 వేల నగదు, డీసీఎం వాహనంతో పాటు 194 కాటన్ లూపిన్ కంపెనీ మెడిసిన్, వి గార్డ్ ఎలక్ట్రికల్ గూడ్స్, 111 కాటన్‌ల మారుతి సుజుకి ఇంజన్ ఆయిల్, వాహనం స్వాధీనం చేసుకున్నారు. వీరు దొంగిలించిన వస్తువుల విలువ రూ.కోటి 15 లక్షలు ఉంటుందని ఎస్పీ తెలిపారు. ముగ్గురిపై పీడీ యాక్ట్ పెట్టి కలెక్టర్‌కు నివేదిక సమర్పించారు. వీరిని చర్లపల్లి జైలుకు తరలించారు. శర్వాన లాల్ చౌదరిపై తెలుగు రాష్ట్రాల్లో 38 కేసులు, రాందేవ్ జాత్ పై 13 కేసులు, ప్రకాష్ కమావత్‌పై 13 కేసులు నమోదై ఉన్నాయి. 2018లో సూర్యాపేటలో 1, హయత్‌నగర్‌లో 1, శంషాబాద్‌లో రెండు, రాజీవ్ గాంధీ విమానాశ్రయంలో ఒక కేసు నమోదయిందని ఎస్పీ వివరించారు. వీరిని పట్టుకున్న పోలీసులను అభినందించారు. ఈ సమావేశంలో సీఐ శివ శంకర్ పాల్గొన్నారు.

446 కేజీల గంజాయి పట్టివేత

డీసీఎం వ్యాన్, ట్రాక్టర్, బైక్‌లు సీజ్

- పోలీసుల అదుపులో నిందితులు



నవతెలంగాణ-బూర్గంపాడు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం సంజీవరెడ్డిపాలెంలో వాహనాల్లో తరలిస్తున్న గంజాయిని పట్టుకున్నట్టు పాల్వంచ డీఎస్పీ సురేంద్రర్‌రావు తెలిపారు. శనివారం బూర్గంపాడు పోలీస్ స్టేషన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ..

బూర్గంపాడు నుంచి పాల్వంచ వైపు వెళ్తున్న ప్రధాన రహదారి పక్కన సంజీవరెడ్డిపాలెం గ్రామశివారులో తెల్లవారుజామున గంజాయిని ఓ ట్రాక్టర్‌లో తరలించారన్నారు. అక్కడి నుంచి ఐచర్ వ్యాన్‌లోకి మారుస్తున్న క్రమంలో పోలీసులు పట్టుకున్నట్టు చెప్పారు. రాత్రివేళ పెట్రోలింగ్ చేస్తున్న సమయంలో వాహనాలు రోడ్డు పక్కన నిలిపి ఉంచడాన్ని గమనించిన ఎస్ఐ అనుమానం వచ్చి తనిఖీ చేసేందుకు పోలీస్ వాహనాన్ని ఆపుతుండగానే నలుగురైదుగురు పరారైనట్టు చెప్పారు. ఘటనా స్థలంలో వదిలివెళ్లిన రూ.53.06 లక్షల విలువ చేసే 76 ప్యాకెట్లల్లో ఉన్న 446 కేజీల గంజాయి, ఐచర్ వ్యాన్, ట్రాక్టర్, ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. వాటితో పాటు మహబూబాబాద్ జిల్లా చిన్న గూడూరు మండలానికి చెందిన ప్రశాంత్, ప్రవీణ్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్టు డీఎస్పీ తెలిపారు. ఈ సమావేశంలో పాల్వంచ సీఐ, బూర్గంపాడు ఎస్ఐలున్నారు.

51 కిలోల గంజాయి పట్టివేత

- పలుచోట్ల నగదు, మద్యం స్వాధీనం



నవతెలంగాణ-గోదావరిఖని / ఉట్నూర్‌టౌన్ / తిమ్మాపూర్

రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాలలో గంజాయి అమ్ముతున్న ఐదుగురిని పెద్దపల్లి జిల్లా మంథని మండలం ఎగ్లాస్‌పూర్‌లో టాస్క్‌ఫోర్స్ సిబ్బంది శనివారం పట్టుకుంది. పెద్దపల్లికి చెందిన మంద సతీష్, సొంపి విజయకృష్ణ, అరికెల్ల శ్యాం, గడ్డం రాజు, షేక్ ఆసిఫ్ కారులో తరలిస్తున్న రూ.11లక్షల విలువజేసే 51 కిలోల గంజాయిని ఏసీపీ రక్షితా కే మూర్తి ఆధ్వర్యంలో పట్టుకున్నారు.

రూ.2.60లక్షల నగదు పట్టివేత

ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలం మడావి తుకారాం ఎక్స్‌రోడ్ వద్ద రూ.2.60లక్షలను శనివారం సాయంత్రం పోలీసులు పట్టుకున్నారు. నిజామాబాద్‌కు చెందిన మాదవ్ ఉట్నూర్ నుంచి నిజామాబాద్‌కు కారులో వెళు తున్నాడు. ఎక్స్‌రోడ్డు వద్ద పోలీసులు వాహనాన్ని తనిఖీ చేయగా, రూ.2.60లక్షలు పట్టుబడింది. మేకల వ్యాపారం కోసం ఈ డబ్బు తెచ్చినట్లు మాదవ్ పోలీసులకు తెలిపాడు. దానికి ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో నగదును చేశారు.

మద్యంపట్టివేత

కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలంలోని అలుగునూరు వద్ద కారులో తరలిస్తున్న రూ.57 వేల 960 విలువ చేసే 126 ఐబీ బాటిళ్ల మద్యాన్ని, ఇద్దరు వ్యక్తులను పోలీసులు పట్టుకున్నారు. చొప్పదండిలో రూ. 3 వేల 440 మద్యాన్ని మండలంలోని రాగంపేట, ఆర్నకొండ గ్రామాల్లో అక్రమంగా తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలంలో రూ.4,500 విలువైన మద్యాన్ని తరలిస్తుండగా బ్లూకోర్ట్ పోలీసులు పట్టుకున్నారు.

నిలిచిన కళ్యాణలక్ష్మీ..!

ఎన్నికల నేపథ్యంలో మంజూరుకు ఆటంకం

- ట్రెజరీలో 1100 చెక్కుల పెండింగ్
- విచారణకు 3 వేల దరఖాస్తుల నిరీక్షణ



నవతెలంగాణ - సిటీబ్యూరో

కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ పథకాల అమలుకు ఎన్నికలు ఆటంకంగా మారాయి. అసెంబ్లీ ముందస్తు ఎన్నికలు, గ్రామ పంచాయతీ ఎన్నికలు వరుసగా జరుగుతున్న నేపథ్యంలో పథకాలు అమలు కావడం లేదు. హైదరాబాద్ జిల్లాలో ట్రెజరీ వద్దే 1100 చెక్కుల మంజూరుకు నిరీక్షిస్తున్నాయి. సుమారు మూడు వేలకు పైగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.

వివాహం చేసుకుంటున్న యువతులకు కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ పథకాల కింద ఒక్కొక్కరికి లక్షా పదహారు రూపాయలు ప్రభుత్వం అందజేస్తోంది. లబ్దిదారుల ఎంపిక ప్రక్రియలో భాగంగా రెవెన్యూ అధికారులతో పాటు, స్థానిక ఎమ్మెల్యే అప్రూవల్ తప్పనిసరిగా ఉండాలి. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో నాలుగు నెలలుగా ఈ పథకం అమలు, దరఖాస్తుల మంజూరు, లబ్దిదారులకు చెక్కుల పంపిణీని అధికారులు పక్కనబెట్టారు. అధికారులు పూర్తిగా ఎన్నికల విధుల్లోనే గడిపారు. దీంతో హైదరాబాద్ జిల్లాలో 2018-19 ఏడాదిలో కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ దరఖాస్తులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. జిల్లా వ్యాప్తంగా అందిన 15,903 దరఖాస్తుల్లో 11,137 మందిని లబ్దిదారులుగా గుర్తించగా, 715 దరఖాస్తులను తిరస్కరించారు. మరో 3345 దరఖాస్తులను అధికారులు పరిశీలించాల్సి ఉంది.

ట్రెజరీలో 110 చెక్కుల పెండింగ్

జిల్లాలో కళ్యాణ లక్ష్మీ, షాదీముబారక్ పథకాలకు దరఖాస్తు చేసుకున్న వారిలో ఎస్సీలు 1143, ఎస్టీలు 158, బీసీలు 3336, ఈబీసీలు 288, మైనార్టీలు 10,978 మంది ఉన్నారు. ఎమ్మార్వో, ఆర్డీవో, కలెక్టర్, ఎమ్మెల్యేల వద్ద అప్రూవల్ నిమిత్తం సుమారు 4052 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. అన్ని దశల్లోనూ విచారణ పూర్తి చేసుకొని చెక్కుల మంజూరుకు 1102 దరఖాస్తులు ట్రెజరీకి చేరాయి. అధికారులు మొన్నటిదాకా ఎన్నికల విధుల్లో బిజీ ఉన్నందున ట్రెజరీ కార్యాలయాల్లో మంజూరు కావాల్సిన చెక్కుల సంగతే మర్చారు. దీంతో లబ్దిదారులు మండల కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఈ విషయంపై జిల్లా ఇన్‌చార్జ్ డీఆర్వో వెంకటేశ్వర్లును వివరణ కోరగా, సత్వరమే పరిష్కరిస్తామని చెప్పారు.

బీఎస్సీ నర్సింగ్ ఫలితాలు విడుదల

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బీఎస్సీ నర్సింగ్, పోస్ట్ బేసిక్ నర్సింగ్ మొదటి, ద్వితీయ ఏడాది ఫలితాలను కాళోజి ఆరోగ్య విశ్వ విద్యాలయం విడుదల చేసింది. అక్టోబర్/నవంబర్, 2018లో బిఎస్సీ నర్సింగ్, పోస్ట్ బేసిక్ నర్సింగ్ మొదటి, ద్వితీయ ఏడాది రెగ్యులర్, రిఫర్డ్ బ్యాచ్ విద్యార్థులకు పరీక్షలను నిర్వహించారు. ఫలితాలను శనివారం యూనివర్సిటీ విడుదల చేసింది. బీఎస్సీ నర్సింగ్ మొదటి ఏడాది రెగ్యులర్ విద్యార్థులలో 115 డిస్టిక్షన్, 858 ఫస్ట్ క్లాస్, 306 సెకండ్ క్లాస్‌లో పాసవగా, సెకండ్ ఇయర్‌లో 90 డిస్టిక్షన్, ఫస్ట్‌క్లాస్‌లో 742, సెకండ్ క్లాస్‌లో 267 మంది విద్యార్థులు ఉతీర్ణులు అయ్యారు. పోస్ట్ బేసిక్ నర్సింగ్ మొదటి ఏడాది రెగ్యులర్ విద్యార్థులలో 2 డిస్టిక్షన్, 38 ఫస్ట్‌క్లాస్, 22 మంది విద్యార్థులు సెకండ్ క్లాస్‌లో పాసయ్యారు. ద్వితీయ సంవత్సరంలో 1 డిస్టిక్షన్, ఫస్ట్ క్లాస్‌లో 22, సెకండ్ క్లాస్‌లో 11 మంది విద్యార్థులు ఉతీర్ణులు అయ్యారు. ఈ మేరకు ఫలితాలను వెబ్‌సైట్‌లో పొందుపర్చామని, మార్కుల జాబితా సంబంధిత కళాశాలలకు పంపిస్తామని కాళోజీ వర్సిటీ రిజిస్ట్రార్ ప్రవీణ్ ఒక ప్రకటనలో తెలిపారు.

సంపాదకీయం

ఆడమనసు

సకల మానవ సంబంధాలకు ఆర్థికాంశాలే ప్రాతిపదిక అంటారు కారల్ మార్క్స్. అయినప్పటికీ మానవ సంబంధాల విశ్లేషణలో మగవారినీ, ఆడవారినీ వేరుగా చూస్తున్నారు. మానవ మనస్తత్వం గురించి మాట్లాడేటపుడు ప్రత్యేకించి జెండర్‌ని పరిగణనలోకి తీసుకుంటున్నారు. ఇవాళ అన్ని రంగాలలో మహిళలు క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారు. కానీ మహిళ స్వభావంపైన ప్రతికూల సూత్రీకరణలు చేస్తున్నారు. మహిళల ఆలోచనలకు వక్రభాష్యాలు చెబుతున్నారు. మహిళలు ఎలా ఉండాలో, ఎలా ఆలోచించాలో పురుషాధిక్య ప్రపంచం నిర్ణయిస్తున్నది.

ఆడయినా, మగయినా ఒకేవిధంగా ప్రవర్తిస్తారు. సామాజిక చలనసూత్రాలని అనుసరించే వ్యవహరిస్తారు. కనుక 'ఆడమనసు' పేరుతో మహిళల పట్ల ఎమోషనల్ బ్లాక్‌మెయిలింగ్‌కు పాల్పడే ధోరణిని సమాజమూ, ముఖ్యంగా మీడియా మార్చుకోవాలి.

మహిళల జీవితాల్ని నిర్దేశించే పితృస్వామిక భావజాలం సమసి పోనందునే 'ఆడమనసు' అనే భావన పాతుకుపోయింది. జెండర్ రీత్యా ఆడ, మగ వేరు కావచ్చు. అంతమాత్రాన ఆడమనసు, మగమనసు అని వేరేగా ఉంటాయా? కవులు, కళాకారులు, తత్వవేత్తలు మాత్రమే 'ఆడమనసు' అనే మాటని విభిన్న సందర్భాల్లో వాడుతున్నారు. ఇదేమి గౌరవప్రదమైన బ్రాండ్ ఇమేజ్ కాదు. 'ఆడమనసు' అన్నట్టుగా 'మగమనసు' అనే మాట ఎక్కడా వినిపించదు. ఎందుకంటే ఆడవాళ్ళు ఆధిక్యతా స్థానంలో లేరు. మాతృస్వామిక వ్యవస్థలోనూ పెత్తనం చేసిన దాఖలాలు కనిపించవు. అందుకే ఏ సమాజంలోనూ, ఏ భాషలోనూ, ఏ సంస్కృతిలోనూ 'మగమనసు' అనే భావన కనిపించదు. ఆడవాళ్ళ మనస్తత్వం, బుద్ధి, ప్రవర్తనల మీదనే మగవారి తీర్పులు కనిపిస్తాయి చరిత్ర నిండా. పురాణాల దగ్గర్నించి ఆధునిక రచనల దాకా మహిళల మనస్తత్వం మీద అపసవ్య విశ్లేషణలే చూస్తుంటాం.



'స్త్రీ బుద్ధి ప్రళయాంతక:' అన్నది మహాభారతం. మహిళల వల్లనే మహాభారత యుద్ధం జరిగిందని సూత్రీకరించారు. కురువంశమే కలకాలం పాలిం చాలన్న నాటి రాజుల దుర్మార్గ తాపత్రయ ఫలితమే మహాభారత యుద్ధం. కానీ నెపం మాత్రం ఆడవాళ్ళ మీద మోపారు. రాజులనీ, ఆడవాళ్ళనీ నమ్మరాదని చెప్పింది పంచతంత్రం. పంచతంత్ర కథలు నీతివంతమైనవని పిల్లలకు చెబుతుంటారు.అంటే ఆడవాళ్ళను నమ్మరాదని చిన్ననాటి నుంచి నేర్పడమే కదా. ఇది ఎంత అన్యాయం! స్త్రీలు చపలచిత్తులని, వారి నోట ఆవగింజయినా దాగదని సినిమాల్లో, సీరియళ్ళల్లో చూపిస్తూనే ఉన్నారు. ఇది ఎంత అసంబద్ధం! మగవాళ్ళు స్థిరమనస్కులా? ఆడవాళ్ళు చపలచిత్తులా? ఈ సూత్రీకరణల శాస్త్రీయతని ప్రశ్నించకపోతే వివక్షాపూరితమైన భావజాలం సమసిపోదు.

స్త్రీలయినా, మగవారయినా నిరంతరం ఒకేతీరుగా ఆలోచిస్తారా? వారి భావాలు, అభిప్రాయాలు మారకుండా ఉంటాయా? నలుగురు ఆడవాళ్ళ మధ్యనే కాదు నలుగురు మగవాళ్ళ మధ్యన సైతం ఒక మాట దాగదు. వాటిని చిలువలుపలువలుగా ప్రచారం చేయడం వల్లనే గాసిప్స్‌కు అంతులేకుండా పోయింది. యూట్యూబ్ చానల్స్‌లో కుసంస్కారంతో కూడిన శీర్షికలు పెట్టి ఆడవాళ్ళ లైంగికత మీద జుగుప్సాకరమైన వ్యాఖ్యానాలు చేస్తున్నది మగమహానుభావులే. వారిలోని పురుషదురహం కారం పచ్చిగా సోషల్‌మీడియాలో యధేచ్ఛగా కనిపిస్తున్నది. ఈ వాస్తవం లోకానికి తెలిసినా ఆడవాళ్ళ నోట మాట దాగదనే ప్రచారం కొనసాగు తూనే వుంది. పూటకో మాట మాట్లాడే రాజకీయ నాయకుల్ని చూస్తే ఎవరు చపలచిత్తులో అర్థమవుతుంది. అయినప్పటికీ చపలచిత్తులనే నిందని స్త్రీలు మోస్తున్నారు.

ఏ సందర్భంలో 'స్త్రీ మనసు అగాథం' అని షేక్‌స్పియర్ రాశాడో గానీ అప్పట్నించి మహిళ మనసు మీద విపరీత వ్యాఖ్యానాలు వినిపిస్తూనే ఉన్నాయి. సమాజంలో ఇంత పారదర్శకత పెరిగాక కూడా ఆడవాళ్ళ మాటలకు అర్థాలే వేరులే, ఆడవాళ్ళ మనసు ఎప్పటికీ అంతుబట్టదనే వక్ర భాష్యాలు ఆగలేదు. 'ఆడమనసు' అనే పేరిట స్త్రీలని కించపరిచే వాదనలు సమసిపోలేదు. మానవ మనస్తత్వాన్ని గురించి సిగ్మండ్ ఫ్రాయిడ్ కొన్ని ప్రతిపాదనలు చేశాడు. స్త్రీల నైజం మీద కొన్ని మాటలు రాశాడు. ఫ్రాయిడ్ చెప్పినా అశాస్త్రీయమైన భావనలని శిరోధార్యం అనుకోనక్కర్లేదు.

స్త్రీల మనసు సున్నితమూ, లాలిత్యమూ, కుసుమ కోమ లమూ అనే కవితాత్మక ప్రవచనాలు కోకొల్లలు. ఆయా సంద ర్భాల్ని బట్టి మనుషుల ప్రవర్తన ఉంటుంది. అంతే తప్ప స్త్రీలం దరూ సున్నిత మనస్కులు, మగవారంతా పాషాణ హృదయులు కాదు. సున్నితత్వమనేది ఇద్దరికీ అవసరమే. అది సుగుణమే కానీ దోషం కాదు. అయితే అనివార్య పరిస్థితుల్లో సమాజం ఒప్పని నిర్ణయాలు తీసుకున్న మహిళలని తప్పు పడతారు. ఆడదయినప్పటికీ అస్సలు సున్నితమే లేదంటారు. ఈరకంగా కూడా స్త్రీల ప్రవర్తనని నియంత్రించడం, కోపతాపాలని వ్యక్తీకరించే హక్కు వారికి లేదన్నట్టుగా తీర్మానించడం. ఇది స్త్రీల భావోద్వేగాల్ని సైతం నియంత్రించే చెరలాట. ఈ తప్పుడు భావ జాల ఫలితమే 'ఆడదయి ఉండి కూడా...', 'కఠినాత్మురాలు' వంటి పదాలని రోజూ వింటున్నాం. కఠినంగా ఉండే హక్కు మగవారికి ధారా దత్తం చేసినట్టుగా, తీవ్రమైన నిర్ణయాలు స్త్రీలు తీసుకోరాదని చెప్పినట్టుగా ఉంది ధోరణి. ఎవరో ఎప్పుడు ఎలా ప్రవర్తిస్తారనేది జెండర్‌ని బట్టి ఉండదు. సమాజంలోని నిర్దిష్ట సన్నివేశాలు, సందర్భాలలో ఆడయినా, మగయినా ఒకేవిధంగా ప్రవర్తిస్తారు. సామాజిక చలనసూత్రాలని అనుసరించే వ్యవహరిస్తారు. కనుక 'ఆడమనసు' పేరుతో మహిళల పట్ల ఎమోషనల్ బ్లాక్‌మెయిలింగ్‌కు పాల్పడే ధోరణిని సమాజమూ, ముఖ్యంగా మీడియా మార్చుకోవాలి.

సరళీకృత ఆర్థిక విధానాలపై ఎగిసిన కెరటం!



ఆర్. సుధాభాస్కర్

పద్దెనిమిదోసారి! ఇరవైకోట్లమంది! సరళీకృత ఆర్థిక విధానాలపై ఉప్పెనలా ఎగిసిపడ్డారు. అనేక రాష్ట్రాలలో లక్షల్లో ప్రైవేటు పారిశ్రామిక వాడల కార్మికుల సమ్మెతో పారిశ్రామిక వాడలు బోసిపోయినాయి. ఇటీవలి కాలంలో పెరిగిన మిలిటెన్సీతో లాంగ్‌మార్చ్‌లు జరుపుతున్న రైతన్నలు వ్యవసాయ కార్మికుల్తో కల్సి అనేక రాష్ట్రాల్లో గ్రామసీమలు బంద్ పెట్టారు. గతంలో జరిగిన ఏ సమ్మెలకన్నా ఈ 18వ సమ్మెలో అనేక కీలక రంగాలు మూతబడ్డాయి. అనేక రాష్ట్రాల్లో బొగ్గు ఉత్పత్తి, దాని రవాణా దెబ్బతిన్నది. 70-75 శాతం బొగ్గు పరిశ్రమలో సమ్మె జరిగింది. 30 లక్షల మంది విద్యుత్ ఉద్యోగులు ఈ సమ్మెలో పాల్గొన్నారు. పబ్లిక్, ప్రైవేట్ ట్రాన్స్‌పోర్టు కార్మికులు సుమారు 3.5 కోట్ల మంది పాల్గొన్నారు. కేరళ, బీహార్, ఒడిసా, అస్సాం, అరుణాచల్‌ప్రదేశ్‌తో పాటు అనేక ఈశాన్య రాష్ట్రాలు ఈ కార్మికుల సమ్మెతో సంపూర్ణంగా బంద్ కాగా బెంగాల్‌లో 80శాతం జయప్రదమైంది. కర్నాటక, పంజాబ్, మహారాష్ట్ర, జార్ఖండ్ లలో అనేక జిల్లాల్లో ట్రాన్స్‌పోర్ట్ సమ్మె పెద్ద ప్రభావం చూపింది. పోర్టులలో సమ్మె పాక్షికంగా జరిగింది. కానీ హమాలీల సమ్మెతో పారదీప్, ట్యూటికోరిన్, కోల్‌కతా, కొచ్చిన్, హాల్దియా విశాఖల్లో సరుకు రవాణా నిలిచిపోయింది. విశాఖ, సేలం, భద్రావతి ఉక్కు కర్మాగారాల్లో పూర్తిగా ఉత్పత్తి నిలిచిపోయింది. రూర్కెలాస్టీల్ ప్లాంట్ శాశ్వత కార్మికులు సమ్మె చేసి, గేట్ల వద్ద పికెటింగ్ చేశారు. సుమారు కోటి మంది స్కీం వర్కర్లు సమ్మెలో పాల్గొన్నారు.

8వ తేదీ 21.33 లక్షల మంది, 9వ తేది 19 లక్షల మంది కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు. హైదరాబాద్ చుట్టూ వున్న సంగారెడ్డి, మేడ్చెల్, రంగారెడ్డి, భువనగిరి జిల్లాలలోని పారిశ్రామిక వాడలు పెద్దఎత్తున మూతబడ్డాయి. కేసీఆర్ ఎన్నిమంత్రాలు పెట్టినా ఉమ్మడి మహబూబ్‌నగర్, ఉమ్మడి నిజామాబాద్, ఉమ్మడి ఆదిలాబాద్, ఉమ్మడి మెదక్ జిల్లా, భద్రాద్రి కొత్తగూడెం (14 జిల్లాల్లో) అంగన్‌వాడీ, ఆషా వర్కర్లు పెద్దఎత్తున సమ్మెలో పాల్గొన్నారు. రాష్ట్రమంతా మధ్యాహ్న భోజన మహిళలు సంపూర్ణంగా సమ్మెలో పాల్గొన్నారు.

భారత ఆర్థిక వ్యవస్థ నాడీ మండలం స్తంభించింది. ఇన్సూరెన్స్ సేవలు పూర్తిగా నిలిచిపోగా, రిజర్వు బ్యాంకుతో పాటు లక్షలాది గ్రామీణ బ్యాంకులు, సహకార బ్యాంకులు, నాబార్డ్, అనేక జాతీయ బ్యాంకులు సంపూర్ణంగా మూతబడ్డాయి. 13 లక్షల మంది పోస్టల్, ఇన్‌కంటాక్స్ డిపార్ట్‌మెంట్లు సంపూర్ణంగా నిలిచిపోగా ఆడిట్ & అకౌంట్స్, సివిల్ అకౌంట్స్, అటామిక్ ఎనర్జీ వంటి మరో 30 శాఖల్లో సమ్మె జరిగింది. అసంఘటిత రంగాలైన నిర్మాణ కార్మికులు, హమాలీలు మొ॥న వారు పెద్దఎత్తున సమ్మెలో పాల్గొన్నారు.

తెలంగాణాలో ...!

8వ తేదీ 21.33 లక్షల మంది, 9వ తేది 19 లక్షల మంది కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు. హైదరాబాద్ చుట్టూ వున్న సంగారెడ్డి, మేడ్చెల్, రంగారెడ్డి, భువనగిరి జిల్లాలలోని పారిశ్రామిక వాడలు పెద్దఎత్తున మూతబడ్డాయి. కేసీఆర్ ఎన్నిమంత్రాలు పెట్టినా ఉమ్మడి మహబూబ్‌నగర్, ఉమ్మడి నిజామాబాద్, ఉమ్మడి ఆదిలాబాద్, ఉమ్మడి మెదక్ జిల్లా, భద్రాద్రి కొత్తగూడెం (14 జిల్లాల్లో) అంగన్‌వాడీ, ఆషా వర్కర్లు పెద్దఎత్తున సమ్మెలో పాల్గొన్నారు. రాష్ట్రమంతా మధ్యాహ్న భోజన మహిళలు సంపూర్ణంగా సమ్మెలో పాల్గొన్నారు. ప్రభుత్వ రంగంలో సమ్మె బలహీనంగా జరిగింది. ఎన్‌టీపీసీ కాంట్రాక్టు కార్మికులు 3 వేల మంది సంపూర్ణంగా సమ్మెలో పాల్గొన్నారు. సింగరేణిలో 41శాతం మంది, బీడీఎల్‌లో 40శాతం మంది మొదటిరోజు సమ్మెలో పాల్గొన్నారు. బీడీ కార్మికులు సంపూర్ణంగా రెండు రోజులూ సమ్మెలో వున్నారు.

ఈ రెండు రోజుల సమ్మె ట్రేడ్ యూనియన్ల బలంతో పాటు బలహీనతలనూ, ఐక్య ట్రేడ్ యూనియన్ ఉద్యమ లోపాలను బహిర్గతం చేసింది. ఆత్మవిమర్శనా పూర్వకంగా వాటిని అన్ని స్థాయిల్లో పరిశీలించుకోవాలి.

రాష్ట్రంలో ఈ సమ్మెకు ఒక పరిమితి ఉంది. ఈసారి సమ్మె ఏర్పాట్లకు సరిగ్గా నెల రోజులు మాత్రమే మిగిలింది. రెండు రాజకీయ ప్రత్యామ్నాయాల కోసం సాగిన ఎన్నికల పోరాటం మళ్ళీ టిఆర్‌ఎస్ ప్రభుత్వ ఏర్పాటుతో కొన్ని సంఘాలను తీవ్ర నిరాశకు గురిచేసింది. ఏమైనా, అన్ని స్థాయిల్లోని సీఐటీయూ కార్యకర్తలు ఈ అతిపెద్ద వర్గపోరాటంలో శక్తి వంచన లేకుండా కృషి చేశారు. తగు సమయం ఉండి ఉంటే సంస్థల్లో కృషిని మరింత సమగ్రంగా ప్లాన్ చేసి వుంటే ఇంకా మెరుగ్గా సమ్మె రాష్ట్రంలో జరిగి వుండేది.

ఈ సమ్మె ఒక సైద్ధాంతిక పోరాటం

ఏదో ఒక సమ్మె పిలుపు వచ్చింది, దాన్ని జయప్రదం చేయడానికి కృషి చేయాలన్న దృక్పథం మాత్రమే కలిగి ఉండటం తప్పు కొన్ని సంఘాల్లోకన్పడుతోంది. ఇది నయా ఉదారవాద విధానాలపై ఎక్కుపెట్టిన 'పాశుపతాస్త్రం'. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సరళీకరణ ఆర్థిక విధానాలపై అమీతుమీ తేల్చుకునే ప్రయత్నం. ఒక రకంగా చెప్పాలంటే ఇది అంబానీ, అదానీల అనుకూల విధానాలను భౌతికంగానే కాక, సైద్ధాంతికంగా కూడా ఎదుర్కొనే ప్రయత్నం. మన ప్రభుత్వ రంగ పరిశ్రమలను అక్షరాల తినేస్తున్న బహుళజాతి కంపెనీలపై దండెత్తిన పోరాటం. 70వ దశకంలో ఇందిరాగాంధీ బిహెచ్ఇఎల్ పై ఉసికొల్పిన సీమెన్స్ నుండి తాజాగా మోడీ ఆధ్వర్యంలో హెచ్ఏఎల్ ను మింగేస్తున్న రాఫెల్ వరకు ఈ కోవలోవే. డీపీపీ పేర (డిఫెన్స్ ప్రొక్యూర్‌మెంట్ పాలసీ) డిఫెన్స్ రంగంలోకి అడ్డగోలుగా ప్రైవేటు వారిని అనుమతిస్తున్నారు. ఇది బీఈఎల్, బీడీఎల్, మిధానీ వంటి పరిశ్రమలను తీవ్ర ఇబ్బందుల్లోకి నెడ్తున్నది.

మోడీ ప్రభుత్వ అవినీతికి, ఆశ్రిత పక్షపాతానికి పరాకాష్ట రాఫెల్ ఒప్పందం. ఇది హిందూస్థాన్ ఎయిరో నాటిక్స్‌ను ముంచుతుందని దేశమంతా గగ్గోలు పెడ్తున్నది. ఇంతకుముందే చెప్పినట్టు డిఫెన్స్ ప్రొక్యూర్‌మెంట్ పాలసీ కింద యుద్ధ పరికరాల తయారీకి 200 లైసెన్స్‌లు ప్రైవేటు వారికి కట్ట బెట్టింది మోడీ సర్కార్. ప్రభుత్వ ఆధ్వర్యంలోని హెచ్ఏఎల్‌ను, ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలను, బీడీఎల్‌ను ఎండబెట్టి ప్రైవేటు వారికి ఆర్డర్స్ ఇవ్వడమే మేక్ ఇన్ ఇండియా నేమో! ఇది బీఈఎల్, హెచ్ఏఎల్, బీడీఎల్, ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలను, డీఆర్‌డీఓను ముంచుతున్నది. ఈ విషయాలు మన ట్రేడ్ యూనియన్ కార్యకర్తల రోజువారి పనిలో అంతర్భాగంగా వున్నాయా? లేదా? పరిశీలించుకోవాలి. అంటే కార్మికుల కొచ్చే సమస్యలు - ప్రమోషన్స్, ఇన్‌సెంటివ్‌లు రావడం / రాకపో వడం వంటి వాటి వెనుక ప్రభుత్వ విధానాల లోతు పాతులు కార్మికుల ముందుచగల్గుతున్నారా? లేదా? అనేది ముఖ్యమైన విషయం. దీన్లో కీలకమైనది పెరుగుతున్న కాంట్రాక్టీకరణను అడ్డుకునేందుకు లేదా ఆ కాంట్రాక్టు కార్మికుల బాగోగులపై ప్రభుత్వరంగ యూనియన్లు ఏ మేరకు, ఎటువంటి కృషి చేస్తున్నాయనేది కూడా మరో కీలక విషయం. 'ఎవడెటుపోతే నాకేం?! చిన్ని నా బొజ్జకు శ్రీరామరక్ష!' అనేది సంస్కరణ వాద సంఘాల వాదన. ఈ జబ్బు వదిలించకుండా కార్మికవర్గం విప్లవకర పాత్ర పోషించజాలదు.

ప్రభుత్వ విధానాలను అర్థం చేసుకోవడం, వాటిని రోజు వారి కార్మికుల సమస్యలతో లింక్ చేయడం ప్రైవేటు రంగమైనా, స్కీం వర్కర్ల ఉద్యమమైనా, ఆటో, హమాలీ, భవన నిర్మాణ రంగమైనా, అన్నింటికీ వర్తించేదే!

సంస్కరణ వాదం నుంచి బయట పడాలి

అది 1998 ఏప్రిల్‌లో విద్యుత్ రంగంలోని 1104 ఆఫీసులో 1104 కార్యకర్తలకు, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ



ఎంప్లాయీస్ యూనియన్ కార్యకర్తలకు విద్యుత్ రంగ ఆఫీసర్ల కాన్ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు శ్రీ అశోక్‌రావు ఏపీ విద్యుత్ సంస్కరణల చట్టాన్ని వ్యతిరేకించండని చేసిన ఉద్బోదలో భాగం. 'మేం సమ్మె చేస్తే ఆగుతుందా' అన్న చొప్పదంటు ప్రశ్నలకు 'కనీసం స్పీడ్ బ్రేకర్లు పెట్టగలిగితే ప్రభుత్వాల వేగాన్ని తగ్గించగలుగుతారా'ని అశోక్ రావు గారు వివరించారు. 2000 సం॥ ఆగస్టు టారిఫ్ వ్యతిరేక ఉద్యమం ప్రపంచ బ్యాంకు ఎజెండానే ధ్వంసం చేసింది. డిస్కాంల ప్రైవేటీకరణకు పెట్టిన ముహూర్తాలు నాశనం అయ్యాయి. ఇరవయ్యేళ్ళు గడిచినా డిస్కాంల ప్రైవేటీకరణకు ఏ ప్రభుత్వమూ సాహసం చేయట్లేదు అటు ఆంధ్రలో, ఇటు తెలంగాణాలో. ఇది కార్మికుల, సామాన్య ప్రజల విజయం.

1978లో జనతాపార్టీ ప్రభుత్వం పారిశ్రామిక సంబంధాల బిల్లు తెచ్చినప్పుడు సమైక్య ప్రతిఘటనతో తిప్పికొట్టింది కార్మికవర్గమే. 1988లో మళ్ళీ రాజీవ్‌గాంధీ ప్రభుత్వం ఒక ప్రయత్నం చేస్తే ప్రతిఘటించింది కార్మికవర్గమే. 1991లో పీవీ - మన్మోహన్‌ల శకం ప్రారంభమైనప్పట్నించీ కార్మిక చట్టాల సవరణకు పెట్టుబడిదారుల మార్గం సుగమం చేసేందుకు జరుగుతున్న ప్రయత్నాలను అడ్డుకుంటున్నది కార్మికవర్గమే. ఈ పాతికేండ్లలో ఈ విధానాలు ముదిరిపాకానపడ్డాయి. వ్యవసాయ సంక్షోభం తీవ్రమైంది. గత రెండేండ్లలో రైతాంగ ప్రతిఘటన పెరిగింది. నీటి సరఫరా కోసం, విద్యుత్ ఛార్జీలు తగ్గించడం కోసం రాజస్థాన్ రైతాంగం, పంట రుణాల రద్దు, గిట్టుబాటు ధర కోసం మధ్యప్రదేశ్ రైతాంగం, భూములను గుంజుకుని తమని నిర్వాసితులను చేయొద్దనీ, గిరిజన రైతాంగానికి పట్టాలివ్వాలనీ మహారాష్ట్ర రైతాంగం పెద్దపెద్ద ఆందోళనలు చేసింది. ఆయా రాష్ట్రాల పాలక బీజేపీ ప్రభుత్వాల కూల్చివేతలో ముఖ్య భూమిక పోషించింది.

ఇవన్నీ సరళీకృత ఆర్థిక విధానాలకు బ్రేకు వేయడమే కదా. మనం బ్రేకులేస్తూంటే వాళ్ళు 'వాషింగ్టన్ కన్సెన్సస్' (వాషింగ్టన్ ఏకాభిప్రాయం) అంటున్నారు. అంటే పార్టీలు మారినా, నాయకులు మారినా అవే విధానాలు కొనసాగుతున్నాయి. అందుకే 'ప్రజల జీవన విధానానికీ, జీవితాలకూ సంబంధించిన అంశాలపై వారిని సమీకరించాలి. వారికి ప్రధాన శత్రువులెవరో అర్థం చేయించడమే మన ముందున్న కర్తవ్యం. అది మాత్రమే ఉదార వాద విధానాలను వెనక్కితిప్పికొట్టగలదు. మనం మూలలపై గురి ఎక్కుపెట్టాలి. అప్రధాన విషయాలను పట్టించుకోవద్దు. అప్పుడు మాత్రమే పెట్టుబడిదార్ల, భూస్వాముల, వారి రాజకీయ ప్రతినిధుల నుండి దృష్టి మరల్చకుండా చేయగలం. ప్రజల్ని వర్గేతర సమస్యల వైపు వెళ్ళకుండా చూడగలం' అని రాశారు కా॥ తపన్‌సేన్.

పై వాక్యాల వెనుక 28 సం॥ల పాటు 18 దేశ వ్యాపిత సార్వత్రిక సమ్మెలు ఐక్యంగా నడిపిన సీఐటీయూ అనుభవముంది. ప్రభుత్వాలు మారుతున్నా అవే సరళీకృత ఆర్థిక విధానాలు కొనసాగుతున్నాయన్న సీఐటీయూ 14వ అఖిల భారత మహాసభ (కన్నూర్) విశ్లేషణ ఉంది. కార్మికవర్గానికి, సామాన్య ప్రజలకు విధ్వంసకరమైన విధానాలను మోసుకొచ్చినా ఆపలేకపోయామన్న బాధ ఉంది. కార్మికుల సమస్యలకు మూలకారణాలను, వాటి వెనుకున్న రాజకీయాలను అర్థం చేయించడంలో విఫలమౌతున్నామన్న ఆత్మ విమర్శ ఉంది.

"కార్మికోద్యమంలో ఈ అనైక్యత ప్రమాదవశాత్తు వచ్చింది కాదు. సంస్కరణవాద సంఘాల విషపూరిత ప్రచారం, ప్రభావాల వల్లనే ఇది ప్రాప్తించింది. ఇది భారత కార్మిక వర్గం యొక్క వర్గచైతన్యాన్ని తుడిచిపెట్టుకుపోయేలా చేసింది. దీనివల్ల కార్మికుల వర్గ చైతన్యం మసకబారిపోయింది. ఫలితంగా వర్గశత్రువులపై చేయాల్సిన నిర్ణయాత్మక పోరాటం పలచబడింది. కార్మికవర్గం యొక్క ప్రజాతంత్ర బాధ్యతలను, ముఖ్యంగా రైతాంగం యెడల తన బాధ్యతలను అర్థం చేసుకోకుండా అడ్డుకున్నది. కార్మికోద్యమం సంకుచిత, ఆర్థికవాదంతో నిండిపోయి నా ఫ్యాక్టరీ, నా రంగం అన్న మనస్తత్వం పెరిగింది" - 1971 సెప్టెంబర్ 'వర్కింగ్ క్లాస్' పత్రిక సంపాదకీయంలో కా॥బీటీఆర్ ఈ హెచ్చరిక చేశారు.

సమాజ మార్పు కోసం కృషి చేసే బాధ్యత కార్మికోద్యమ కార్యకర్తలది. దానికి అడ్డుగా నిలిచిన సరళీకృత ఆర్థిక విధానాలను ఓడించడం ప్రతి కార్మికవర్గం బాధ్యత.

రిపోర్టర్స్ డైరీ

పనితీరును ఎండగట్టే వారేరీ?

శాసనసభలో ప్రభుత్వం పనితీరును ఎండగట్టే వారే లేకుండాపోతున్నారు. ఇతర పార్టీల నుంచి గెలిచిన ఎమ్మెల్యేలతో పాటు, ఓడిన వారికి కూడా టీఆర్ఎస్ కండువాలు కప్పుతున్నారు. శాసనసభలో ప్రతిపక్ష మంటూ లేకుండా చేయడమే అధికారపార్టీ లక్ష్యంగా కనబడుతున్నది. శాసనమండలిలో కాంగ్రెస్‌ను ఖాళీ చేసిన టీఆర్ఎస్, అదే తరహాలో శాసనసభలో కూడా కాంగ్రెస్‌కు ప్రతిపక్ష హోదా లేకుండా చేయాలని చూస్తుంది. దీనివల్ల పార్టీలో ఎమ్మెల్యేల సంఖ్యా బలం పెరగడమే కాకుండా తమను ఎదిరించే వారు ఉండకూడదన్న ఆలోచనలో టీఆర్ఎస్ ఉన్నట్టు కనిపిస్తున్నది. ఇందు కోసమే కాంగ్రెస్ పార్టీ నుంచి గెలుపొందిన ఆరుగురు ఎమ్మెల్యేలను టీఆర్ఎస్‌లోకి ఆహ్వానించేందుకు రంగం సిద్ధం చేస్తున్నది. తెలుగు దేశం పార్టీ నుంచి గెలిచింది ఇద్దరే ఇద్దరు. అందులో కూడా ఒకరికి టీఆర్ఎస్ కండువా కప్పే ప్రయత్నాలు జరగడం శోచనీయం. పూర్తి మెజార్టీ వచ్చినా ఇతర పార్టీల ఎమ్మెల్యేలను ప్రలోభపెట్టి తమ పార్టీలోకి ఆహ్వానించడం సమంజసం కాదు. ప్రశ్నించే వారే లేకుంటే ఇక ప్రజాస్వామ్యం ఉంటుందా?

- టి సంజయ్‌కుమార్

అంతా బంగారమే.. ఇంకేముంటది?

అసెంబ్లీ మీడియా పాయింట్.. పొద్దుగాల ఎమ్మెల్యేలు అసెంబ్లీకి వచ్చే దగ్గర నుంచి ప్రమాణ స్వీకారం అయిపోయిన దాక ఎలక్ట్రానిక్ మీడియా వాళ్లు వీడియోలు పెట్టుకుని..మైకులు పట్టుకుని, ప్రింటు మీడియా వాళ్లు బుక్కులు పట్టుకుని పడిగాపులు గాశారు. ప్రమాణ స్వీకారం అయిపోయిన తర్వాత వచ్చిన ఎమ్మెల్యేలు వచ్చినట్టుగా కార్లెక్కి పలాయనం చిత్తగించారు. ఇగొస్తరేమో... అగొస్తరేమోనని కండ్లల్ల ఒత్తులేసుకుని ఎదురు చూసిన మీడియా ప్రతినిధులు ఆకలితో కండ్లు తేలేశారు. అదే క్రమంలో ఓ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధి ఏందిర బై ఈ ఎదురుచూపులు అనగా... మరో మీడియా మిత్రుడు కల్పించుకుని ఏహె అంతా బంగారు తెలంగాణాయే. ఈడ మాట్లాడనీకి ఇంకేముంటది? అని అనగానే అక్కడున్న వాళ్లంతా గొల్లుమన్నారు.

- అచ్చిన ప్రశాంత్

గట్కకు గిరాకీ...

ప్రస్తుత పరిస్థితుల్లో జొన్న, సజ్జ గట్కకు గిరాకీ పెరుగుతున్నది. మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. మన తాత ముత్తాలు జొన్న, సజ్జ గట్క, రాగి సంకటి తిన్నారు గనుక ఎంతో ఆరోగ్యంగా ఎక్కుకాలం జీవించారు. శారీరక శ్రమ, ఎక్కువ దూరం నడవడం వల్ల రోగాలు వాళ్ల దరికి చేరలేదు. ఇప్పుడు కార్లు, బైక్‌ల వాడకం పెరగడం, నడక మానేయడం, శరీరాన్ని కష్టపెట్టకుండా కూర్చోవడంతో బీపీ, షుగర్‌లు వస్తున్నాయి. అప్పటి తిండి ఇప్పుడు కనుమరుగైంది గట్క తినేవారంటే గరీబోళ్లని, తినడానికి తిండి లేనోళ్లనే భావన ఏర్పడింది. దీంతో కనుమరుగైంది. పాలీష్ వేసిన బియ్యం అందుబాటులోకి రావడంతో రైస్ వైపు మళ్ళారు. రైస్ ఎక్కువ తీసుకోవడంతో షుగర్ వ్యాధిగ్రస్తుల సంఖ్య భారీ స్థాయిలో పెరిగింది. దీంతో డాక్టర్లు డైట్ మెయింటన్ చేయాలని చెప్పడంతో వాళ్లందరూ చిరుధాన్యాలు, అంబలి, రాగి సంకటి, జొన్న, సజ్జ గట్క తినడానికి ముందుకొస్తున్నారు.పెద్ద పెద్ద హోటల్లలో కూడా ఈ తిండి ఫ్యాషన్ అయింది. బాగా డబ్బులుండి రోగాల బారిన పడ్డ వారు ఈ తిండిని అమృ తంతో సమానంగా చూస్తున్నారు. మొత్తంగా జొన్న, సజ్జ గట్క తినేందుకు జనం ఇష్టపడడంతో గట్కకు గిరాకీ పెరుగుతుంది.


- మోత్కూరు యాదయ్య

ఆశలు పల్లకీలో...

గులాబీకారు దూసుకుపోతున్న తరుణంలో అసెంబ్లీ లాబీల్లో ఎమ్మెల్యేలు ఎంతో ఉత్సాహంగా కనిపించారు. కొత్తగా గెలిచిన ఎమ్మెల్యేలు ఆ గెలుపును ఆస్వాదిస్తున్నారు. ఎక్కువసార్లు ఎమ్మెల్యేలుగా గెలిచిన వారు మంత్రి పదవి కోసం ఆశల పల్లకీ ఎక్కారు. మంత్రివర్గ విస్తరణ ఎప్పుడు జరుగుతున్నది? అందులో తమ పేరు ఉంటుందా? లేదా? సామాజిక సమీకరణాలు ఎలా ఉంటాయి? తనకు వస్తుందా? రాదా? అనే సందేహాలు వెంటాడుతున్నాయి. జిల్లాకో మంత్రి పదవి వస్తుందని భావిస్తున్న కొంత మంది సీనియర్ ఎమ్మెల్యేలు పాత్రికేయులతో లాబీల్లో ఈ విషయాలను పంచుకుంటున్నారు. ఖమ్మం, వరంగల్ జిల్లాలకు చెందిన ఎమ్మెల్యేలు మంత్రి పదవిపై ఆశలు పెట్టుకున్నారు. ఖమ్మం జిల్లాకు చెందిన మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, వరంగల్ జిల్లాకు చెందిన మాజీ మంత్రి చందులాల్ ముందస్తు ఎన్నికల్లో ఓడిపోవడంతో వారి స్థానంలో తమకే అవకాశం వస్తుందన్న నమ్మకాన్ని పెంచుకున్నారు. ముఖ్యంగా అదే సామాజికవర్గానికి చెందిన ఎమ్మెల్యేలు మంత్రివర్గ విస్తరణ కోసం ఎదురు చూస్తున్నారు. మంత్రి పదవిపై సీఎం కేసీఆర్ ఆలోచించి నిర్ణయం తీసుకుంటారు. అడిగితే వచ్చే పదవి కూడా రాదని, అందుకే తమ మనసులోని మాట కూడా బయట పెట్టడం లేదు. ఒకవేళ పదవి ఆశిస్తున్నట్టు తెలిస్తే అసలుకే ఎసరు అన్న భయం పట్టుకుంది.

- గుడిగ రఘు

ఈడ ఉంటరో ఆడికి బోతరో



తెలిదేవర భానుమూర్తి

నారదుడు నెత్తిమీదికెల్లి తానం జేసిండు. జుట్టు ఆరబెట్టుకుండు. కొప్పేసుకుండు. మొకానికి పోడర్ గొట్టుకుండు. తంబూర దీస్కుండు. ఒకపారి టింగ్‌టింగ్ మన్నడు. చిర్తలు దీస్కుండు. ఒకపారి గవ్విటిని కొట్టి జూస్కుండు. గీ పారి యాడ్కి బోవాలె. యాడికి బోతె బాగుంటదని జెరసేపు సోంచాయించిండు. ఎప్పుడు యాద్గిరి గుట్టకు బోతున్న గీ పారి కర్నాటకల ఉన్న చాముండేస్వరి దేవి తాన్కి బోతె బాగుంటదని అనుకున్నడు. అనుకోని మొగులు మీదికెల్లి ఎల్లిండు. కర్నాటక దిక్కు గాయిన బోబట్టిండు. గని నడ్మల నర్కం దిక్కుబోతున్న దున్నపోతు గాయినను గల్సింది.

"యాడికి బోతున్నవు నారదా?" అని అడిగింది.

" చాముండేస్వరి దేవి తాన్కి బోతున్న"

" ఎందుకు బోతున్నవు"

" గామెతోని ముచ్చట బెట్టెతందుకు"

" గామెతోని ముచ్చట బెడ్తె ఏ మొస్తది"

" కర్నాటక ఏమైతున్నదో ఎర్కైతది"

"గీయింత దాన్కి గామె తాన్కి బోవుడెందుకు ? కర్నాటకల ఏమైతున్నదో నీకు నేను జెప్త గద"

"నీకెట్ల ఎర్క"

"మా దున్నపోతుల ఎలచ్చన్లు అయితుంటె ప్రచారం జేస్కుంట దేసమంత దిర్గిన"

"గట్లయితె జెప్పు"

" లోక్‌సబ ఎలచ్చన్లకు తయారయ్యేందుకు గీ నడ్మ డిల్లిల బిజెపి మీటింగ్ అయ్యింది. గా మీటింగ్‌కు కర్నాటక బిజెపి ఎమ్మెల్యేలు గూడ బోయిండ్రు. గా మీటింగ్ల ప్రతాని మోదీ మాట్లాడకుంట మహాకూటమి వొస్తె దేసం ఎన్కకు బోతది. మహాకూటమి పేరుతోని కాంగ్రెస్ గిర్రదిప్పుతది. కర్నాటకల ఉన్న మహాకూటమి సర్కార్ల ఒక దుక్నం . గా దుక్నం కాంగ్రెస్‌ది. గా దుక్నంల కుమార సామి గుమస్త. గుమస్త అయినంక గూడ గాయిన ముక్యమంత్రినని అనుకుంటున్నడు. ఎట్లన్న జేసి కర్నాటకల కాంగ్రెస్ దుక్నంను బంద్ జెయ్యాలె. బంద్ జేసే ముంగట గా దుక్నంను బద్నాం జెయ్యాలె. కాంగ్రెస్ దుక్నంల కందిపప్పుల కల్తి ఉన్నది. బియ్యంల రాల్లున్నయి. నూనెలల్ల గూడ కల్తి ఉన్నది. శక్కరి దర ఎక్వ. గా దుక్నంల సరింగ జోకరు. దండి గొడ్తరు. అన్కుంట ప్రచారం జెయ్యాలె. కుక్కను సంపాలనుకుంటె ముందుగాల గా దాన్కి పిచ్చి లేసిందని జెప్పాలె గదా. అని ప్రతాని అన్నడు. గాయిన గట్ల అనంగనే బిజెపి ఎమ్మెల్యేలు; ఎంపిలు సప్పట్లు గొట్టిండ్రు. కర్నాటకల మహాకూటమి సర్కార్ కూలెటట్లున్నది. కాంగ్రెస్‌ల అసమ్మతి ఎమ్మెల్యేలున్నరు. అమిత్‌షా; యెడ్యూరప్ప చీరలు గట్టుకోవాలె.చేత్ల తామరపూలు బట్టుకోవాలె. కాంగ్రెస్ అసమ్మతి ఎమ్మెల్యేలకు లైటు గొట్టాలె అని ప్రతాని అన్నడు. అని దున్నపోతు జెప్పింది.

"ప్రతాని మాట మీద గాల్లు కాంగ్రెస్ అసమ్మతి ఎమ్మెల్యేలకు లైటు గొట్టిండ్రా?" అని నారదుడు అడిగిండు.

"అమిత్‌షా ; యెడ్యూరప్ప కాంగ్రెస్ అసమ్మతి ఎమ్మెల్యేలకు లైటు గొట్టిండ్రు. ముందుగాల ఏడుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మా దిక్కు వొస్తమని జెప్పిండ్రు. అటెంకల ఇంకొక ఆరు మంది మా దిక్కుకు వొచ్చేతందుకు రడీ గున్నరు.



లోక్‌సబ ఎలచ్చన్లకు ముందు మహాకూటమి సర్కార్ కూలిపోతది. మాకే ఎక్వ ఎంపీ సీట్లు వొస్తయి అని మహాకూటమి సర్కార్ మీద మేము అవిశ్వాస తీర్మానం బెడ్తము. పదమూడు మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలను అసెంబ్లికి రాకుంట జేస్తం. మహాకూటమి సర్కార్‌ను కూలగొడ్తం. గందుకే ఆపరేషన్ కమలను షురువు జేసినం. ఆపరేషన్ కమల అంటె ఏదో గాదు. అమిత్‌షా; యెడ్యూరప్ప చీరలు గట్టుకోని చేత్ల తామర పూలు బట్టుకోని కాంగ్రెస్ ఎమ్మెల్యేలను లైటు గొట్టుడునే ఆపరేషన్ కమల అంటరు. ఆపరేషన్ కమల జెయ్యబట్కె ఇండిపెండెంట్ ఎమ్మెల్యేలు మా దిక్కు వొచ్చిండ్రు. అని బిజెపి లీడర్ ఈశ్వరప్ప అన్నడు. గాయిన గట్లనంగనే కర్నాటకల హల్‌చల్ షురువైంది. బిజెపి లీడర్లు గూడ చేత్ల తామర పూలు బట్టుకోని కాంగ్రెస్ అసమ్మతి లీడర్లను జూస్కుంట ' రారా ప్రియా సుందరా' అన్కుంట పాడ బట్టిండ్రు. దాంతోని కొందరు అసమ్మతి కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బిజెపిలకు దుంకుదామనుకున్నరు" అని దున్నపోతు ఇంకేమొ జెప్పబోతుంటె నారదుడు అడ్డం దల్గి -

"కాంగ్రెస్ ఎమ్మెల్యేలను బిజెపిలను గుంజుడు తప్పు గదా" అని అడిగిండు.

"గిదే సవాల్‌ను విలేకరులు ప్రతాని మోదీని అడిగిండ్రు. గుంజుడు; గోడ దుంకుడు పురాన సైమం సందే ఉన్నది. రావనుడు; సీతను పుష్పకం అనే గాలి మోటర్ల ఎత్కబోయిండు. లంకకు దీస్కబోయిండు. అశోక అనే తోటల శింశుప చెట్టు కింద గామెను గూసుండ బెట్టిండు. రాచ్చసులను కావాలి బెట్టిండు. జటాయువు అనేటి గద్ద జెయ్యబట్కె రామ, లచ్చుమనులకు రావనుడు సీతను ఎత్కపోయిండని ఎర్కైంది. సీతను లెంకుకుంట గాల్లు కిష్కింద బోయిండ్రు. గాడ సుగ్రీవుని తోని గాల్లకు దోస్తి అయ్యింది. సీత ఎట్లున్నదో సూసి రమ్మని హన్మంతున్ని లంకకు బంపిండ్రు. ఎట్లన్న జేసి రావనుని తమ్ముడు విబీషనున్ని మన దిక్కు గుంజుమని జెప్పిండ్రు. హన్మంతుడు సీతను జూసిండు. లంకకెల్లి వొచ్చే ముంగట విబీషనున్ని గల్సిండు. నువ్వు రాముని దిక్కుకురా. రాముని దిక్కు వొస్తివా అంటె గాయిన నిన్ను లంకకు రాజును జేస్తడు అని హన్మంతుడు జెప్పిండు. గాయిన గట్లజెప్పంగనే వీబీషనుడు గోడ దుంకి రాముని దిక్కు వొచ్చిండు అని మోదీ జెప్పిండు" అని దున్నపోతు అన్నది.

"బిజెపి ఆపరేషన్ కమల షురువు జేస్తె కాంగ్రెస్ ఊకున్నదా?" అని నారదుడు అడిగిండు.

"ఉకోలేదు. ఎఐసిసి జనరల్ సెక్రటరీ వేనుగోపాల్‌ను కర్నాటకకు బంపింది. గాయిన కాంగ్రెస్ లీడర్ను సిద్దరామయ్యతోనే గాకుంట కాంగ్రెస్ మంత్రుల గల్సిండు. అసమ్మతి కాంగ్రెస్ ఎమ్మెల్యేలను బుద్ధరియ్యమని జెప్పిండు. ఇగ దాంతోని సిద్దిరామయ్య అసమ్మతి కాంగ్రెస్ ఎమ్మెల్యేల లీడర్‌ను గల్సిండు. ఎన్కట కిష్నుడు; కర్నుని పాండువుల దిక్కు గుంజెతందుకు కోషిస్ జేసిండు. నువ్వు పాండవుల దిక్కు కొస్తె నీకు రాజ్యమిస్తరు. ద్రౌపది నీకు గూడ పెండ్లామైతది అని కిష్నుడు ఆసబెట్టినా కర్నుడు గోడదుంకలేదు. మీరు గూడ కర్నుని లెక్క ఉండాలె. అని సిద్దరామయ్య జెప్పిండు. అసమ్మతి లీడర్ ఎంపిని జేస్తమన్నడు. మంత్రి కుర్సిలను త్యాగం జేసి అసమ్మతి ఎమ్మెల్యేలకు ఇస్తమని కాంగ్రెస్ మంత్రులు జెప్పిండు. దాంతోని అసమ్మతి కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సల్లబడ్డరు. గని విప్ ఇచ్చినా నలుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సిఎల్‌పి మీటింగ్‌కు రాలేదు. మా దిక్కుకొస్తె తలా నూరు కోట్లే గాకుంట మంత్రి కుర్సిలు ఇస్తమని బిజెపి అంటున్నది. కాంగ్రెస్ అసమ్మతి ఎమ్మెల్యేలు ఉంటరో ఆడికి బోతరో. ఆపరేషన్ కమల తుస్సుమంటదో. బస్సుమంటదో మల్ల గలుస్త" అన్కుంట దున్నపోతు నర్కం బోయింది. నారాయన; నారాయన అన్కుంట నారదుడు వైకుంటం బోయిండు.

సెల్: 9959150491



శ్రీదేవి పాటలకు డ్యాన్స్ చేసేదాన్ని...

కైరా అద్వానీ.. అశోక్‌కుమార్ ముని మనుమరాలు.. సయీద్ జాఫ్రీ తమ్ముని కూతురు. ఇంకా చెప్పాలంటే జూహీచావ్లా మేన కోడలు. ఇవన్నీ ఉన్నా.. చెట్టు పేరు చెప్పుకుని కాయలమ్ముకునే రకం కాదు. స్వయం కృషినే నమ్ముకుంది. ఫగ్లీతో హిందీ సినీ రంగ ప్రవేశం, ధోనీ సినిమాతో... దేశమంతటా పరిచయమయ్యింది. కరణ్‌జోహార్ దర్శకత్వంలో 'లస్ట్ స్టోరీస్' హాట్ టాపిక్ అయ్యింది. 'భరత్ అనే నేను' తెలుగు తెరకు పరిచయమైన కైరా... అందంతోనే కాదు అభినయంతోనూ అందరినీ ఆకట్టుకుంటున్నది. ఇటీవలే 'వినయ విధేయ రామ'తో విజయం అందుకుంది. వరుస సినిమాలతో బిజీగా ఉన్న కైరా అలియా అద్వానీ గురించి... ఆమె మాటల్లోనే...

"నా అసలు పేరు అలి అద్వానీ. సినిమాల్లోకి ఎంట్రీ ఇచ్చేటప్పుడికే ఆలియా ఉండటంతో డైరెక్టర్ సదానంద్‌గారు నా పేరును కైరాగా మార్చేశారు. మా తాత, సయీద్ జాఫ్రీ సోదరులు. అయన మొదట మా అమ్మమ్మను పెండ్లి చేసుకున్నాడు. ఆమె బ్రిటీషర్. ముస్లిం అయినప్పటికీ ఆమెకు విడాకులు ఇచ్చి... అశోక్‌కుమార్ కూతురు భారతీ గంగూలీని వివాహమాడారు. అలా అశోక్‌కుమార్‌కు మునిమనమరాలును అయిపోయాను. మా మొదటి అమ్మమ్మ ఎప్పుడూ పర్యటనల్లో ఉండేది. దాంతో... అమ్మకు 13 ఏండ్లు ఉన్నప్పటినుంచే రెండో అమ్మమ్మ పెంచింది.

నేనే సెంటరాఫ్ అట్రాక్షన్...

నాన్న జగదీప్ బిజినెస్‌మ్యాన్. మా అమ్మానాన్న పెండ్లికి ముందు ఏడేండ్లు డేటింగ్ చేశారు. అప్పటినుంచే జూహీ ఆంటీ పరిచయం. వాళ్లు మంచి స్నేహితులు. నాకు ఊహ తెలిసినప్పటినుంచే దివాళీ పండుగ అయినా, హోలీ పండుగ అయినా.. మా ఇంట్లోనో, వాళ్లింట్లోనో జరిగేది. పిల్లలందరిలోకి నేను పెద్ద దాన్ని కావడంతో... డ్యాన్స్ చేయమని అడిగేవారు. అలా నేను సెంటర్ ఆఫ్ అట్రాక్షన్ అయ్యేదాన్ని. నాకు మా తమ్ముడితో అటాచ్‌మెంట్ ఎక్కువ. బాగా కొట్లాడుకుంటాం. నాకంటే చిన్నవాడైనా వాడే నాకు స్ఫూర్తి.

రెండో ఏటనుంచే...

చిన్నప్పటినుంచే నటి కావాలనుకున్నాను. అమ్మ ఎప్పుడు ఫొటోస్ తీసుకున్నా.. నేను కచ్చితంగా ఫ్రేమ్‌లో ఉండేలా చూసుకునేదాన్ని. రెండేండ్ల వయసులో వీడియో చూస్తే... నేను బాలేరినా చేస్తూ ఉంటా. అమ్మ ప్లేస్కూల్ నడిపేది. నా ఇష్టాన్ని గమనించినా... కచ్చితంగా గ్రాడ్యుయేషన్ పూర్తి చేయాలని పట్టుబట్టింది. క్యాతడ్రల్ స్కూల్లో ప్లస్ టూ వరకు చదువుకుని 92పర్సెంట్ మార్కులతో పాసయ్యాను. తరువాత జైహింద్ కాలేజీలో మాస్ కమ్యూనికేషన్స్ చేశాను. తరువాత చిన్న చిన్న యాక్టింగ్ కోర్సులు చేశాను. ఆడిషన్స్‌కు కూడా వెళ్లాను. కానీ అప్పటిదాకా డాడీకి యాక్టింగ్ అంతగా నచ్చేది కాదు.

త్రీ ఇడియట్స్ చూసి..

మాది చాలా ప్రొటెక్టడ్ ఫ్యామిలీ. స్కూల్‌కు కారులో వెళ్లడం, కారులో ఇంటికి రావడం తప్ప బయటి ప్రపంచం తెలియదు. కానీ నాకు పక్కా లోకల్ లాగా ఉండాలనుండేది. ఓసారి లొకేషన్‌కు వెళ్లడం కోసం మా డాడీకి తెలియకుండా ట్రైన్ ఎక్కాను. అదే మొదటి స్టేషన్ కావడంతో ఖాళీగా ఉంది. తరువాతి స్టేషన్‌కు చాలా మంది ఎక్కి కిక్కిరిసింది. అప్పుడు తెలిసింది నేను ఎక్కింది డబ్బావాలాల కంపార్ట్‌మెంట్‌లో అని. సినిమాలు చూసి ఎవరైనా మారతారో లేదోతెలియదు కానీ... త్రీ ఇడియట్స్ చూసి మా డాడీ మారాడు. నాకు ఇష్టమైన వృత్తిలోకే వెళ్లమంటూ



ప్రోత్సహించాడు. అనూరాధ పటేల్ నుంచి కాల్ వచ్చింది... 'ఫొటోస్ పంపు... కబీర్ సదానంద్ కొత్తవాళ్లతో సినిమా తీయాలని అనుకుంటున్నారు' అని చెప్పింది. నా ఆనందానికి అవధులు లేవు. ఆడిషన్స్ జరిగాయి. అలా 'ఫగ్లీ' 2014లో అవకాశం దొరికింది. ఢిల్లీతో నాకు ఎలాంటి అనుబంధం లేదు. అయినా ఢిల్లీ అమ్మాయి పాత్ర పోషించాను. దానికి మిశ్రమ స్పందన వచ్చింది.

టర్నింగ్ పాయింట్...

ఎమ్ఎస్ ధోనీ అన్ అన్‌టోల్డ్ స్టోరీ... బాక్సాఫీస్ దగ్గర మాత్రమే కాదు... నా నటనకు విమర్శకుల నుంచి ప్రశంసలు తెచ్చిన సినిమా. అది చూసిన తరువాత చాలామంది డైరెక్టర్స్ నాకు కాల్ చేశారు. ఇప్పటికీ చాలామంది నన్ను ఆ సినిమాలో సాక్షిగానే గుర్తుపడతారు. కచ్చితంగా ఆ సినిమా నా కెరీర్‌లో మైలు రాయి. తరువాత సినిమా మెషీన్.

లస్ట్ స్టోరీస్... సమాజానికి ప్రతీక

లస్ట్ స్టోరీస్... చాలా చర్చ జరిగిన సిరీస్. కరణ్ సర్ కాల్ చేసినప్పుడు బై మిస్టేక్ నాకు చేశారేమో అనుకున్నా. ఎందుకంటే ఆయన సినిమాలు చూస్తూ పెరిగాను. అలాంటిది తన సినిమాలో చేయడానికి అవకాశం అనగానే ఎగిరి గంతేశాను. లస్ట్ స్టోరీస్ కథ చెప్పగానే పడి పడి నవ్వాను. కానీ అది రియాలిటీ. అదే అర్థమయ్యేట్టు చెప్పారు. దాంతో ఒప్పుకున్నాను. నిజమే.. ఒకప్పుడు ముద్దు సీన్ అంటేనే అదో తప్పుగా చూసేవాళ్లు. కానీ ఇప్పుడా పరిస్థితి లేదు. మహిళల కోరికలు, ఇష్టాయిష్టాలన్నీ ఇప్పుడు బహిరంగంగానే చర్చ జరుగుతున్నాయి. అందుకే అందులో నటించడానికి ఒప్పుకున్నాను. సినిమా సమాజానికి ప్రతీక అనుకుంటాను. మనం నివసిస్తున్న వాతావరణమే సినిమాల్లో ప్రతిబింబిస్తుంది. అయితే అలాంటి వాతావరణం లేనివాళ్లకు అది ఇబ్బందిగా అనిపించొచ్చు!

నాకు నేనే ఛాలెంజ్...

కొరటాల శివగారు ముంబై వచ్చి 'భరత్ అనే నేను' స్క్రిప్ట్ చెప్పారు. దానికంటే ముందే దక్షిణాది నుంచి అవకాశాలు వచ్చాయి. కానీ ధోనీ, మెషీన్ సినిమాలతో బిజీగా ఉన్నాను. ఈ సినిమాకు మాత్రం మహేష్ భార్య... నమ్రత(నాకు మంచి ఫ్రెండ్)' ఇది కచ్చితంగామంచి పాత్రవుతుంది' అని చెప్పింది. దాంతో ఓకే చెప్పాను. నిజానికి చాలా మంది హీరోయిన్‌కు ఏమాత్రం అవకాశం లేని పాత్రలు అన్నారు. కానీ... నా పాత్రకు ఏమాత్రం న్యాయం చేయగలుగుతున్నాను అని మాత్రమే చూస్తాను. పాత్రకు ఎంత నిడివి ఉందనేదాని కంటే.. ఉన్న నిడివిలోనే ప్రేక్షకుల మదిలో నిలిచిపోగలనా లేదా అనేదే ఆలోచిస్తాను. నిజాయితీగా మాట్లాడుకోవాలంటే.. ఇప్పుడు పరిస్థితులు మారుతున్నాయి. హీరోహీరోయిన్లు సమానంగా, బలమైన పాత్రలు పొందుతున్నారు. పోటీ తీవ్రంగానే ఉంది. కానీ తోటి హీరోయిన్స్ నటన చూసి స్ఫూర్తి పొందుతాను. అంతకంటే బాగా చేయాలని నాతో నేనే ఛాలెంజ్ చేసుకుంటా. నా సామర్థ్యం మేరకు నటిస్తా.

డ్యాన్స్ అంటే ఇష్టం...

నాకు డ్యాన్స్ అంటే చాలా ఇష్టం. అందుకే నటినయ్యా. కంప్లీట్‌గా అటు డ్యాన్స్, కామెడీ పెర్ఫామ్ చేయడానికి మంచి స్కోప్ ఉన్న సినిమాలో పని చేసే అవకాశం దొరికినప్పుడు చాలా హ్యాపీగా ఉంటుంది. 'వినయ విధేయ రామ' చేసినందుకు కూడా అదే ఫీలింగ్. 'రామా వెడ్స్ సీత' ఇప్పటి వరకు నేను చేసిన సాంగ్స్‌లో మోస్ట్ ఫేవరేట్. 800 మంది డ్యాన్సర్స్‌తో చాలా గ్రాండ్‌గా పిక్చరైజ్ చేశారు ఆ పాటని. ఇప్పుడు 'అర్జున్ రెడ్డి' రీమేక్ (కబీర్‌సింగ్)లో షాహిద్ సరసన నటిస్తున్నాను. పంజాబీ యువతి పాత్ర. సినిమాలో నేటివిటీకి తగ్గట్టు చిన్న చిన్న మార్పులు చేశారు.

కట్ట కవిత

ర్యాపిడ్ ఫైర్..

ఇష్టమైన డ్రెస్?
డెనిమ్స్ అండ్ వైట్ ట్యాంక్ టాప్.

నటి కాకపోయి ఉంటే.. ?
ఛాన్సే లేదు. ఎందుకంటే చిన్నప్పటినుంచే అనుకున్నానని ముందే చెప్పాను కదా! నేను కోరుకున్నది చేరుకోగలిగినందుకు అదృష్టవంతురాలిని.

ఫిట్నెస్ టిప్స్?
పస్తులుండొద్దు. ఆరోగ్యకరమైన ఆహారం తినండి. ప్రతి రెండు గంటలకోసారి కొంచెం కొంచెం తినండి. రోజుకు కచ్చితంగా గంటైనా వ్యాయామం చేయండి.

బయోపిక్ చేయాలన్న ఆశ ఉందా?
అవును.. మధుబాల. స్టన్నింగ్ అండ్ బ్యూటిఫుల్ లేడీ. నాకు ఆమె గురించి అంతగా తెలియదు. ఆమె జీవిత చరిత్రలో నటించడంతోనైనా ఆమె గురించి పూర్తిగా తెలుసుకోవాలన్న ఆశ.

స్ఫూర్తి..?
మాదురీ దీక్షిత్ డ్యాన్సు స్టెప్పులు, కరీనా కపూర్ ముఖ కవళికలు నన్ను ఎంతో ఆకట్టుకునేవి. ఇక ఆల్‌టైమ్ ఫేవరెట్ శ్రీదేవిగారు. వాళ్ల సినిమాలలోంచి సీన్స్, పాటలు తీసుకుని వాళ్లను అనుకరించేందుకు ప్రయత్నించేదాన్ని.



బలం..?
సినిమాలో అతి పెద్ద సవాలు. మంచి సినిమాను ఎంచుకోవడం. నిజానికి స్క్రిప్ట్ చూడగానే సినిమా ఎలా ఉంటుందనేది ఎవరికీ తెలియదు. కానీ నా అదృష్టమేమంటే... ఒక్క సీన్ వివరించినప్పుడే అర్థం చేసుకోగలను 'అది నాకు సెట్టవుతుందా? లేదా' అని.

ఫస్ట్ కెమెరా ఎక్స్‌పీరియెన్స్..?
తొమ్మిది నెలల వయసులోనే కెమెరా ముందుకు వచ్చాను. ఫేస్ ఆఫ్ విప్రో బేబీ క్యాంపెయిన్ కోసం. అమ్మతోపాటు చేశాను. నెలల పిల్లను కాబట్టి.. నాకవేమీ తెలియదు. కానీ అమ్మ చెబుతుంటుంది... కెమెరా ముందు ఎలాంటి ఇబ్బంది లేకుండా, చాలా ఈజీగా చేశానని.

కో స్టార్స్ విష్‌లిస్ట్...
రణ్‌వీర్‌సింగ్, రణ్‌బీర్ కపూర్, వరుణ్‌దావన్

విజయం తరువాత...
అంతకుముందు... ఆ తరువాత జీవితం అలాగే ఉంది. నటి కావాలన్నది నా కల. అయ్యాను. సక్సెస్ తరువాత ఇంకొంత ఎక్కువమంది నన్ను గుర్తుపడతారు. అంతకు మించి ఏమీ లేదు.

జీవితంలో ఓ రోజు...
షూటింగ్ లేకపోతే... జిమ్ లేదా డ్యాన్స్ ప్రాక్టీస్ చేస్తా ఉంటాను. తరువాత జిమ్నాస్టిక్స్. చివరికి... నెట్‌ఫ్లిక్స్ చూసి, డిన్నర్ చేస్తాను. అంతే! అప్పుడప్పుడు ఫ్రెండ్స్‌తో రెస్టారెంట్‌కి వెళ్తుంటా.

భాషా భేదాలు లేవు...
నాకైతే పర్టికులర్‌గా ఒకే లాంగ్వేజ్ ఆడియెన్స్‌కి స్టిక్ అవ్వాలనే ఆలోచన లేదు. గ్లోబల్ ఆడియెన్స్‌ని ఎంటర్‌టైన్ చేయాలి. లాంగ్వేజ్ ఏదైనా, స్క్రిప్ట్ బావుంటే అది డిజిటల్ ప్లాట్ ఫామ్ అయినా 'నో' అని చెప్పను.



హైలెస్సో.. హైలెస్సా..!

"నీలాల కన్నుల్లో సంద్రమే నింగి నీలమంతా సంద్రమే.. హైలెస్సో హైలెస్సా..." ఈ పాట ఎందరి మదినో నీలి సంద్రంలో ముంచెత్తింది. చిన్నచేపనైనా పెద్ద వలేసే పట్టాలంటారు. ఏండ్ల నాటి నుంచి భుజాన వేలాడే వల.. పొట్టకూటి కోసం వలనే నమ్ముకుని జీవితం సాగించే సముద్రతీర ప్రాంతపు మత్స్యకారులు. కష్టమైనా.. నష్టమైనా... తమ జీవితాలను తరతరాలుగా గట్టుకు చేర్చే ఆ.. విసిరే వలలోనే పనితనం చూపిస్తున్నారు జాలర్లు. వారిచేతులలో ఇమిడిపోయే వలలో చేపలుండవేమోగానీ.. ఊయలలూపే అమ్మ పాటైతే కచ్చితంగా ఉంటుంది. అలాంటి అమ్మ పాటను గుర్తు చేసే తెరచాప పడవలు ఈ వారం మీ కోసం...









వస్తువులనే అటూ ఇటూ...



+ గది కొత్తగా కనిపించటం కోసం ఒక గదిలోని వస్తువులనే అటూ ఇటూ మారుస్తూ ఉంటాం. ఈసారి వేర్వేరు గదుల్లోకి మార్చి చూడండి. కొన్ని వస్తువులకు దాన్ని ఉంచిన ప్రదేశాన్ని బట్టి ఆకర్షణ పెరుగుతుంది. ఇలా ఫర్నిచర్‌ను రీ అరేంజ్ చేయటం వల్ల ఎట్రాక్టివ్‌గా కనిపించే వస్తువులేవో కనిపెట్టి తగిన చోట డిస్‌ప్లే చేయొచ్చు.
+ గదిలో ఒకదానితో ఒకటి సంబంధం లేని వస్తువులున్నాయా? స్టూల్, డెస్క్, షెల్ఫ్, టేబుల్... ఇవన్నీ వేర్వేరు ఎత్తుల్లో, స్టయిల్, ప్యాటర్న్‌లో ఉంటాయి. వీటన్నిటికి మధ్య యూనిఫార్మిటీ తీసుకురావాలంటే వీటిలో కొన్నిటికైనా ఒకే రంగు పెయింట్ వేయండి. ఆ వస్తువుల్ని పక్కపక్కనే కాకుండా దూరంగా ఉంచండి.
+ అతిథులు రాబోతున్నారని తెలియగానే చిందర వందరగా పడి ఉన్న వస్తువుల్ని ఏరి దాచటానికి ఈ బాస్కెట్లు భలే అక్కరకొస్తాయి. అయితే ఈ బాస్కెట్లనే డెకరేషన్‌లో భాగంగా కూడా మలచొచ్చు. కళ్లు ఆకర్షించే ప్రదేశంలో వీటిని ఉంచాలి. అయితే అవన్నీ ఒకే మెటీరియల్ లేదా కలర్‌వే అయి ఉండాలి.
+ ఇందుకోసం ఖరీదైన పెయింటింగ్ కొనాల్సిన అవసరం లేదు. కొన్ని పాత మ్యాగజైన్లు, టేప్ ఉంటే సరిపోతుంది. ఒకే థీమ్ లేదా కాంట్రాస్టగా ఉండే పేజీల్ని కత్తిరించి దగ్గరదగ్గరగా ఎక్కువ పేజీలు అంటించాలి. వాటి మధ్యలో అక్కడక్కడా ఆకులు, పూల షేప్‌లో పేపర్లు కట్ చేసి అంటించాలి.



చిటికెడు పసుపు..!

ఆహారంలో భాగంగా రోజూ వంటల్లో వాడే పసుపు ఆరోగ్యానికి ఎంత మంచిదో ఎన్ని వ్యాధుల్ని నిరోధిస్తుందో మనకు తెలియంది కాదు. అయితే పసుపులోని కుర్‌క్యుమిన్ ఓ అద్భుతమైన యాంటీ ఆక్సిడెంట్ అనీ ఇది ఇన్‌ఫ్లమేషన్‌కి కారణమయ్యే ఫ్రీరాడికల్స్‌ను నాశనం చేయడం ద్వారా క్యాన్సర్లను రానివ్వకపోవడంతో పాటు, పక్షవాతం, ఆల్జీమర్స్.. వంటి వ్యాధుల్నీ రానివ్వదనీ కాలిఫోర్నియా విశ్వవిద్యాలయ నిపుణులు చేసిన పరిశోధనల్లో తేలింది. వాళ్లు ఆల్జీమర్స్ వచ్చే అవకాశం ఉన్నవాళ్లని ఎంపికచేసి ఆరునెలల పాటు వాళ్లకి తగు మోతాదులో పసుపుని ఇవ్వడం వల్ల మతిమరపు తగ్గి, జ్ఞాపకశక్తి పెరిగినట్టు గుర్తించారు. అంతేకాదు, డిప్రెషన్, ఒత్తిడి కూడా తగ్గినట్టు తేలడంతో ప్రపంచవ్యాప్తంగా పసుపు వాడకం ఎక్కువగా పెరిగింది. ❄

తళుక్కుమనే మెరుపు...

కాస్త వయసుపై బడితే చర్మం ముడతలు పడుతుంది. అలా కాకుండా చర్మం యవ్వనంగా కనిపించాలంటే కొన్ని చిట్కాలను పాటిస్తే సరిపోతుంది.

- ప్రతిరోజు తీసుకునే ఆహారంలో ప్రోటీన్లు ఉండే ఆహార పదార్థాలు ఉండేలా చూసుకోవాలి. ఇవి కూరగాయలు, పండ్లు, బెర్రీలు, గింజలు, ఆకుకూరల్లో లభిస్తాయి. ఈ విధమైన ఆహార పదార్థాలు చర్మానికి అవసరమైన పోషకాలను అందిస్తాయి.



- చర్మ సంరక్షణకు అవసరమైన నియమాలను కచ్చితంగా పాటించాలి. చర్మాన్ని శుభ్రంగా ఉంచుకోవడం, మాయిశ్చరైయిజ్ రాసుకోవడం వంటి జాగ్రత్తలు పాటిస్తే సరి.
- వ్యాయామం చేయడం వల్ల చర్మం డిటాక్సిఫికేషన్ అవుతుంది. ప్రతిరోజు క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తే గుండె పనితీరు మెరుగుపడటంతో పాటు రక్త ప్రసరణ బాగా జరిగి చర్మంలో ఉండే మలినాలను బయటకు పోవడానికి సాయపడుతుంది. వ్యాయామం చేయడం వల్ల ముఖం ప్రకాశవంతంగా తయారవుతుంది.
- ఆలస్యంగా నిద్ర పోవడం అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. సరిగ్గా నిద్రపోవడం వల్ల చర్మానికి అవసరమైన కొల్లాజెన్ ఉత్పత్తి అవుతుంది.

❄

ట్రాన్స్‌జెండర్స్‌కు ఎల్ఎల్ఆర్

- రాష్ట్ర చరిత్రలోనే మొదటిసారి
- కడప జిల్లా రికార్డ్



చాపాడు : రాష్ట్ర చరిత్రలోనే మొట్టమొదటిసారిగా ట్రాన్స్‌జెండర్స్‌కు ఎల్ఎల్ఆర్ లైసెన్స్‌లు జారీ చేసిన జిల్లాగా కడప రికార్డ్ సష్టించింది. కడప జిల్లా చాపాడు మండలం పల్లవోలులోని చైతన్య భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల ఆవరణలో శనివారం ఏర్పాటు చేసిన న్యాయ సేవల శిబిరంలో జిల్లాలోని 32 మంది ట్రాన్స్‌జెండర్లకు ఎల్ఎల్ఆర్ లైసెన్స్ పత్రాలను కలెక్టర్ హరికిరణ్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్, ఎస్‌పి అభిషేక్ మహంతి పంపిణీ చేశారు. రవాణా శాఖ ద్వారా లైసెన్స్ పొందడానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోడానికి ట్రాన్స్‌జెండర్లు ప్రయత్నించగా లింగ బేదం వద్ద స్త్రీ లేదా పురుషుడు అని మాత్రమే ఉండటంతో దరఖాస్తు చేయడానికి వీల్లేకుండా పోయింది. దీంతో ట్రాన్స్‌జెండర్‌లు జిల్లా జడ్జి శ్రీనివాస్‌ను కలిసి ఆన్‌లైన్లో ఉన్న వివరాలు తెలిపి ట్రాన్స్‌జెండర్లకు కూడా లైసెన్సులు వచ్చేలా చర్యలు తీసుకోవాలని విన్నవించుకున్నారు. దీనిపై జడ్జి శ్రీనివాస్ కలెక్టర్ హరికిరణ్, డిటిసి బసిరెడ్డితో మాట్లాడి న్యాయసేవల శిబిరం వారందరికీ లైసెన్సులు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన కలెక్టర్ రవాణా శాఖ కార్యదర్శి బాలసుబ్రమణ్యంతో మాట్లాడి దరఖాస్తులో మేల్ ఫిమేల్‌తో పాటు ట్రాన్స్‌జెండర్స్ అనే కాలం ఏర్పాటు చేశారు.

శనివారం నిర్వహించిన న్యాయ సేవల శిబిరంలో 32 మంది ట్రాన్స్‌జెండర్లకు ఎల్ఎల్ఆర్ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, మండలాల లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్ మనోహర్‌రెడ్డి, సిబిఐటి చైర్మన్ జయచంద్రారెడ్డి, జెసి-2శివారెడ్డి, డిఆర్‌డిఎ పీడీ రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జెండా మోస్తున్న నేతలకే డీసీసీ ఇవ్వాలి : వీహెచ్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

గత 20 ఏండ్లుగా కాంగ్రెస్ పార్టీ జెండా మోస్తున్న నాయకులకే జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవులు ఇవ్వాలని మాజీ ఎంపీ వి హనుమంతరావు కోరారు. కొత్తగా పార్టీలో చేరిన వారిని అందలమెక్కిస్తే ఒంటేరు ప్రతాపరెడ్డి జారుకున్నట్టే పదవి దక్కిన తర్వాత పోతారని హెచ్చరించారు. పార్టీ వర్కర్‌కు పదవులు ఇస్తే పార్టీ బలోపేతం కోసం పని చేస్తారన్నారు. అనుచరులకు, అనుయాయుల కోసం పైరవీలు చేయకుండా ఉంటే పార్టీకి ఎంతో మంచిదని సూచించారు. శనివారం గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. 32 జిల్లాలకు అధ్యక్షులను నియమించడం ద్వారా పార్టీ బలోపేతం అవుతుందన్నారు. బడుగు, బలహీనవర్గాలకు చెందిన మల్లు భట్టి విక్రమార్కను సీఎల్పీ నేతగా నియమించినందుకు వీహెచ్, మల్లు రవి, శ్రీధర్‌బాబు, పార్టీ నాయకులు రాహుల్‌గాంధీకి కృతజ్ఞతలు తెలిపారు.

మేడమ్...బాగున్నారా?

మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని టీఆర్ఎస్ ఎమ్మెల్యే కాలే యాదయ్య పలకరించారు. ఆమె కారు వద్దకు వెళ్లి మేడమ్ బాగున్నారా? అంటూ పలకరించారు. అసెంబ్లీ ఆవరణంలో ఆమెను కలిశారు. ఒకరినొకరు పలకరించడం సర్వసాధారణమే అయినా సబితా ఇంద్రారెడ్డి కారెక్కితున్నారన్న వార్తల నేపథ్యంలో యాదయ్య వెళ్లి ప్రత్యేకంగా పలకరించడం పట్ల ఆసక్తి నెలకొంది.

వామ్మో ఢిల్లీలో పొగమంచు : ఎమ్మెల్యే మల్లారెడ్డి

మల్కాజ్‌గిరి ఎంపీ, తాజా ఎమ్మెల్యే మల్లారెడ్డి, ఎమ్మెల్సీలు బానుప్రసాదరావు, పూలరవీందర్, బోడకుంట వెంకటేశ్వర్లు అసెంబ్లీ లాబీల్లో తారసపడ్డారు. అన్న ఎంపీగా బాగుందా? ఎమ్మెల్యేగా బాగుందా? అని బానుప్రసాద్ అడిగారు. ఢిల్లీలో వామ్మో డెంజర్ పొగమంచు దాని నుంచి బయటపడ్డాను. ఎమ్మెల్యేగా ఇక్కడ లోకల్. అన్నకు మంత్రి వస్తుందేమో అని మరో పాత్రికేయుడు అనడంతో అంతా వారి దయ అంటూ వెళ్లిపోయారు.

ప్రాణం తీసిన భూ తగాదా..


- అన్న కుటుంబంపై గొడ్డళ్లు, ఇనుపరాడ్లతో దాడి
- కొడుకు మృతి, చికిత్స పొందుతున్న తండ్రి

నవతెలంగాణ-రాయికల్

ఇద్దరు అన్నదమ్ముల కుటుంబాల మధ్య భూ తగాదాలు సినిమా ఫ్యాక్షన్ గొడవను తలపించాయి. తమ్ముడి కుటుంబ సభ్యులు గొడ్డళ్ళ, ఇనుపరాడ్లతో దాడి చేయటంతో అన్న కుమారుడైన పుల్ల గంగమల్లయ్య(36) మృతిచెందాడు. అన్న పోచాలు తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. జగిత్యాల జిల్లా రాయికల్ మండలం కురుమపల్లి గ్రామంలో శనివారం ఈ ఘటన చోటు చేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. కురుమపల్లి గ్రామ పంచాయతీలో పుల్ల పోచాలు, పుల్ల లస్మయ్య ఇద్దరు సోదరులు. వారసత్వంగా వచ్చిన భూమిని వాళ్ల తండ్రి ఇద్దరికి పంచి ఇచ్చారు. కానీ పంపకాల్లో తక్కువొచ్చిందంటూ ఇరు కుటుంబాల మధ్య కొంత కాలంగా వివాదం కొనసాగుతోంది. ఈ విషయమై ఇరు కుటుంబాలు ఇటీవల ఘర్షణ పడ్డాయి. తమ్ముడు లస్మయ్య అన్న పోచాలుపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ కరుణాకర్ ఇరు కుటుంబాల్ని పిలిపించి కౌన్సి లింగ్ ఇచ్చారు. అయినప్పటికీ శనివారం ఉదయం మళ్లీ మధ్య గొడవ పడ్డారు. ఈ క్రమంలో పొలం వద్ద పని చేసుకుంటున్న అన్న పోచాలు, అతని కుమారుడు గంగ మల్లయ్యలపై తమ్ముడు లస్మయ్య, అతని భార్య మల్లవ్వ, కుమారుడు మహేష్‌లు కలిసి ఇనుపరాడ్‌లు, గొడ్డళ్లతో దాడిచేసి పరారయ్యారు. తీవ్ర గాయాలపాలైన పోచాలు అతని కుమారుడు గంగమల్లయ్యలను స్థానికులు జగిత్యాల ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలోనే పరిస్థితి విషమించి గంగమల్లయ్య మృతి చెందాడు. తీవ్ర గాయాలైన పోచాలు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మృతుని భార్య లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సింగరేణి మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

- సింగరేణి సేవా అధ్యక్షులు పద్మజాశంకర్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సింగరేణి సేవా సమితి ద్వారా నిర్వహిస్తున్న స్వయం ఉపాధి శిక్షణ కార్యక్రమాల ద్వారా శిక్షణ పొంది తద్వారా యూనిట్లు ప్రారంభించుకుంటూ సింగరేణి మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని సేవా అధ్యక్షులు శ్రీమతి పద్మజా శంకర్ కోరారు. హైద్రాబాద్లో జనవరి 1వ తేదీ నుంచి నిర్వహిస్తున్న ఇండస్ట్రీయల్ ఎగ్జిబిషన్లో ఏర్పాటు చేసిన సింగరేణి సేవా సమితి స్టాల్‌ను శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు స్వయం సమృద్ధి సాధించేందుకు సింగరేణి సంస్థ అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నదన్నారు. సింగరేణి సేవా సమితి ద్వారా డ్రెస్ మేకింగ్, జ్యూట్ బ్యాగ్ మేకింగ్, కాగితపు సంచు తయారీ లాంటి అనేక శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. ఇప్పటికే సింగరేణి వ్యాప్తంగా అన్ని ఏరియాల్లోని మహిళలు ఉత్సాహంగా పాల్గొంటూ స్వంత యూనిట్లు నెలకొల్పుకుంటున్నారని, ఈ అవకాశాన్ని సింగరేణి మహిళందరూ సద్వినియోగం చేసుకుంటూ వేనీళ్లకు చన్నీళ్ల తమ కుటుంబాలకు ఆసరగా ఉండాలని సూచించారు. కంపెనీ సెక్రటరీ సతీమణి శ్రీదేవి శ్రీనివాస్ మాట్లాడుతూ దాదాపు 45 రోజుల పాటు నిర్వహించే ఎగ్జిబిషన్లో సేవా మహిళలు వారు తయారుచేసిన ఉత్పత్తులను ఈ స్టాల్ ద్వారా అమ్మకాలు చేపట్టడం అభినందనీయమన్నారు. కార్పోరేట్ ఏరియా నుంచి సేవా సెక్రటరీ సుమభాను, వెంకటలక్ష్మీ, స్వప్నిక, మందమర్రి ఏరియా నుంచి రజిత, సత్యవతి, కుమారి రజమణి, రామగుండం-1 ఏరియా నుంచి సరిత, రేష్మ, రామగుండం-2 ఏరియా నుంచి మెరిసి పద్మ వారు తయారు చేసిన వస్తువులను ఈ స్టాల్లో అమ్మకానికి ఉంచారు.

ఆరుగురికి నోటీసులు

షర్మిల కేసులో మొదలైన విచారణలు

- పోస్టులకు కామెంట్లు పెట్టినా శిక్షార్హులే..
- రెండు, మూడు రోజుల్లో అరెస్టులు..?



ఫైల్

హైదరాబాద్ :వైఎస్ షర్మిలపై సోషల్‌మీడియాతో అభ్యంతరకర పోస్టులు పెట్టిన వారిని సైబర్ క్రైం పోలీసులు జల్లెజపట్టి మరీ వెతుకుతున్నారు. ఇప్పటి వరకు యూట్యూబ్‌లో 60 వీడియో లింకులను పోలీసులు గుర్తించారు. అయితే అవి ఏపీ యూట్యూబ్ ఛానల్స్‌కు సంబంధించినవో తెలుసుకునే పనిలో అధికారులు ఉన్నారు. మరోవైపు ఫేస్‌బుక్, ఇతర సోషల్‌మీడియా సైట్లలోనూ పోస్టులు పెట్టిన 15 మందిని పోలీసులు గుర్తించారు. వీరిలో శుక్రవారం ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారించిన పోలీసులు శనివారం మరో ముగ్గురిని విచారించారు. అనంతరం వారందరినీ నిందితులుగా పేర్కొంటూ సీఆర్పీ సీ 41 (ఏ) క్రింద నోటీసులు జారీ చేశారు. త్వరలో మరికొంత మందికి నోటీసులు జారీ చేయాలని నిర్ణయించినట్లు తెలిసింది. ఇదిలావుంటే నోటీసులు అందుకున్న వారంతా తెలుగు రాష్ట్రాల్లో వివిధ ప్రాంతాలకు చెందిన వ్యక్తులు, వీరిలో ఐదుగురు హైదరాబాద్‌లో స్థిరపడి సొంతంగా యూట్యూబ్ ఛానల్స్ నిర్వహిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అయితే షర్మిల ఫిర్యాదు నేపథ్యంలో చాలా మంది కంటెంట్‌ను డిలీట్ చేశారని, అయితే అప్పటికే వీళ్లు పోస్టు చేసిన కంటెంట్‌కు సంబంధించిన ఆధారాలు పోలీసులకు చేరినట్లుగా తెలుస్తోంది. ఇదే సమయంలో కేవలం కంటెంట్ ను పోస్టుచేసిన వాళ్లకే కాదు..కామెంట్లు పెట్టిన వాళ్లను కూడా విచారించాలని సీసీఎస్ పోలీసులు భావిస్తున్నారు. ఫేస్‌బుక్ లో, గూగుల్‌లో చాలా మంది ఫేక్ అకౌంట్లు క్రియేట్ చేసి..వీడియోల క్రింద కామెంట్లు చేసినట్లు పోలీసులు గుర్తించారు. అకౌంట్ ఎలా క్రియేట్ చేశారు..? అకౌంట్ క్రియేట్ చేసే సమయంలో ఏపీ మెయిల్ ఐడి, ఫోన్ నెంబర్‌లు ఇచ్చారనే అంశాలతో పాటు పోస్టులు అప్‌లోడ్ చేసే సమయంలో ఏపీ ఐపి అడ్రస్ ద్వారా ఇంటర్‌నెట్‌ను వినియోగించారనే వివరాలపై పోలీసులు ఆధారాలు సేకరిస్తున్నారు. ఇప్పటికే తగిన సమాచారం కోసం యూట్యూబ్, ఫేస్‌బుక్ పోలీసులు లేఖలు రాయగా, కొన్నింటికి సంబంధించిన ఆధారాలు ఆయా సంస్థలు అందజేసినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో ఒకటి రెండు రోజుల్లో అరెస్టులు కూడా ఉండే అవకాశం ఉందని పోలీసు వర్గాలు పేర్కొంటున్నాయి.

ఎన్ఐఎ విచారణకు వైసీపీ నాయకులు



గ్రేటర్ విశాఖ బ్యూరో/అమలాపురం : వైసీపీ అధినేత జగన్‌పై కోడికత్తితో దాడి చేసిన ఘటనలో విచారణ నిమిత్తం శనివారం వైసీపీ విశాఖ నేతలు నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్ఐఎ) ఎదుట సాక్ష్యం కోసం హాజరయ్యారు. మాజీ ఎమ్మెల్యేలు మళ్ల విజయప్రసాద్, తైనాల విజయకుమార్, ఇతర నాయకులు కెకె.రాజు, విశాఖ దక్షిణ నియోజకవర్గ వైసీపీ సమన్వయ కర్త, ప్రముఖ వైద్యులు పివి.రమణమూర్తి తదితరులు హాజరయ్యారు. ఘటన జరిగిన రోజున పలువురు వైసీపీ నాయకులు ఆ పరిసరాల్లో ఉండడంతో దాడి విషయమై ఎన్ఐఎ అధికారులు పలు కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. వీరితో పాటు విజయనగరం జిల్లా పార్టీ నాయకులు బొత్స సత్యనారాయణ మేనల్లుడు మజ్జి శ్రీనివాసరావును, సాలూరు ఎమ్మెల్యే పీడిక రాజన్నదొరను కూడా ఎన్ఐఎ అధికారులు విచారణ చేస్తున్నారు. గతేడాది అక్టోబర్ 25న విశాఖ విమానాశ్రయంలో జగన్మోహన్‌రెడ్డిపై శ్రీనివాసరావు అనే వ్యక్తి కోడికత్తితో దాడి చేసిన సంగతి తెలిసిందే.

తూర్పుగోదావరి జిల్లా ముమ్మిడివరం మండలం ఠానేల్లంకలో రహస్య విచారణ జరిపింది. కేసు విచారణకు సంబంధించి రాష్ట్ర పోలీసులు, సిట్ అధికారులు తమకు ఏమాత్రమూ సహకరించడంలేదని ఎన్ఐఎ సభ్యులు న్యాయస్థానం దృష్టికి తీసుకువెళ్లిన సంగతి తెలిసిందే. జగన్‌పై హత్యాయత్నం చేసిన సమయంలో నిందితుడు జనిపెల్ల శ్రీనివాస్ వద్ద లభించిన లేఖ ఆధారంగా ఎన్ఐఎ బృందం దర్యాప్తు చేసినట్లు సమాచారం. ఈ లేఖ రాసినట్లు భావిస్తున్న శ్రీనివాసరావుకు వరుసకు సోదరి అయిన జనిపెల్ల విజయదుర్గను ఎన్ఐఎ బృందం శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ విచారించింది. దీనికి సంబంధించిన సమాచారం మీడియాకు తెలియజేయకుండా గోప్యంగా ఉంచింది.

ప్రజలకు ఉపయుక్తంగా నిలిచేవారే సెలబ్రెటీలు

- సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్



విశాఖ: ప్రజలకు ఉపయుక్తంగా నిలిచిన వారే నిజమైన సెలెబ్రెటీలని సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్ అన్నారు. విశాఖలోని కళాభారతి ఆడిటోరియంలో శనివారం నిర్వహించిన 'లోక్ నాయక్ ఫౌండేషన్' పురస్కార మహోత్సవానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. లాభ నష్టాలను బేరీజు వేయకుండా చేసిందే నిజమైన ప్రజా సేవ అని పేర్కొన్నారు. కీర్తి, డబ్బు సంపాదనపై అందరికీ కోరిక ఉంటుందని, ఇతరులకు సేవలందించిన వారికే కీర్తి దక్కుతుందని తెలిపారు. జయప్రకాష్ నారాయణ్, ఎన్‌టీఆర్ వంటి వారు అనేక రకాలుగా ఆదర్శంగా నిలుస్తారని చెప్పారు. లోక్ నాయక్ ఫౌండేషన్ 15 ఏండ్లుగా సాహితీకారులను సత్కరించి, ప్రోత్సహించేలా పురస్కారాలు అందజేస్తుందని, నిరంతరం ఇటువంటి కార్యక్రమాలు కొనసాగించాలని ఆకాంక్షించారు. అంతకుముందు ప్రఖ్యాత తెలుగు సాహిత్యకారుడు, నవల, కథా రచయిత 'అంపశయ్య నవీన్'కు 'తెలుగు జ్ఞానపీఠ్'గా పిలుచుకునే 'లోక్ నాయక్ ఫౌండేషన్ పురస్కారం'ను, బాలల వికాసానికి విశేష కృషి చేస్తున్న ఎన్.మంగాదేవి, వికలాంగులకు, కళా, సాహిత్య, సాంస్కృతిక రంగాలకు సేవలందిస్తున్న వంశీ రామరాజుకు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి లోక్ నాయక్ ఫౌండేషన్ అధ్యక్షులు ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ నేతృత్వం వహించారు.

గోదావరిలో ఇద్దరు గల్లంతు

- సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మృతదేహం లభ్యం
- బిటెక్ విద్యార్థి ఆచూకీ కోసం గాలింపు





దేవీపట్నం : గోదావరిలో స్నానం చేస్తుండగా మునిగిపోతున్న బిటెక్ విద్యార్థిని రక్షించేందుకు ప్రయత్నించి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ప్రాణాలు కోల్పోయాడు. బిటెక్ విద్యార్థి ఆచూకీ కోసం గాలిస్తున్నారు. పిఠాపురం మండలం కందరాడకు చెందిన బిటెక్ విద్యార్థి తోట సంతోష్ (20), బెంగుళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న పిల్లా రాజీవ్ (35) దేవీపట్నం మండలం మడిపల్లి గ్రామంలోని బంధువుల ఇంటికి శనివారం వచ్చారు. సంతోష్ స్నానం చేస్తూ మునిగిపోబోతుండగా, ఒడ్డుపైనున్న రాజీవ్ రక్షించబోయారు. ఇద్దరూ నీటమునిగారు. దేవీపట్నం ఎస్ఐ వెంకట్రావుతోపాటు స్థానికులు గాలింపు చర్యలు చేపట్టగా రాజీవ్ మృతదేహం లభ్యమైంది. సంతోష్ కోసం గాలించినా ఫలితం లేకుండాపోయింది. రాజీవ్ బెంగుళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నారు. ఆయన తండ్రి బాబ్జి కిడ్నీ సంబంధిత వ్యాధితో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. సంతోష్ విశాఖపట్నం గాయత్రి కాలేజీలో బిటెక్ చదువుతున్నాడు. పండుగ సెలవులు కావడంతో శనివారం దేవీపట్నం వచ్చి అక్కడ నుంచి మడిపల్లిలోని సంతోష్ చిన్న తాతయ్య బదిరెడ్డి వీరనరసయ్య ఇంటికి వెళ్లాడు. అక్కడికి సమీపంలోని గోదావరిలో స్నానం చేస్తుండగా గల్లంతయ్యాడు.

ఫ్రాన్స్‌లో ఆగని ఆగ్రహజ్వాలలు

- వరుసగా పదోవారం యెల్లో వెస్ట్ నిరసనలు
- టియర్‌గ్యాస్,వాటర్‌కెనాన్లు ప్రయోగించిన పోలీసులు



పారిస్:ఫ్రాన్స్‌లోని మక్రాన్ సర్కార్‌కు వ్యతిరేకంగా జరుగుతున్న వారంతపు ఆందోళనలు పదోవారమైన శనివారం అట్టుడికాయి. ఆర్థిక సంస్కరణలు,చమురుధరలపై పన్నులపెంపును నిరసిస్తూ.. వేలాదిమంది ప్రజలు శాంతియుతంగా నిరసన ప్రదర్శనలు చేపట్టారు. ప్లకార్డులు,బ్యానర్లు చేతబట్టుకుని భారీసంఖ్యలో రోడ్లపైకి వచ్చారు.



'పౌరులు ప్రమాదంలో ఉన్నారన్న' బ్యానర్లతో పాటు .. గులాబీ పూలతో తమ నిరసనలను ప్రభుత్వానికి తెలపటానికి తరలివచ్చారు. పోలీసులు కవ్వింపుచర్యలకు పాల్పడటంతో పాటు ఆందోళనకారులపై లాఠీలు ఝుళిపించారు. దొరికిన వారిని దొరికినట్టు చితకబాదారు. ఆందోళనలను అదుపు చేయడానికి పోలీసులు టియర్ గ్యాస్, వాటర్‌కెనాన్లు ప్రయోగించారు. ఈ ప్రదర్శనలో పాల్గొన్న పలువురికి గాయాలయ్యాయి. ప్రతి శనివారం యెల్లో వెస్ట్ నిరసనలు మక్రాన్ సర్కారును ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి.




అమెరికాలో భారీ నిరసనలు

- వైట్ హౌస్ ఎదుట వేలాది మందితో మహిళల మార్చ్
- న్యూయార్క్, లాస్ ఏంజెల్స్‌తో సహా 31 నగరాల్లో ప్రదర్శనలు



వాషింగ్టన్ : ట్రంప్ ప్రభుత్వం అనుసరిస్తున్న మహిళా వ్యతిరేక, జాతి వివక్ష, వలస వ్యతిరేక విధానాలను, అలాగే పొదుపు చర్యలను నిరసిస్తూ శనివారం నాడు అమెరికా అంతటా భారీ నిరసన ర్యాలీలు నిర్వహించారు. 2017లో ట్రంప్ అధికారంలోకి వచ్చిన తరువాత మహిళలు ఇంత పెద్దయెత్తున నిరసన మార్చ్ నిర్వహించడం ఇదే మొదటిసారి. అధ్యక్ష భవనం వైట్ హౌస్ ఎదుట 50 వేల మందితో ప్రధాన మార్చ్ నిర్వహించారు. న్యూయార్క్, లాస్ ఏంజెల్స్, అట్లాంటాతో సహ 31 నగరాల్లో నిర్వహించిన ర్యాలీల్లో వేలాది మంది మహిళలు పాల్గొన్నారు.

21న దావోస్‌కు మంత్రి లోకేశ్



అమరావతి :పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ ఎరల్డ్ ఎకనామిక్ ఫోరం వార్షిక సమావేశాల్లో పాల్గొనేందుకు స్విట్జర్లాండ్‌లోని దావోస్‌కు ఈ నెల 21న వెళ్లనున్నారు. సమావేశాల్లో డెలాయిట్, ప్రోక్టర్ అండ్ గేంబల్, విప్రో, పెగా సిస్టమ్స్, అర్సెలార్ మిట్టల్, నెస్లే, ఐటీ అండ్ టీ, ఇన్వెస్కో కంపెనీల ప్రతినిధులతో భేటీ అయ్యి రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఉన్న అవకాశాలను, అనువైన పరిస్థితులను వివరించనున్నారని ఆయన కార్యాలయ అధికారులు శనివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో మొదటి స్థానంలో నిలిచిన రాష్ట్రంలో ప్రభుత్వం అమలు చేస్తున్న పాలసీలు, ఇస్తున్న రాయితీలను ఆయా సంస్థల ప్రతినిధులకు వివరించనున్నారు. ప్రపంచ ఆర్థిక వేదిక కాంగ్రెస్ సెంట ర్‌లో 23వ తేదీన ఎజైల్ గవర్నెన్స్, డిజిటల్ గవర్నెన్స్, ఇండియా 4.0 అంశాలపై, 24న సస్టైనబుల్ మ్యానుఫ్యాక్చరింగ్, ఇంటర్నెట్ ఆఫ్‌థింగ్స్ వంటి అంశాలపై ప్రసంగించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రతినిధి బృందంలో వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి పూనం మాలకొండయ్య, ప్రకృతి వ్యవసాయ సలహా దారు టి.విజయ్‌కుమార్, ఇంధన, మౌలిక, పెట్టుబడుల శాఖ ముఖ్య కార్యదర్శి అజయ్‌జైన్, పరిశ్రమల శాఖ కార్యదర్శి ఆరోక్యరాజ్, ఏపీఐఐసీ ఎండీ అహ్మద్‌బాబు, సమాచారశాఖ కార్యదర్శి బి.రామాంజనేయులు తదితరులు ఉన్నట్లు తెలిపారు.

విద్వేషంపై అప్రమత్తం

- బీజేపీ ఆలయ రాజకీయాలపై టెలికాన్ఫరెన్స్‌లో చంద్రబాబు



అమరావతి :'ఆలయ రాజకీయాలు చేస్తూ విద్వేషాన్ని రెచ్చగొట్టడానికి బీజేపీ ప్రయత్నిస్తోంది. ఈ తరహా కుట్రల పట్ల అప్రమత్తంగా ఉండాలి' అని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. ప్రతిపక్ష పార్టీల సమావేశంలో పాల్గొనడానికి కోల్‌కతా వెళ్లిన ఆయన అక్కడి నుంచి శనివారం పార్టీ శ్రేణులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశాంత కేరళలో శబరిమల ఆలయం సాకుతో ఉద్రిక్తతలు రెచ్చగొడుతున్నారని, రామాలయాన్ని మళ్లీ తెరమీదకు తెచ్చి దేశ వ్యాప్తంగా చిచ్చు రాజేయడానికి చూస్తున్నారని అన్నారు. ఈ నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాల్సినఅవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రస్తుతం మనం చారిత్రక మలుపులో ఉన్నామని, ఈ కూడలిలో ఏమరుపాటుగ ఎంతమాత్రమూ ఉండకూదని చెప్పారు. కర్నాటకలో బీజేపీ దుర్మార్గపు రాజకీయం చేస్తోందని, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తోందన్నారు. ఏపీకి స్పెషల్ ట్రీట్ మెంట్ ఇచ్చామని బీజేపీ నేతలు చెప్పడం హాస్యాస్పదమని అన్నారు. 'గాయాలపై కారం చల్లడమేనా స్పెషల్ ట్రీట్ మెంట్' అని ఆయన ప్రశ్నించారు 'ఫెడరల్ ఫ్రంట్ అనేది అసలు లేదు. అదొక శూన్యం మాత్రమే. మోడీకి మద్దతు కోసమే ఫెడరల్ ఫ్రంట్. అది అసలు బీజేపీకి ప్రతిపక్షమే కాదు.' అని అన్నారు. టీఆర్ఎస్ నేతల ఆంధ్రా ద్వేషాన్ని ప్రచారం చేయాలని , కెసీఆర్, కవిత, హరీష్‌రావు, కెటీఆర్ దుర్భాషలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు చంద్రబాబు సూచించారు. మన రాష్ట్రంపై విషం చిమ్ముతున్న వారితో జగన్ అవలంబిస్తున్న వైఖరిని ఎండగట్టాలన్నారు. కేసుల కోసం మోడీ, అక్రమాస్తుల కోసం కెసీఆర్‌తో లాలూచీ పడ్డారని సీఎం పార్టీ నేతలకు వివరించారు. వైసీపీ లాలూచీ రాజకీయాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని నేతలను కోరారు. డబ్బులు బాగా ఖర్చుపెట్టే అభ్యర్థుల కోసం వైసీపీ వెదుకుతోందని, డబ్బులతోనే జగన్ రాజకీయమని, ప్రజాస్వామ్యాన్ని ధనస్వామ్యంగా వైసీపీ చేస్తోందన్నారు.

ఆ 21 మంది 'సాహస బాలలు'


- రిపబ్లిక్ వేడుకలకు హాజరుకారు
- ఐసీసీడబ్ల్యూపై కేంద్రం ఎఫ్ఐఆర్ దాఖలు ఫలితమే

న్యూఢిల్లీ: జాతీయ సాహస అవార్డుకు ఇండియన్ కౌన్సిల్ ఫర్ చైల్డ్ వెల్ఫేర్(ఐసీసీడబ్ల్యూ) దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన చిన్నారులు ఈ ఏడాది రిపబ్లిక్ డే పరేడ్‌కు దూరం కానున్నారు. ఆర్థిక అవకతవకల ఆరోపణల నేపథ్యంలో ఐసీసీడబ్ల్యూపై కేంద్రం ఎఫ్ఐఆర్ దాఖలు చేయడమే దీనికి కారణం. ఆ సంస్థ దేశవ్యాప్తంగా 21 మంది బాలలను జాతీయ సాహస అవార్డులకు ఎంపిక చేసింది. దీనితో గత 61 ఏండ్లలో తొలిసారిగా ఈఏడాది జరిగే రిపబ్లిక్‌డే పరేడ్‌కు ఆ బాలలు దూరం కానున్నారు. మరోపక్క, ఎన్జీవో నుంచి వేరుపడి కేంద్రమే సొంతంగా అవార్డులు ప్రదానం చేయాలని నిర్ణయించింది. ప్రతిఏడాది నవంబర్ 14న బాలల దినోత్సవం పురస్కరించుకొని ప్రతిభావంతులైన చిన్నారులకు జాతీయ అవార్డులను ప్రదానం చేసేవారు. ఇప్పుడు దానిని ప్రధాన మంత్రి జాతీయ బాలల అవార్డుగా పేరు మార్చారు. దీనికి దేశవ్యాప్తంగా 26మంది చిన్నారులను ఐదు విభాగాల నుంచి ఎంపిక చేశారు. ఇందులో ఆవిష్కరణలు, పాండిత్య నైపుణ్యాలు, సాంస్కృతికం, సామాజిక సేవలు, క్రీడలతో పాటు సాహస విభాగాలున్నాయి. ఈ చిన్నారులనే రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్ ఈనెల 22న సన్మానించనున్నారు. వారంతా 26న జరిగే రిపబ్లిక్ డే పరేడ్‌లో పాలుపంచుకోనున్నారు. 1957 నుంచి ప్రతి ఏడాది జాతీయ సాహస బాలల అవార్డుల కార్యక్రమాన్ని ఐసీసీడబ్ల్యూ నిర్వహిస్తోంది. కాగా నిధుల దుర్వినియోగం ఆరోపణలతో ఈ సారి దూరం కావాల్సి వచ్చింది.

కేంద్ర ప్రభుత్వం కేటాయించిన నిధులను ఆ సంస్థ దుర్వినియోగం చేసిందని, ఖర్చు చేయని నిధులను తిరిగి చెల్లించడంలో విఫలమైందని ఆరోపిస్తూ కేంద్ర మహిళా శిశుసంక్షేమాభివృద్ధి మంత్రిత్వ శాఖ సదరు ఎన్జీవోపై ఈ చర్యకు పూనుకున్నది. 2014-16 మధ్య ఆ ఎన్జీవోకు ప్రభుత్వం కేటాయించిన మొత్తం నిధుల్లో ఖర్చు చేయని రూ. మూడుకోట్లకు పైగా నిధులను తిరిగి చెల్లించలేదని కేంద్రం ఏర్పాటు చేసిన అంతర్గత కమిటీ దర్యాప్తులో తేలింది.

వచ్చే ఎన్నికల్లో 'మందిర్' ప్రభావం ఉండదు

- యోగేంద్ర యాదవ్



న్యూఢిల్లీ :2019 సార్వత్రిక ఎన్నికల్లో రామ మందిర్ రాజకీయాలు ప్రభావం చూపలేవని స్వరాజ్ అభియాన్ పార్టీ జాతీయ అధ్యక్షుడు యోగేంద్ర యాదవ్ పేర్కొన్నారు. అధికార మందిరాన్ని సుస్థిరం చేసుకునేందుకు రామ మందిరంపై దృష్టి సారించడం మానుకోవాలని హితవు పలికారు. మందిర్ రాజకీయాలు ప్రస్తుతం దేశంలో చెల్లవని ఆయన స్పష్టం చేశారు. ఆదివారం నాడిక్కడ స్థానిక ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో యోగేంద్ర యాదవ్ మాట్లాడారు. హిందుత్వ పార్టీలన్నీ రాముడిపై దృష్టి తగ్గించి, రైతు సమస్యలపై పెట్టాలని సూచించారు. దేశంలో రాముడికి ఎన్నో మందిరాలున్నాయని, అయోధ్యలో ప్రత్యేకంగా మందిరం నిర్మించడం వల్ల వచ్చే లాభమేమీ లేదని స్పష్టం చేశారు. లోక్‌సభ ఎన్నికల ముందు రైతు సమస్యలు పెద్ద ఎత్తున చర్చనీయాంశమవ్వడం శుభపరిణామమైన విషయమని అన్నారు. పార్లమెంట్ సమావేశాల్లో రైతులకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఇటీవల రాంలీలా మైదానంలో రైతులు చేపట్టిన బహిరంగ సభకు దేశ వ్యాప్తంగా స్పందన వచ్చిందన్నారు.



మెక్సికోలో పేలిన పైప్‌లైన్

66మంది సజీవ దహనం

- 71మందికి గాయాలు..81 మంది గల్లంతు

మెక్సికో సిటీ : సెంట్రల్ మెక్సికోలోని హిడాల్గో రాష్ట్రంలో లీకవుతున్న పైప్‌లైన్ పేలిపోయి 66మంది మరణించారు. మరో 71మంది తీవ్రంగా గాయపడ్డారు. 81మంది గల్లంతు అయ్యారు. గతేడాది మొదటి పది మాసాల్లోనే 12,581 సార్లు పైప్‌లైన్లకు ప్రమాదకరమైన రీతిలో, అక్రమంగా కనెక్షన్లు పెట్టి, ఇంధన చౌర్యానికి పాల్పడుతున్న వారిపై కొత్త అధ్యక్షుడు ఆండ్రెస్ మాన్యుయల్ లోపెజ్ ఒబ్రాడర్ చర్యలు చేపట్టారు. ఇది జరిగిన మూడు వారాల్లోనే ఈ దుర్ఘటన సంభవించింది. ఈ ఇంధన చౌర్యంలో దొంగలకు సహకరిస్తూనో, లేదా బయటకు చిమ్ముతున్న చమురును క్యాన్లలో పట్టుకుంటోనో వందలాదిమంది ప్రజలు ఆ పైపులకు చుట్టుపక్కలే వుంటారు. గతంలో కూడా ఈ పైపుల దగ్గర అగ్ని ప్రమాదాలు సంభవించినప్పటికీ ఇంత తీవ్ర స్థాయిలో జరగడం ఇదే మొదటిసారి. బకెట్లు, ప్లాస్టిక్ జగ్‌లు, కేన్లలో చమురును తీసుకెళ్ళడానికి వచ్చినపుడు ఇది జరిగింది. మెక్సికో సిటీకి ఉత్తరంగా వంద కిలోమీటర్ల దూరంలోని చిన్న పట్టణంలో ఈ ప్రమాదం సంభవించింది. పెద్ద ఎత్తున ఆకాశంలోకి లేస్తున్న మంటలు, ప్రజల హాహాకారాలు, మంటలు అంటుకుని బాధితుల ఆర్తనాదాలతో అక్కడి ప్రాంతమంతా బీభత్సంగా మారింది. గల్ఫ్ కోస్ట్ నుండి మెక్సికో సిటీకి ఉత్తరంగా గల తులా నగరానికి పెట్రోల్‌ను తీసుకెళుతున్న పైప్ ఇది. స్థానిక కాలమానం ప్రకారం తెల్లవారు జామున 5గంటలకు ప్రమాదం సంభవించింది. సమీపంలోని క్వార్టెరో రాష్ట్రంలో కూడా ఇదే రీతిలో ప్రమాదం జరిగినా అది తక్కువ జన సమ్మర్దం గల ప్రాంతం కావడంతో పెద్ద నష్టం జరగలేదు.

'షట్‌డౌన్'కు ముగింపు పలకండి


- పిలుపునిచ్చిన మాజీ అధ్యక్షుడు జార్జిబుష్



వాషింగ్టన్ : మెక్సికో సరిహద్దు వెంబడి గోడ నిర్మాణానికి కాంగ్రెస్ నిరాకరించడంతో తలెత్తిన ఆర్థిక సంక్షోభాన్ని పరిష్కరించాలని అమెరికా మాజీ అధ్యక్షుడు జార్జిబుష్ శుక్రవారం పిలుపునిచ్చారు. ఈ మేరకు జీతాలు చెల్లించని తన సీక్రెట్ సర్వీస్ అధికారులకు స్వయంగా జార్జిబుష్ పిజ్జాలు పంచారు. వేతనాన్ని ఆశించకుండా తమ దేశం కోసం కష్టపడి పనిచేస్తున్న ఫెడరల్, సీక్రెట్ సర్వీస్ సిబ్బందికి, వారికి మద్దతునిచ్చిన ప్రజలకు తన కుటుంబం తరుపున కృతజ్ఞతలు తెలుపుతున్నానని, పిజ్జాలు పంచుతున్న ఫోటో ఒకటి ఇన్‌స్టాగ్రాంకు జత చేశారు. ఇరు పార్టీల నేతలు విభేదాలను పక్కన పెట్టి, 'షట్‌డౌన్'కు ముగింపు పలకాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు. మెక్సికో సరిహద్దులో 5 బిలియన్ డాలర్ల వెచ్చించాలని అధ్యక్షుడు ట్రంప్ ప్రతిపాదనను డెమొక్రాట్లు తిరస్కరిచండంతో ఈ సంక్షోభం మొదలైంది. ఇప్పటి వరకు అమెరికా చరిత్రలోనే అతిపెద్ద షట్‌డౌన్‌గా నిలిచిపోయింది. ప్రభుత్వ కార్యకలాపాలన్నీ స్థంభించి పోవడంతో సుమారు 6 వేల సీక్రెట్ సర్వీస్ ఉద్యోగులు, 8లక్షల పెఢరల్ ఉద్యోగులకు జీతాలు లేకుండా పోయాయి.

క్షీణించిన షరీఫ్ ఆరోగ్యం

- మరిన్ని వైద్యపరీక్షలు అవసరమన్న వైద్య బృందం



ఇస్లామాబాద్: స్థానిక కాట్ లఖ్‌పట్ జైల్లో వున్న పాకిస్తాన్ మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ ఆరోగ్యం క్షీణించిందని ప్రత్యేక వైద్య బృందం తెలిపింది. ఆయనకు మరిన్ని పరీక్షలు చేయడం అవసరమని తెలిపింది. పంజాబ్ కార్డియాలజీ ఇనిస్టిట్యూట్‌కి చెందిన నిపుణులతో కూడిన ఈ బృందం షరీఫ్‌ను పూర్తిగా పరీక్షించి, బుధవారం జైల్లోనే పలు పరీక్షలు చేసింది. అవినీతి కేసులో షరీఫ్ ప్రస్తుతం ఏడేళ్ల జైలుశిక్షను అనుభవిస్తున్నారు. షరీఫ్ రెండు చేతులు, పాదాలు నొప్పిగా వున్నాయని, పైగా ఆయన చక్కెర వ్యాధికి ఇప్పటికే చికిత్స పొందుతున్నారని వైద్య నివేదిక తెలిపింది. తన తండ్రి ఆరోగ్యం క్షీణించిందని, ఆయన సొంత వైద్యులను పరీక్షించడానికి అధికారులు అనుమతించడం లేదని షరీఫ్ కుమార్తె మరియం ఆరోపించింది. అయితే జైలు డాక్టర్లు పరీక్షించారని అధికారులు చెప్పారు.

నల్ల జాతీయుడి హత్య కేసులో శ్వేతజాతి పోలీసు అధికారికి జైలుశిక్ష

చికాగో : నల్ల జాతీయుడైన లాక్వాన్ మెక్‌డొనాల్డ్‌ను 2014లో హత్య చేసినందుకు గానూ మాజీ శ్వేత జాతి పోలీసు అధికారి జాసన్ వాన్ డైక్‌కు ఆరేళ్ళ 9మాసాల జైలు శిక్ష విధించారు. వర్ణవివక్షత ఎక్కువగా వుండే చికాగోలో దశాబ్దాల కాలంలో విధి నిర్వహణలో వుండగా చేసిన హత్యకు పోలీసు అధికారికి జైలు శిక్ష విధించడం ఇదే మొదటిసారి. అయితే ఈ శిక్ష కూడా తక్కువగానే వుందంటూ మానవ హక్కుల కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. కాగా, న్యాయమూర్తి తీర్పు తర్వాత బాధితుడి తరపు న్యాయవాది హర్షం వ్యక్తం చేశారు. దాదాపు 9గంటల విచారణ తర్వాత వెలువడిన తీర్పుపై ఆయన చాలా భావోద్వేగంతో మీడియాతో మాట్లాడారు. 2014 అక్టోబరు 20న 17ఏళ్ళ మెక్‌డొనాల్డ్‌పై వాన్ డైక్ 16బుల్లెట్లు ప్రయోగించాడు. పేవ్‌మెంట్‌పై మెక్‌డొనాల్డ్ పడిపోయిన తర్వాత కూడా కాల్పులు కొనసాగిస్తూనే వచ్చాడు. ఆత్మరక్షణ కోసమే తాను కాల్పులు జరిపానని తొలుత డైక్ చెబుతూ వచ్చారు. కానీ కారులోని డాష్‌బోర్డ్ కెమెరా పుటేజ్ చూసిన తర్వాత కేవలం చిన్న కత్తితో బాధితుడు పోలీసు అధికారి నుండి తప్పించుకోవడానికి ప్రయత్నించాడని న్యాయమూర్తి నిర్ధారించారు. డైక్ చర్యలను మాఫీ చేయడానికి ప్రయత్నించారంటూ మరో ముగ్గురు అధికారులపై విడిగా అభియోగాలు మోపారు. కానీ వారిని నిర్దోషులగా న్యాయమూర్తి విడిచిపెట్టారు.

అమెరికాలో ముదురుతున్న ఆర్థిక సంక్షోభం

నాలుగు వారాల నుంచి నిలిచిన కార్యకలాపాలు

- ప్రభుత్వ విమాన సర్వీసులు బంద్



వాషింగ్టన్ : ఆర్థిక సంక్షోభం కారణంగా అమెరికా ప్రభుత్వ కార్యకలాపాలు స్తంభించి నాలుగు వారాలు అవుతోంది. అమెరికా-మెక్సికో సరిహద్దు గోడ నిర్మాణానికి నిధుల మంజూరు విషయంలో అధ్యక్షుడు ట్రంప్‌కు, అమెరికా కాంగ్రెస్‌లోని డెమోక్రాట్లకు మధ్య తలెత్తిన వివాదం ప్రభుత్వ ఆర్థిక సంక్షోభానికి దారి తీసింది. మూడు రోజుల వారాంతపు శలవుల నిమిత్తం డెమోక్రాట్ల నేతృత్వంలోని ప్రతినిధుల సభ సభ్యులు నగరం వీడి వెళ్ళారు. వారు మంగళవారం వస్తారని శుక్రవారం సెనెట్ సమావేశమవుతుందని భావించారు. కానీ అలా జరగలేదు. రిపబ్లికన్ల అదుపులో గల సెనెట్ సభ్యులు ఇటీవల కాలంలో ప్రతినిధుల సభ ఆమోదించిన పలు బిల్లులను ఆమోదించలేదు. దాంతో కార్యకలాపాల నిర్వహణకు అవసరమైన నిధుల కొరత ఏర్పడింది. అమెరికా చరిత్రలోనే ఇంతకాలమూ ఇలా ప్రభుత్వ కార్యకలాపాలు స్తంభించడం జరగలేదు. ఇది పరిష్కారం కావడానికి మరో వారం పట్టేలా వుంది. అంటే 8లక్షల మంది ఉద్యోగులు మరో వారం రోజుల పాటు జీతాలు అందక ఇబ్బందులు పడాల్సి వుంటుంది. శుక్రవారం నుండి ప్రభుత్వ విమాన సర్వీసులు కూడా నిలిపివేశారు. వైట్‌హౌస్ అనుమతి లేకుండా, చట్టసభల ప్రతినిధులు పర్యటనలు జరపకుండా వుండేందుకే ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం తలెత్తిన వివాదం పరిష్కారమవకుండా ప్రతినిధుల సభ స్పీకర్ నాన్సీ పెలోసి ఆఫ్ఘనిస్తాన్ వెళ్లేందుకు విమానాన్ని అందచేసేందుకు ప్రభుత్వం తిరస్కరించింది.

ఫిబ్రవరి చివరిలో ట్రంప్-కిమ్ రెండో భేటీ


ఫైల్

వాషింగ్టన్ : అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జాంగ్ ఉన్ ఫిబ్రవరి చివరిలో రెండోసారి సమావేశం కానున్నారని వైట్‌హౌస్ మీడియా కార్యదర్శి సారా సాండెర్స్ తెలిపారు. దాదాపు గంటన్నర పాటు జరిగే ఈ సమావేశంలో అణునిరాధీయకరణపై చర్చిస్తారని, ఈ సమావేశ వేదికను త్వరలో ప్రకటిస్తామని ఆయన అన్నారు. . ట్రంప్‌తో ఉత్తరకొరియా అధికార పార్టీ కొరియన్ వర్కర్స్ పార్టీ కేంద్ర కమిటీ ఉపాధ్యక్షుడు కిమ్ యంగ్ చోల్ సామవేశం ముగిసిన వెంటనే వైట్‌హౌస్ ఈ ప్రకటన చేయడం విశేషం. వాషింగ్టన్‌లోని డల్లాస్ అంతర్జాతీయ విమానాశ్రయానికి గురువారం రాత్రి చేరుకున్న చోల్ శుక్రవారం ఉదయం అమెరికా విదేశాంగ మంత్రి మైక్ పాంపియోతో సమావేశమయ్యారు. కాగా, గత ఏడాది జూన్‌లో సింగ్‌పూర్‌లో ట్రంప్-కిమ్ తొలిసారిగా సమావేశమయ్యారు. ఆ సందర్భంలోనే మరోసారి సమావేశం కావాలని ఇరువురు నేతలు నిర్ణయించుకున్న సంగతి తెలిసిందే.

కిమ్ ఇటీవల చైనాలో పర్యటించిన సందర్భంలోనూ అమెరికా అధ్యక్షుడితో సమావేశం గురించి పేర్కొన్నారు. ఈ నెల 2న ట్రంప్ మాట్లాడుతూ కిమ్‌తో సమావేశం కోసం ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

అమెరికా, ఆఫ్ఘన్‌లతో చర్చల్లేవు

- స్పష్టం చేసిన తాలిబన్



పెషావర్ : అమెరికా ప్రత్యేక దూత జల్మే ఖలీల్‌జద్‌తో ఇస్లామాబాద్‌లో చర్చలను పునరుద్ధరించడానికి తాము సమాయత్తమైనట్లు పాకిస్తాన్ మీడియాలో వచ్చిన వార్తలను ఆఫ్ఘన్ తాలిబన్ తిరస్కరించింది. ఆఫ్ఘన్ ప్రభుత్వంతో కూడా నేరుగా ఎలాంటి చర్చలు వుండబోవని పునరుద్ఘాటించింది. ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌తో సహా పాక్ అధికారులు, ఖలీల్‌జద్ మధ్య శుక్రవారం చర్చలు జరిగిన నేపథ్యంలో ఇస్లామాబాద్‌లో సమావేశం జరిగే అవకాశం వుందని పాక్ వార్తాపత్రికలు, టీవీ చానెళ్ళు పేర్కొన్నాయి. దీనిపై సీనియర్ తాలిబన్ నేతలు మాట్లాడుతూ, శాంతి క్రమంలో భాగంగా ఇస్లామాబాద్‌లో అమెరికా ప్రతినిధి వర్గంతో, ఆఫ్ఘన్ ప్రభుత్వంతో తాము చర్చలు జరపాలని పాకిస్తాన్‌తో సహా కొన్ని ప్రాంతీయ శక్తులు కోరాయని, కానీ తాము ఆ ప్రతిపాదనను తిరస్కరించామని చెప్పారు. ఈమేరకు తాలిబన్ ప్రతినిధి ముజాహిద్ ఒక ప్రకటన చేశారు. ఖలీద్‌జద్ అంగీకృత ఎజెండా అమలుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారని తాలిబన్ ఆరోపించడంతో ఉభయ పక్షాల మధ్య చర్చలు నిలిచిపోయాయి. తిరిగి ఎప్పుడు పునరుద్ధరించబడేది చెప్పలేమని తాలిబన్ పేర్కొంది.

కాంగ్రెస్‌కు ట్రంప్ అబద్ధం చెప్పమనలేదు

బజ్‌ఫీడ్ కథనాన్ని తిరస్కరించిన రాబర్ట్ ముల్లార్

వాషింగ్టన్ : మాస్కోలో ట్రంప్ టవర్ ప్రాజెక్టుకు సంబంధించి కాంగ్రెస్‌కు అబద్ధం చెప్పాల్సిందిగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన మాజీ న్యాయవాది కొహెన్‌ను ఆదేశించారని పేర్కొంటున్న బజ్‌ఫీడ్ వార్తా కథనాన్ని ప్రత్యేక న్యాయవాది రాబర్ట్ ముల్లార్ తిరస్కరించారు. ఆ కథనం కచ్చితత్వంతో కూడినది కాదని ముల్లార్ కార్యాలయం పేర్కొంది. ఈ ప్రాజెక్టుపై ముల్లార్ సాగించిన దర్యాప్తులో ఆ మేరకు సాక్ష్యాధారాలన్నీ ఏరికూర్చినట్లు ఆ వార్తా కథనం పేర్కొంది.

ఆ 26 కులాలను వెంటనే కలపాలి

బీసీ సంఘాల డిమాండ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బీసీ జాబితా నుంచి తొలగించిన 26 కులాలను తిరిగి కలపాలని బీసీ సంఘాల నేతలు డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ మేరకు బీసీ సంక్షేమ భవన్‌లో బీసీ సంఘాల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ చట్ట విరుద్ధంగా బీసీ జాబితా నుంచి 26 కులాలను తొలగించడం అన్యాయమన్నారు. బీసీ జాబితా నుంచి ఏకులాలైనా కలపాలన్న లేదా తొలగించాలన్న బీసీ కమిషన్ సిఫారసుల ప్రకారం చేయాల్సి ఉందని తెలిపారు. కానీ ఇందుకు విరుద్ధంగా 2014లో 26 కులాలను తొలగించడం సమంజసం కాదన్నారు. బీసీ జాబితా నుంచి ఆ కులాలను తొలగించడం వల్ల గత నాలుగున్నర సంవత్సరాలుగా వారికి విద్యా, ఉద్యోగ రంగాల్లో తీవ్ర అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. శెట్టి బలిజ, గవర, తూర్పు కాపు, కొప్పుల వెలమ, కళింగ, గాజుల బలిజ, నాగవంశ, దేవాంగ, పోలినాటి వెలమ, నాగ వద్దెలు అచ్చుకట్టు లాంటి కులాల ప్రజలు జాబితా నుంచి తొలగించడం వల్ల సంక్షేమ పథకాలకు దూరమై ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఈ కులాల్లోని విద్యార్థులకు రిజర్వేషన్లు వర్తించకపోవడంతో ఉన్నత విద్యకు దూరమవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కులాల తొలగించే అధికారం ప్రభుత్వానికి లేదన్నారు. అర్ధాంతరంగా ఈ కులాలను తొలగించడం వల్ల వారంతా కోర్టుల చుట్టూ తిరగడానికే సమయం చాలడం లేదన్నారు.



మాట్లాడుతున్న ఆర్ కృష్ణయ్య

తల్లితండ్రులు బీసీలు. కొడుకులు ఓసీలా .

ఈ కులాలకు చెందిన వారు విచిత్రమైన పరిస్థి తులను ఎదుర్కొంటున్నారని ఆర్ కృష్ణయ్య తెలిపారు. తల్లితండ్రులు బీసీ కోటా కింద చదివి ఉద్యోగం సంపాదించార, కానీ వారి పిల్లలకు మాత్రం బీసీ కోట వర్తింపచేయకపోవడం అన్యాయమన్నారు. బీసీ కోట కింద 2014 వరకు చదివిన విద్యార్థులు 2015 నుంచి ఓసీలుగా గుర్తిస్తున్నారని తెలిపారు. ఎన్నికల ప్రచారంలో టీఆర్ఎస్ ఇచ్చిన హామీ ప్రకారం తొలగించిన కులాలను బీసీ జాబితాలో చేర్చాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ కృష్ణ, యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నీల వెంకటేశ్, కోలా జనార్ధన్ పాల్గొన్నారు.

గేటుకు తాళం వేసి నామినేషన్ల పరిశీలన

- అధికారుల తీరుపై అభ్యర్థుల ఆగ్రహం


గొల్లపల్లిలో మాజీ సర్పంచ్‌తో మాట్లాడుతున్న ఎన్నికల అధికారి

నవతెలంగాణ- టేకులపల్లి

పంచాయతీ ఎన్నికల నామినేషన్ల పరిశీలనకు అభ్యర్థులను అనుమతించకుండా అధికారులు గేటు తాళం వేశారు. సర్పంచ్, వార్డుసభ్యుల అభ్యర్థుల ఎదుట పత్రాల పరిశీలన జరగాల్సి ఉండగా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలం గొల్లపల్లిలో శనివారం అధికారులు గేటుకు తాళం వేసి అభ్యర్థులను అడ్డుకున్నారు.

గొల్లపల్లి పంచాయతీ కేంద్రంలో ఈనెల 16 నుంచి 18వ తేదీ వరకు సర్పంచులు, వార్డు సభ్యుల నామినేషన్ల స్వీకరణ చేపట్టారు. మొత్తం ఐదు పంచాయతీలకుగాను 32 మంది సర్పంచ్‌లకు, 110 మంది వార్డు సభ్యులకు నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్ల పరిశీలన పంచాయతీ కార్యాలయంలోనే చేపట్టారు. కాగా, ఎన్నికల నిబంధనల ప్రకారం నామినేషన్లను సంబంధిత అభ్యర్థి ఎదుట పరిశీలించాల్సి ఉంది. కానీ అధికారులు అభ్యర్థులను లోపలికి అనుమతించకుండా గేటుకు తాళం వేశారు. అధికారుల తీరుపై అభ్యర్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై విలేకర్లు అధికారులను ప్రశ్నించగా, పోలీసులు అందుబాటులో లేకపోవడంతో అభ్యర్థులను లోపలికి అనుమతించలేదని చెప్పారు. అనంతరం సాయంత్రం నాలుగు గంటలకు అభ్యర్థులను లోపలికి అనుమతించారు.

తక్కువ మార్కులొచ్చాయని... విద్యార్థిని ఆత్మహత్య


శృతి (ఫైల్)

నవతెలంగాణ-చిన్నగూడూరు

పరీక్షలో తక్కువ మార్కులు వచ్చాయని మనస్తాపానికి గురై బీటెక్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరు మండలంలో శనివారం జరిగింది. ఎస్ఐ నరేష్, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. విస్సంపల్లి గ్రామానికి చెందిన నర్సయ్య- ఎల్లమ్మ దంపతుల కుమార్తె శృతి(20) ఖమ్మంలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. సంక్రాంతి పండుగ సెలవులకు ఇంటికొచ్చింది. అయితే అంతకు ముందు రాసిన పరీక్షలో మార్కులు తగ్గడంతో మనస్తాపానికి గురైన శృతి వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తులో ఉంది.

10 శాతం రిజర్వేషన్లపై దేశవ్యాప్త ఉద్యమం

- 22న ఢిల్లీలో ఓబీసీ సదస్సు : తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అగ్రవర్ణాల వారికి రిజర్వేషన్లు కల్పించడాన్ని నిరసిస్తూ దేశ వ్యాప్త ఉద్యమం చేపట్టనున్నట్టు తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ప్రకటించింది. దీనిపై ఈ నెల 22న ఢిల్లీలో ఓబీసీ జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్టు తెలిపింది. ఈ మేరకు శనివారం బీసీ భవన్‌లో బీసీ సంఘాల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ రాజ్యాంగానికి విరుద్ధంగా, రిజర్వేషన్ల లక్ష్యాన్ని నీరుగారుస్తూ అగ్రవర్ణాల వారికి రిజర్వేషన్లు కల్పించడం అన్యామన్నారు. 56 శాతం ఉన్న బీసీ ప్రయోజనాలను తాకట్టు పెట్టి 10 శాతం రిజర్వేషన్లు అగ్రవర్ణాల వారికి కట్టపెట్టడం అన్యాయమన్నారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టడానికి ఏండ్లతరబడి నిర్లక్ష్యం చేసిన ప్రభుత్వాలు అగ్రవర్ణాల వారి రిజర్వేషన్ల కోసం బిల్లు పెట్టి ఆమోదించి బీసీలను అవమానపర్చారని విమర్శించారు. "సేవ్ కాన్‌స్టూషన్, సేవ్ సోషల్ జస్టిస్" అనే పేరుతో ఒక రోజు, ఒకే సమయానికి బహిరంగసభలు, భారీ ప్రదర్శనలు నిర్వహిస్తామని తెలిపారు. ఫిబ్రవరి మొదటి వారంలో వేలాదిమందితో పార్లమెంటును ముట్టడిస్తామని హెచ్చరించారు. అగ్రవర్ణాల రిజర్వేషన్లపై సుప్రీంకోర్టులో న్యాయ పోరాటం చేస్తామని తెలిపారు.

కన్నీరు పెట్టిన గుర్రపుతండా..

- అశ్రునయనాల మధ్య అన్నాచెల్లెళ్ల అంత్యక్రియలు
- సందర్శించిన ఎంపీ, ఎమ్మెల్యే




నవతెలంగాణ- దేవరకొండ

గత నెల 23న అమెరికాలో అగ్నిప్రమాదంలో మృతిచెందిన అన్నాచెల్లెళ్ల మృతదేహాలను చూసి గుర్రపుతండా కన్నీరు పెట్టుకుంది. విద్యార్థులు సాత్విక్ శరుణ్‌నాయక్(16), అరుణ్ సుహాస్ లాలునాయక్(12), జయసుశిత నాయక్(14)ల అంత్యక్రియలు శనివారం స్వగ్రామంలో పూర్తయ్యాయి. నల్లగొండ జిల్లా నేరేడుగొమ్ము మండలం గుర్రపుతండాకు చెందిన కేతావత్ శ్రీనివాస్, సుజాత దంపతుల ఇద్దరు కుమార్తెలు, కుమారుడు క్రిస్మస్ పండుగ రోజు అమెరికాలో అగ్నిప్రమాదంలో మృతిచెందిన విషయం విదితమే. శుక్రవారం ప్రత్యేక విమానంలో మృతదేహాలను హైదరాబాద్‌కు తీసుకొచ్చారు. అక్కడి నుంచి అంబులెన్స్‌లలో గుర్రపుతండాకు తరలించారు. అన్నాచెల్లెళ్ల మృతదేహాలను చూసేందుకు చుట్టుపక్కల తండావాసులు తరలివచ్చారు. గుర్రపుతండాలో విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యులు, పరిసర ప్రాంత గిరిజనులు, అమెరికా నుంచి వచ్చిన పాస్టర్లు, తెలంగాణలోని పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి నివాళులర్పించారు. శ్రీనివాస్ కుటుంబీకులను జెడ్పీ చైర్మన్ నేనావత్ బాలునాయక్, ఎంపీ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్, టీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యవతి రాథోడ్, ఎమ్మెల్సీ రాజేశ్వర్‌రావు తదితరులు పరామర్శించారు. ప్రభుత్వం తరపున మైనారిటీ వైస్ చైర్మన్ డి.శంకర్‌లాలు, నల్లగొండ డీఎండబ్ల్యూఓ వెంకటేశ్వర్లు, ఆర్డీఓ లింగ్యానాయక్‌లు హాజరై నివాళులర్పించారు. మృతదేహాలను క్రైస్తవ సంప్రదాయ రీతిలో శవపేటికలలో ఉంచి పూడ్చివేశారు.

ఆర్టీసీ బస్సు, బైక్ ఢీ

- అన్నదమ్ములు మృతి


మృతిచెందిన యువకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఆర్టీసీ బస్సు, బైక్ ఢీకొని అన్నదమ్ములు ప్రాణం కోల్పోయారు. ఈ ఘటన నిజామాబాద్ నగరంలోని ఒకటో పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. ఎస్ఐలు మోహన్‌రావు, చాంద్‌బీ తెలిపిన వివరాల ప్రకారం.. బోధన్ మండలం పెంటకలాన్ గ్రామానికి చెందిన ఎస్.కె.బాబు(25), ఎస్.కె.అమీర్(21) అన్నదమ్ములు. వారు ద్విచక్రవాహనంపై జిల్లా ప్రభుత్వాస్పత్రిలో ఉన్న అన్న కుమారుడిని చూసేందుకు వచ్చారు. అనంతరం రైల్వేస్టేషన్ దగ్గర చాయ్ తాగారు. తిరిగి గ్రామానికి వెళ్తుండగా హైదరాబాద్‌కు పోతున్న ఆర్టీసీ బస్సు బైక్‌ను ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలైన అన్నదమ్ములను స్థానికులు జిల్లా ఆస్పత్రికి తరలించారు. వారిని పరీక్షించిన వైద్యులు ఇద్దరూ చనిపోయారని నిర్ధారించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుల తండ్రి జైనుద్దీన్ సులేమాన్ బస్సు డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని ఒకటో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పోడు భూముల సమస్య పరిష్కరించాలి

సీఎంకు కాంగ్రెస్ ఎమ్మెల్యేల విజ్ఞప్తి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పోడు భూముల సమస్యను పరిస్కరించాలని ఆదివాసీ ఎమ్మెల్యేలు కాంతారావు, సీతక్క, అత్రం సక్కు డిమాండ్ చేశారు. హరితహారం పేరుతో ఆదివాసీలు సాగు చేస్తున్న పోడు భూములను అటవీ శాఖ అధికారులు స్వాధీనం చేసుకుని తీవ్ర వేధింపులకు గురి చేస్తున్నారని తెలిపారు. పోడు భూముల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించాలని సీఎం కేసీఆర్‌కు విజ్ఞప్తి చేశామని తెలిపారు. వచ్చే నెలలో ఆదివాసీ నియోజకవర్గాల్లో ప్రభుత్వ యంత్రాంగంతో కూడిన ఒక టూర్ ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చినట్టు వారు తెలిపారు.

అర్ధ సత్యాలే .. పొంగులేటి

అసెంబ్లీ సాక్షిగా గవర్నర్ ప్రసంగంలో అర్ధ సత్యాలే ఉన్నాయని కాంగ్రెస్ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి విమర్శించారు. టీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాల ప్రకటనలు బాగున్నాయి. కానీ వాటిని ఎప్పుడు పూర్తి చేస్తారు? ప్రజలకు ఎప్పుడు పథకాలను చేరవేస్తారన్న అంశాలను గవర్నర్ ప్రసంగంలో పొందుపర్చలేదని తెలిపారు. అందిస్తారన్న విషయాలు గవర్నర్ ప్రసంగంలో లేవన్నారు. మిషన్ భగీరథ ప్రాజెక్టు కోసం తవ్విన గుంతలను ఇప్పటికీ పూడ్చలేదని, మరి ప్రజలకు తాగు నీరు ఎప్పుడు అందిస్తారని ప్రశ్నించారు. రాష్ట్రంలోని 18 జిల్లాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని చెప్పారు. దీనివల్ల రైతులు తీవ్ర గడ్డు పరిస్థితులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడిందని, వర్షాభావ పరిస్థితులను అధిగమించేందుకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుంతో వివరించాలని డిమాండ్ చేశారు. పెంచిన పింఛన్లను ఎప్పటి నుంచి అందిస్తారన్న విషయాన్ని కూడా గవర్నర్ ప్రసంగంలో లేదన్నారు. అమాయక ప్రజలను మోసం చేస్తున్న వడ్డీ వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని సీఎంకు విజ్ఞప్తి చేశామన్నారు.

టీడీపీతో పొత్తువల్లే ఓటమి

శాసనసభ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీతో పొత్తుపెట్టుకున్నందుకే ఓటమి పాలయ్యామని కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్‌గోపాల్‌రెడ్డి చెప్పారు. అసెంబ్లీ ఎన్నికలు చంద్రబాబు వర్సెస్ కేసీఆర్ అన్నట్టు జరిగాయని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో టీడీపీతో పొత్తు ఉంటుందా? లేదా? అన్నది రాహుల్ గాంధీ నిర్ణయిస్తారన్నారు.

హామీలు ఎప్పుడు పూర్తి చేస్తారు?: బీజేపీ

ప్రజలకు ఇచ్చిన హామీలను ఎప్పుడు పూర్తి చేస్తారో వివరించలేదని బీజేపీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు విమర్శించారు. గత ప్రభుత్వాల తరహాలోనే గవర్నర్ ప్రసంగం కొనసాగిందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి చేస్తున్న సహాయం గురించి గవర్నర్ ప్రసంగంలో చేర్చకపోవడం శోచనీయమన్నారు.

రెండువేల మందితో దేశభక్తి పాట..


'సైరా నరసింహారెడ్డి'లో చిరంజీవి

ప్రస్తుతం చిరంజీవి దృష్టి అంతా 'సైరా నరసింహారెడ్డి'పైనే ఉంది. ఆయన నటిస్తున్న 151వ చిత్రం కావడం, పైగా తొలితరం స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జీవిత చరిత్ర ఆధారంగా తెరకెక్కుతుండటంతో దీన్ని ప్రతిష్టాత్మకంగా భావిస్తున్నారు. సుమారు రూ.200కోట్ల భారీ బడ్జెట్‌తో అత్యంత గ్రాండియర్‌గా తెరకెక్కిస్తున్నారు. సురేందర్‌రెడ్డి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని రామ్‌చరణ్ నిర్మిస్తున్నారు. శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటోంది. ప్రస్తుతం ఓ ప్రత్యేక పాటని తెరకెక్కిస్తున్నారట. ఈ పాటలో దాదాపు వెయ్యిమంది డాన్సర్లు, మరో వెయ్యి మంది జూనియర్ ఆర్టిస్టులు పాల్గొంటున్నట్టు తెలుస్తుంది. ఇందులో చిరుతోపాటు నయనతార, తమన్నా కూడా పాల్గొంటున్నారట. ఆర్‌ఎఫ్‌సీలో ప్రత్యేకంగా వేసిన సెట్‌లో ఈ సాంగ్‌ని చిత్రీకరిస్తున్నట్టు సోషల్ మీడియాలో ఓ వార్త వైరల్ అవుతుంది. దేశ భక్తి ప్రధానంగా సాగే ఈ పాట సినిమాకే హైలైట్‌గా నిలుస్తుందట. ఇందులో చిరంజీవి సరసన నయనతార కథానాయికగా నటిస్తున్న విషయం విదితమే. తమన్నా, అమితాబ్ బచ్చన్, విజయ్ సేతుపతి, సుదీప్, జగపతిబాబు కీలక పాత్రధారులు. ఈ చిత్రాన్ని దసరా కానుకగా విడుదల చేయనున్నారు.

నెక్ట్స్ క్రైమ్ డ్రామా!


మహేష్‌బాబు

మహేష్‌బాబు ప్రస్తుతం 'మహర్షి' చిత్రంలో నటిస్తున్నారు. ఆ తర్వాత సుకుమార్ దర్శకత్వంలో ఓ సినిమా చేయనున్నారు. అనంతరం 'అర్జున్‌రెడ్డి' ఫేమ్ సందీప్‌రెడ్డి వంగా దర్శకత్వంలోనూ ఓ సినిమా చేయనున్నట్టు తెలుస్తుంది. గతంలోనే సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో మహేష్ సినిమా చేయనున్నట్టు వార్తలు వచ్చాయి. ఆ తర్వాత మహేష్ 'మహర్షి' సినిమాకి కమిట్ కాగా, సందీప్ రెడ్డి వంగా బాలీవుడ్‌లో 'అర్జున్‌రెడ్డి' రీమేక్ 'కబీర్ సింగ్'ని రూపొందిస్తున్నారు. ఈ చిత్రం తర్వాత మహేష్ సినిమా ఉంటుందని తెలుస్తుంది. మహేష్ కోసం సందీప్ ఓ డిఫరెంట్ స్టోరీని రెడీ చేశారట. క్రైమ్ డ్రామాగా ఈ చిత్రం ఉంటుందని టాక్. ప్రస్తుతం నటిస్తున్న 'మహర్షి' చిత్రానికి వంశీపైడిపల్లి దర్శకత్వం వహిస్తున్న విషయం విదితమే. పూజా హెగ్డే కథానాయికగా, అల్లరి నరేష్ కీలక పాత్రలో నటిస్తున్న ఈ చిత్ర టీజర్‌ని మహాశివరాత్రి సందర్భంగా మార్చి 4న విడుదల చేయడానికి ప్లాన్ చేస్తున్నారు. అదే రోజు సినిమా రిలీజ్‌కి సంబంధించిన కొత్త తేదీని ప్రకటిస్తారట.

ఇప్పటికీ నిత్య విద్యార్థినే


విజయ్ ఏసుదాసు, కె.జె.ఏసుదాసు

'నేను సంగీతంలో విద్వాన్‌ని కాదు, విద్యార్థిని మాత్రమే. ప్రతి రోజు సంగీతం నేర్చుకుంటూనే ఉంటా' అని అన్నారు కె.జె.ఏసుదాసు. తనదైన అద్భుత గాత్రంతో కొన్ని దశాబ్దాలుగా శ్రోతలని అలరిస్తున్నారు ఏసుదాసు. చాలా రోజుల తర్వాత హైదరాబాద్‌లో లైవ్ కాన్సర్ట్‌ని నిర్వహిస్తున్నారు. నేడు(ఆదివారం) శిల్పకళావేదికలో ఈ కాన్సర్ట్ జరుగుతుంది. ఇందులో ఏసుదాసుతో పాటు ఆయన కుమారుడు విజయ్ ఏసుదాసు, కల్పన పాల్గొంటారు. ఈ సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో కె.జె.ఏసుదాసు మాట్లాడుతూ, 'నేను అక్షరాల విషయంలో కచ్చితంగా ఉంటాను. అది మా అమ్మ నేర్పించింది. ఐదేండ్లప్పుడు చదువు గురించి ఎలాంటి బెంగా వద్దు. కానీ క్లాసికల్ మ్యూజిక్‌ని ప్రాపర్‌గా నేర్చుకోమని చెప్పింది. నాకు బ్రదర్స్, సిస్టర్ ఉన్నారు. వాళ్ళు కూడా బాగా పాడుతారు. కానీ వాళ్లని మా నాన్న ప్రోత్సహించలేదు. నన్ను మాత్రమే ఎంకరేజ్ చేశారు. అందుకు వారికి థ్యాంక్స్ చెప్పుకుంటున్నా. గురువు లేకుండా ఎవరూ గొప్పవారు కాలేరు. మనల్ని తీర్చిదిద్దిన గురువులు దేవుళ్ళతో సమానమనేది నా నమ్మకం. నేను ఇప్పటి వరకు ఏం సాధించినా అది నా తల్లిదండ్రులు, గురువుల వల్లే సాధ్యమైంది. నా పాటలు వినేవారు, సంగీత ప్రియుల వల్లే నేనీ స్థాయికి వచ్చా. ఇక దాదాపు పదేండ్ల తర్వాత హైదరాబాద్‌లో లైవ్ మ్యూజిక్ చేస్తున్నా. మధ్యలో కొన్ని క్లాసికల్ కాన్సర్ట్స్ చేసినప్పటికీ లైవ్ మ్యూజిక్ మాత్రం చాలా గ్యాప్‌తో చేస్తున్నా. నా బ్రదర్ అలేఖ్య హోమ్స్ శ్రీనాథ్ ఇక్కడ లైవ్ మ్యూజిక్ చేయమని చెప్పారు. ఇందులో ప్రధానంగా తెలుగు పాటలుంటాయి. కొన్ని తమిళం, మలయాళం, హిందీ పాటలు కూడా పాడతాం. నేను త్రివేండ్రంలో విద్వాన్ కోర్స్ చేశాను. ఆ టైమ్‌లో మా నాన్నకి ఆరోగ్యం బాగా లేకపోవడంతో మధ్యలోనే ఆపేశా. అందుకే నేను సంగీతంలో విద్వాన్ కాలేదు. కేవలం విద్యార్థిని మాత్రమే. ప్రతి రోజూ కర్నాటిక్ సంగీతం నేర్చుకుంటున్నా. అంతకు ముందు చేసిన పొరపాట్లని ఎప్పటికప్పుడు సరిదిద్దుకుంటాను. మా అబ్బాయి విజయ్ కూడా పాడుతున్నాడు. అతని వయసు 40, నా వయసు 79గానీ, ఇప్పటికీ నేను విద్యార్థినే. ఇప్పుడొస్తున్న సింగర్స్ బాగా పాడుతున్నారు. ఇప్పుడు డిఫరెంట్ ట్రాక్స్ వచ్చాయి' అని అన్నారు. 'మొదట్లో నేను నాన్నగారి అడుగుజాడల్లో వెళ్ళాను. ఆ తర్వాత రియలైజ్ అయ్యా. నా సొంత దారిలోనే వెళ్ళాలని నిర్ణయించుకున్నా. కొన్ని విషయాల్లో ఆయన గైడెన్స్ తీసుకుంటా. ఇప్పుడు బయోపిక్స్ వస్తున్నాయి. మా నాన్నపై బయోపిక్ చేసే ఆలోచన లేదు. ఎవరైనా చేస్తే నేను ఇన్‌వాల్వ్ అవుతా' అని ఏసుదాసు తనయుడు విజయ్ తెలిపారు.

తన నీడతోనే యుద్ధం


సందీప్ కిషన్, అన్య సింగ్

సందీప్ కిషన్, అన్య సింగ్ జంటగా కార్తీక్ రాజు దర్శకత్వంలో 'నిను వీడని నీడను నేనే' చిత్రం రూపొందుతుంది. వెంకటాద్రి టాకీస్, విస్తా డ్రీమ్ మర్చంట్స్ పతాకాలపై దయా పన్నెం, వి.జి. సుబ్రహ్మణ్యన్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటోన్న ఈ చిత్రం గురించి హీరో సందీప్ కిషన్ మాట్లాడుతూ, 'మనిషి శత్రువుతోయుద్ధం చేస్తే గెలుస్తాడు. కానీ తన నీడతోనే యుద్ధం చేయాల్సి వస్తే? అలాంటి విపత్కర పరిస్థితులను ఎదుర్కొన్న ఓ యువకుడు ఎలా బయటపడ్డాడు. ఎలా సక్సెస్ అయ్యాడనేది తెలుసుకోవాలంటే మా చిత్రం చూడాల్సిందే' అని అన్నారు. 'ఓ కొత్త పాయింట్ తీసుకుని ఎమోషనల్ హర్రర్ ఎంటర్‌టైనర్ కథాంశంతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం. ఇప్పటి వరకు ఎవరూ టచ్ చేయని డిఫరెంట్ పాయింట్‌తో, హై టెక్నికల్ వ్యాల్యూస్‌తో రూపొందిస్తున్నాం. సందీప్ కిషన్ తొలిసారి నటిస్తోన్న హర్రర్ చిత్రమిది. సినిమా ఫైనల్ షెడ్యూల్ షూటింగ్‌ని హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో చిత్రీకరిస్తున్నాం. హీరోహీరోయిన్ల పై కొన్ని కీలక సన్నివేశాలు, ఓ ముఖ్యమైన పోరాట సన్నివేశం చిత్రీకరించనున్నాం. దీంతో షూటింగ్ పూర్తవుతుంది' అని దర్శకుడు కార్తీక్ రాజు తెలిపారు. నిర్మాత దయా పన్నెం చెబుతూ, 'అనుకున్న ప్లానింగ్ ప్రకారం దర్శకుడు ఈ చిత్రాన్ని పూర్తి చేస్తున్నారు. ఫిబ్రవరిలో సినిమాని ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు ప్లాన్ చేస్తున్నాం' అని చెప్పారు.

నవచిత్రం

తండ్రీకొడుకు.. తాతమనవడు..!


నాగార్జున, నాగచైతన్య

రెండేండ్ల క్రితం కళ్యాణ్ క్రిష్ణని దర్శకుడిగా పరిచయం చేస్తూ నటించిన 'సోగ్గాడే చిన్ని నాయన' నాగార్జున కెరీర్‌లోనే బిగ్గెస్ట్ హిట్‌గా నిలిచింది. ఈ సినిమాకి సీక్వెల్ ఉంటుందని, దీనికి 'బంగ్గార్రాజు' టైటిల్ అని ఇప్పటికే ప్రకటించారు. అయితే ఈ సీక్వెల్ త్వరలో ప్రారంభం కాబోతుంది. దర్శకుడు కళ్యాణ్ క్రిష్ణ ఈ స్క్రిప్ట్‌ని పూర్తి చేశారట. నాగార్జునకి బాగా నచ్చడంతో సినిమాని ప్రారంభించేందుకు ప్లాన్ చేస్తున్నారు. ఏప్రిల్‌లో సినిమాని పట్టాలెక్కించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. తన అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్‌పై నాగార్జున నిర్మించనున్న ఈ చిత్రంలో నాగచైతన్య కూడా నటించనున్నట్టు తెలుస్తుంది. 'సోగ్గాడే చిన్ని నాయన'లో నాగార్జున తండ్రి, కోడుకులుగా ద్విపాత్రాభినయం చేశారు. ఇందులో తాతగా కనిపించనున్నారట. ఆయనకు మనవడి పాత్రలో నాగచైతన్య నటిస్తారని సమాచారం. ఎంటర్‌టైన్‌మెంట్ ప్రధానంగా సినిమా ఉంటుందని తెలుస్తుంది. ప్రస్తుతం నాగార్జున హిందీలో 'బ్రహ్మాస్త్ర'లో కీలక పాత్ర పోషిస్తున్నారు. తమిళంలో ధనుష్ దర్శకత్వంలో రూపొందుతున్న ఓ చిత్రంలో నటించనున్నారు. 'దేవదాస్' తర్వాత నాగార్జున తెలుగులో మరే చిత్రానికి సైన్ చేయలేదు.


అలియా భట్


ఎఫ్2 గ్రాండ్ సక్సెస్ మీట్..


మెహరీన్, శిరీష్, వరుణ్ తేజ్, వెంకటేష్, దేవిశ్రీప్రసాద్, దిల్‌రాజు, అనిల్ రావిపూడి

వెంకటేష్, వరుణ్ తేజ్, తమన్నా, మెమరీన్ హీరోహీరోయిన్లుగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో దిల్‌రాజు నిర్మించిన చిత్రం 'ఎఫ్2'(ఫన్ అండ్ ఫ్రస్టేషన్). ఈ చిత్రం సంక్రాంతికి కానుకగా ఇటీవల విడుదలై పాజిటివ్ టాక్‌తో రన్ అవుతుంది. ఈ సందర్భంగా శుక్రవారం సక్సెస్‌మీట్‌ని ఏర్పాటు చేశారు. వెంకటేష్ మాట్లాడుతూ, 'పదేండ్ల తర్వాత థియేటర్‌కి వెళ్ళి ప్రేక్షకుల స్పందన చూశా. అందరూ నవ్వుతున్నారు. కానీ నాకు కన్నీళ్లొచ్చాయి. కష్టపడి ఒక సినిమా చేశాక, దాన్ని ప్రేమగా ప్రేక్షకులు చూస్తున్నప్పుడు గొప్ప అనుభూతి కలుగుతుంది. ప్రేక్షకుల కళ్లలో ఆనందం చూసినప్పుడు చాలా హ్యాపీగా అనిపించింది. నా సినిమాలు చాలా వరకు సంక్రాంతికి వచ్చి హిట్ అయ్యాయి. మళ్ళీ చాలా రోజుల తర్వాత ఇలాంటి వినోదాత్మక చిత్రం చేయడం ఆనందంగా ఉంది. ప్రేక్షకులు మళ్ళీ మిమ్మల్ని ఓ వినోదాత్మక చిత్రంలో చూడాలనుకుంటున్నారని ఈ కథ చెప్పాడు అనిల్. వరుణ్, తమన్నా, మెహరీన్ బాగా నటించారు. దేవిశ్రీ ప్రసాద్, సమీర్ రెడ్డి వంటి సాంకేతిక నిపుణులంతా చక్కటి పనితీరుని కనబరిచారు. ఇంత పెద్ద సక్సెస్ చేసిన ఆడియెన్స్‌కి థ్యాంక్స్' అని అన్నారు. 'నేను ఇప్పుడిప్పుడే ఎదుగుతున్నా. ఎలాంటి సినిమాలు చేయాలని దారి వెతుకునే పనిలో ఉన్నా. నాకు కామెడీ అంటే చిరంజీవి, వెంకటేష్ సినిమాలే గుర్తొస్తాయి. వాళ్ళని చూసి మనం ఇలా కొంచమైనా చేయగలుగుతామా అనుకునేవాడిని. అనిల్ రావిపూడి సెట్‌లో సన్నివేశాలు చెప్పి వెళ్ళిపోయినప్పుడు ఎక్కడో సిగ్గు ఉండేది. వెంకటేష్ సర్ నా పక్కన ఓ బ్రదర్స్‌లాగా ఉండి సపోర్ట్ చేశారు. ప్రేక్షకుల అభిమాన కథానాయకుడు ఎవరైనా వాళ్ళందరికీ నచ్చే వ్యక్తి వెంకటేష్ సర్. త్వరలోనే 'ఎఫ్3' చేయబోతున్నాం. అది మరింతగా నవ్విస్తుంది' అని వరుణ్‌తేజ్ తెలిపారు.

దర్శకుడు అనిల్ రావిపూడి చెబుతూ, 'ఈ సినిమా నాకు ప్రత్యేకం. వెంకటేష్‌తో కలిసి వరుణ్‌తేజ్ మంచి టైమింగ్‌తో నటించారు. బాధని దూరం చేసేది, మనుషుల్ని దగ్గర చేసేది, గొడవని తగ్గించేది, గౌరవాన్ని, ఆయుష్షని పెంచేది నవ్వు. మేం ఆ నవ్వులు ఇచ్చినందుకు ప్రేక్షకులు నవ్వుతూనే ఈ సినిమాకి కలెక్షన్ల వర్షం కురిపించారు. ఇది నవ్వుల సంక్రాంతి. జీవితాంతం గుర్తిండిపోయే సంక్రాంతి. ఒక మనిషి ఎదుగుతున్నప్పుడు వాడి భుజం తట్టడం ఎంతో ఆనందాన్నిస్తుంది. ఈ సినిమా టీజర్ విడుదలైనప్పట్నుంచి మహేష్‌బాబు ట్వీట్లు చేస్తూ మాకు కిక్‌నిచ్చారు' అని చెప్పారు. 'మా సినిమా పేరు 'ఎఫ్2' ఖరారయ్యాక, 'వీ 2' అంటూ వెంకటేష్, వరుణ్‌తేజ్ వచ్చి ఈ సినిమా చేశారు. ఇప్పుడు బొమ్మ బ్లాక్‌బస్టర్ అంటూ 'బీ2' పేరుతో ఈ వేడుక జరుపుకుంటున్నాం. మంచి కథ రాసి మా సంస్థలో ఈ సినిమా చేసినందుకు అనిల్‌కి కృతజ్ఞతలు. మా నిర్మాణ సంస్థకి అత్యధిక లాభాలు తెచ్చిన సినిమా ఇదే' అని దిల్‌రాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెహరీన్, దేవిశ్రీప్రసాద్, అనసూయ, ప్రగతి, అన్నపూర్ణమ్మ, రజిత, సమీర్‌రెడ్డి, తమ్మిరాజు తదితరులు పాల్గొని తమ ఆనందాన్ని పంచుకున్నారు.

కమల్, వెంకీ మల్టీస్టారర్.. ?


కమల్ హాసన్

'బ్రహ్మోత్సవం' ఫెయిల్యూర్‌తో గ్యాప్ తీసుకున్నాడు దర్శకుడు శ్రీకాంత్ అడ్డాల. ప్రస్తుతం పలు భారీ ప్రాజెక్ట్‌లకి ప్లాన్ చేస్తున్నారు. గీతా ఆర్ట్స్‌లో 'కూచిపూడి వారి వీధి' పేరుతో ఓ సినిమా చేయబోతున్నారు. ఇందులో ఇద్దరు హీరోలు నటించనున్నారట. దీంతోపాటు కమల్ హాసన్, వెంకటేష్ కాంబినేషన్‌లో ఓ భారీ మల్టీస్టారర్‌కి కథని రెడీ చేస్తున్నారట. ఈ విషయాన్ని శ్రీకాంత్ అడ్డాల వెల్లడించారు. గతంలో ఆయన వెంకటేష్, మహేష్‌బాబు హీరోలుగా సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు' చిత్రాన్ని తెరకెక్కించిన విషయం విదితమే. అంతేకాదు గతంలో కమల్ హాసన్, వెంకటేష్ కలిసి 'ఈనాడు' చిత్రంలో నటించారు.

కళంక్‌లో గ్రాండియర్ సాంగ్..!

అలియా భట్ ప్రస్తుతం హిస్టారికల్ నేపథ్యంలో రూపొందుతున్న 'కళంక్' చిత్రంలో నటిస్తుంది. అభిషేక్ వర్మన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని కరణ్ జోహార్ నిర్మిస్తున్నారు. సంజయ్ దత్, మాధురీ దీక్షిత్, వరుణ్ ధావన్, ఆదిత్య రాయ్ కపూర్ ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ప్రస్తుతం ఈ చిత్ర షూటింగ్ గ్వాలియర్ లోని ఫోర్ట్‌లో ఓ పాటని చిత్రీకరిస్తున్నారు. అలియాభట్ రాణిలాగా వస్తున్న సాంగ్ సన్నివేశాలు ఆకట్టుకుంటున్నాయి. ఈ షూటింగ్‌కి సంబంధించిన పలు ఫొటోలు సోషల్‌మీడియాలో హల్‌చల్ చేస్తున్నాయి. మహిళా డాన్సర్లతో సాగే ఈ పాట కలర్‌ఫుల్‌గా, కనువిందుగా ఉంది. దీంతోపాటు అలియా 'గల్లీబాయ్', 'బ్రహ్మాస్త్ర' చిత్రాల్లో నటిస్తుంది. ఇదిలా ఉంటే అలియా 'నో ఫాదర్స్ ఇన్ కాశ్మీర్' చిత్రానికి అండగా నిలిచారు. ఈ సినిమాని కేంద్ర సెన్సార్ బోర్డ్ బ్యాన్ విధించింది. 'ఇది దురదృష్టకరం. ఎంతో కష్టపడి టీమ్ ఈ చిత్రాన్ని రూపొందించారు. ఇది కాశ్మీర్‌కి చెందిన ఓ నిజాయితీ గల ప్రేమికుల ప్రేమను తెలియజేస్తుంది. కరుణ, దయ, ప్రేమతో సెన్సార్ బోర్డ్ దీనిపై బ్యాన్ ఎత్తేస్తుందని ఆశిస్తున్నా' అని తెలిపింది. ఈ సినిమాలో అలియాభట్ తల్లి సోని రజ్దాన్ కీలక పాత్రలో నటించారు.

ధర్మం కోసం పోటీ చేస్తా


నరేష్

'ధర్మం కాపాడటం కోసం వచ్చే 'మా' ఎన్నికల్లో అధ్యక్ష పదవికి పోటీ చేస్తా' అని అంటున్నారు నటుడు నరేష్. విభిన్న పాత్రల్లో నటిస్తూ విలక్షణ నటనని ప్రదర్శిస్తూ రాణిస్తున్నారు నరేష్. ఇండస్ట్రీలోకి అడుగుపెట్టి నాలుగు దశాబ్దాలు పూర్తి చేసుకున్న నరేష్ పుట్టిన రోజు నేడు(ఆదివారం). ఈ సందర్భంగా శనివారం ఆయన మీడియాతో ముచ్చటించారు. నరేష్ మాట్లాడుతూ, 'నటుడు ఎస్వీఆర్‌ని దృష్టిలో పెట్టుకుని సినిమాలు, పాత్రలు చేస్తున్నా. ప్రతి నటుడి కెరీర్‌లో మలుపులు సహజం. 'శతమానంభవతి' చిత్రం నా కెరీర్‌లో టర్నింగ్ పాయింట్. 2018 నా కెరీర్‌లో బెస్ట్ ఇయర్. దాదాపు 12 సినిమాలు విజయం సాధిస్తే అందులో ఎనిమిది హిట్ చిత్రాల్లో నేను భాగమయ్యాను. 'రంగస్థలం', 'మహానటి', 'దేవదాస్', 'ఛలో', 'తొలిప్రేమ', 'సమ్మోహనం', 'అరవింద సమేత', 'శైలజారెడ్డి అల్లుడు' వంటి హిట్ చిత్రాలు చేశా. 'సమ్మోహనం' నటుడిగా నన్ను నెక్ట్స్ లెవల్‌కి తీసుకెళ్ళింది. ఓ వైపు సీనియర్ డైరెక్టర్స్, మరోవైపు యువ దర్శకులు నన్ను కోరుకుంటున్నారు. రైటర్స్ నన్ను దృష్టిలో పెట్టుకుని స్క్రిప్ట్ రాస్తున్నామంటున్నారు. ఓ నటుడిగా అంతకంటే గొప్ప అవార్డు మరొకటి ఉండదు. ఇటీవల 'ఎన్టీఆర్–కథానాయకుడు'లో బీఏ సుబ్బారావు పాత్రలో నటించే ఛాన్స్ రావడం, రెండు గొప్ప బయోపిక్ చిత్రాల్లో భాగం కావడం నా అదృష్టం. 'ఎన్టీఆర్–కథానాయకుడు' లాంటి సినిమా మళ్ళీ రాదు. ఇది బాలకృష్ణ కెరీర్‌లో బెస్ట్ చిత్రంగా నిలిచిపోతుంది. ప్రతి పదేండ్లకు తరం మారుతుంటుంది. ప్రతిభావంతమైన యువ దర్శకులు ఇండస్ట్రీకి వస్తున్నారు. కార్తికేయ హీరోగా రూపొందే ఓ సినిమాలో, ఫణిరాజా దర్శకత్వంలో ఓ సినిమాకి సైన్ చేశా. మరో ఆరు సినిమాలు పైప్‌లైన్‌లో ఉన్నాయి. తక్కువ బడ్జెట్ సినిమాలకి కూడా అందుబాటులో ఉంటాను. కాకపోతే కొంచెం సెలక్టీవ్‌గా వెళ్తున్నా. ఓ సినిమాలో విలన్‌గానూ నటిస్తున్నా. ఇండస్ట్రీలో కాంట్రవర్సీలకు నేను దూరంగా ఉంటా. 'మా' కార్యదర్శిగా పలు వెల్ఫేర్ కార్యక్రమాలు చేపట్టాం. వచ్చే 'మా' ఎన్నికల్లో అధ్యక్ష పదవికి పోటీ చేయాలనుకుంటున్నా. ధర్మం కాపాడటం కోసం నిలబడతా. రాజేంద్రప్రసాద్ అధ్యక్షులుగా ఉన్నప్పుడే ప్రతి ఒక్కరు ఒక్క టర్మ్ అయినా అధ్యక్షుడిగా పనిచేయాలనుకున్నాం. అందుకే నేను కూడా ఒక్కసారి చేయాలనుకుంటున్నా' అని అన్నారు.


'మిస్టర్ మజ్ను'లో అఖిల్

అన్నపూర్ణమ్మ గారి మనవడు


సుమన్ శెట్టి, అన్నపూర్ణమ్మ, శ్రీహర్ష, మాస్టర్ రవితేజ

సీనియర్ నటి అన్నపూర్ణమ్మ ప్రధాన పాత్రధారిణిగా, మాస్టర్ రవితేజ కీలక పాత్ర పోషిస్తున్న చిత్రం 'అన్నపూర్ణమ్మ గారి మనవడు'. నర్రా శివనాగేశ్వర్‌రావు దర్శకత్వంలో ఎవరెస్ట్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై ఎంఎన్‌ఆర్ చౌదరి నిర్మిస్తున్నారు. అర్చన హీరోయిన్‌గా నటిస్తుండగా, జీవ, రఘు బాబు, కారుమంచి రఘు, తాగుబోతు రమేష్, సుమన్‌శెట్టి, శ్రీహర్ష అదుర్స్ సాయి, రమాప్రభ, శ్రీలక్ష్మి, జయవాణి ఇతర ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా గురించి నిర్మాత మాట్లాడుతూ, 'ఓ పల్లెటూరిలో ఎవరికేం జరిగినా రచ్చబండ దర్బార్‌లో పెద్ద దిక్కు అక్కినేని అన్నపూర్ణమ్మ. ఈ శక్తివంతమైన పాత్రలో అన్నపూర్ణమ్మ నటిస్తున్నారు. ఆమెకి దీటుగా ఎదురెళ్లే వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడుగా సీనియర్ నటుడు బెనర్జీ నటిస్తున్నారు. పల్లెటూరిలోని పంచాయితీ దర్బార్ సెట్ అందరినీ ఆకర్షిస్తుంది. పంజాయితీ సన్నివేశాలను రెండు వందల మంది జూనియర్ ఆర్టిస్టులతో ఆద్యంతం ఆసక్తికరంగా తెరకెక్కించాం. ప్రస్తుతం మొదటి షెడ్యూల్ పూర్తి చేసుకుంది. అమరావతి పరిసర ప్రాంతంలో ఉన్న అందమైన ఓ గ్రామంలో షూటింగ్‌ని జరుపుకుంటుంది' అని తెలిపారు.


కళ్యాణి పటేల్, రాజేష్ తడకల, వివేక్, శ్రనిత్ రాజ్

ఆద్యంతం ఆసక్తిని రేకెత్తించే గేమర్

శ్రనిత్ రాజ్, కళ్యాణి పటేల్, అనిరుధ్, నేహా ప్రధాన పాత్రలుగా బి.జి.వెంచర్స్ పతాకంపై రాజేష్ తడకల స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్న చిత్రం 'గేమర్'. ఈ చిత్ర ట్రైలర్‌ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వివేక్ వెంకటస్వామి శనివారం విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ, 'ట్రైలర్ అద్భుతంగా ఉంది. మంచి వినోదం, హర్రర్ ఎలిమెంట్స్, మంచి డాన్సులతో సినిమాని అన్ని వర్గాల ప్రేక్షకులని ఆకట్టుకునేలా తెరకెక్కించారు. ఇలాంటి చిన్న సినిమాల దర్శక, నిర్మాతలను ప్రోత్సహించే బాధ్యత ప్రభుత్వం పైనా, సమాజం పైనా ఉంది. కొత్త టాలెంట్ రావాలంటే చిన్న దర్శక, నిర్మాతలని ప్రోత్సహించాలి. ఈ సినిమా మంచి విజయం సాధించాలి' అని అన్నారు. 'నాకిది ఏడవ చిత్రం. బి.జి.యాక్టింగ్ అకాడమీ ద్వారా నటీనటులకి శిక్షణ ఇవ్వడంతోపాటు వారికి అవకాశం ఇస్తున్నాను. ఈ సినిమాతో పరిచయం కాబోతున్న శ్రనీత్ రాజ్ నటన బాగుంది. సినిమాలో ప్రతి సీన్ డిఫరెంట్‌గా ఉంటూ ఆసక్తిని రేకెత్తిస్తుంది. ప్రేక్షకులు ఎంజాయ్ చేస్తారని నమ్ముతున్నా. సెన్సార్ కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రాన్ని ఫిబ్రవరి 1న విడుదల చేయబోతున్నాం. ప్రేక్షకులు హిట్ చేస్తారని నమ్ముతున్నా' అని రాజేష్ తెలిపారు.

పునరంకితం

(మొదటిపేజీ తరువాయి)

అవుతున్నదని ఈ ఉభయ సభల సాక్షిగా నిండు విశ్వాసంతో ప్రకటిస్తున్నాను.'అని గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ అన్నారు. ఉభయసభలనుద్దేశించి శనివారం నరసింహన్ అసెంబ్లీలో ప్రసంగించారు. అంతకుముందు ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావు, శాసనమండలి చైర్మెన్ కె స్వామిగౌడ్, అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శి నరసింహాచార్యులు గవర్నర్ నరసింహన్‌కు స్వాగతం పలికారు. అనంతరం అసెంబ్లీ హాల్‌లోకి తీసుకొని వచ్చారు. ఆ తర్వాత ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలనుద్దేశించి నరసింహన్ మాట్లాడారు.

అంకితభావంతో ప్రజాసేవలో నిమగ్నం కావాలి

'ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన ఎమ్మెల్యేలందరికీ హృదయ పూర్వక శుభాకాంక్షలు. మీ పదవీ కాలం దిగ్విజయంగా సాగాలనీ, మీరంతా అంకితభావంతో ప్రజాసేవలో నిమగ్నం కావాలనీ అకాంక్షిస్తున్నాను. ఉభయ సభలనుద్దేశించి ప్రసంగిస్తున్నందుకు నాకెంతో సంతోషంగా ఉంది. అన్ని రంగాల్లో పునర్నిర్మాణ ప్రక్రియను ప్రారంభించింది. పేదల సంక్షేమానికి ప్రాధాన్యతనిచ్చింది. జఠిలంగా మారిన విద్యుత్తు సంక్షోభం పరిష్కరించే చర్యలు చేపట్టింది. కోటి ఎకరాలకు సాగునీరు అందించడం కోసం ప్రాజెక్టుల నిర్మాణం ప్రారంభించింది. పరిశ్రమలు, ఐటి రంగ విస్తరణ ద్వారా యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెంపొందించడానికి అనేక కార్యక్రమాలు ప్రారంభించింది. కూలిన కులవత్తులను నిలబెట్టి గ్రామీణ ఆర్థిక వ్యవస్థను పరిపుష్టం చేసే కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేసింది. వ్యవసాయం దండుగ అని నిరాశ నిస్పృహలలో కూరుకుపోయిన రైతాంగానికి ధైర్యం, స్థైర్యం కల్పించే చర్యలు తీసుకున్నది.'అని నరసింహన్ అన్నారు.

జీఎస్టీ వసూళ్లలో దేశంలోనే ప్రథమం

పరిపాలనా విధానంతో కఠినమైన ఆర్థిక క్రమశిక్షణను పాటిస్తూ, అవినీతి రహితమైన పాలన అందించడంలో ప్రభుత్వం గొప్ప విజయం సాధించింది. దీంతో రాష్ట్రం సొంత ఆదాయ వనరులు గణనీయంగా అభివద్ధి చెందాయి. 2014 నుంచి 2018 వరకు నాలుగేండ్ల కాలంలో 17.17 శాతం సగటు వార్షిక ఆదాయ వద్ధిరేటు నమోదైంది. ఈ ఆర్థిక సంవత్సరంలో నవంబర్ నాటికి 29.93 శాతం ఆదాయాభివద్ధి రేటు సాధించింది. జీఎస్టీ వసూళ్లలోనూ తెలంగాణ దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. ప్రజా సంక్షేమానికి అత్యధిక శాతం బడ్జెట్ వినియోగిస్తున్న రాష్ట్రంగా తెలంగాణ ప్రత్యేక గుర్తింపును పొందింది. నా ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు పేద ప్రజలలో ఆత్మవిశ్వాసాన్ని భరోసాను కలిగించాయి. సంక్షేమ ఫలాలు అందుకున్న ప్రజల వల్ల టీఆర్ఎస్ ప్రభుత్వానికి మరోసారి అధికారం లభించింది.'అని గవర్నర్ చెప్పారు.

18,612 ఆవాసాల్లో ఇంటింటికీ నల్లా నీరు

'దేశంలో ఇంటింటికీ నల్లా సౌకర్యం కల్పించి, పరిశుద్ధమైన తాగునీటిని అందించే బహత్తర పథకం మిషన్ భగీరథను ప్రభుత్వం చేపట్టింది. రాష్ట్రంలోని మొత్తం 66 మున్సిపాలిటీలకు, 23,968 జనావాసాలకు సురక్షిత నీరు అందించడం లక్ష్యంగా నిర్దేశించుకున్నది. ఇప్పటికే 56 మున్సిపాలిటీలకు, అన్ని ఆవాస ప్రాంతాలకు మిషన్ భగీరథ ద్వారా మంచినీళ్లు అందుతున్నాయి. 18,612 జనావాసాల్లో ప్రతి ఇంటికీ నల్లాలు బిగించి, మంచినీరు అందించబడుతున్నది. మిగతా మున్సిపాలిటీలు, ఆవాసాల్లో అంతర్గత పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మార్చి నెలాఖరు నాటికి మిషన్ భగీరథ పనులు వందకు వంద శాతం పూర్తి చేసి, ప్రతి ఇంటికీ నల్లా ద్వారా మంచినీళ్లు అందిస్తాం. ఈ బహత్తర కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేస్తున్న ప్రభుత్వానికి, మిషన్ భగీరథ ఉద్యోగులకు అభినందనలు.'అని నరసింహన్ అన్నారు.

ప్రాజెక్టులకు రూ.1.17 లక్షల కోట్లు ఖర్చు చేస్తాం

'రాష్ట్రంలో కోటి ఎకరాలకు సాగునీరు అందించడానికి ప్రభుత్వం భారీ నీటి ప్రాజెక్టులను నిర్మిస్తున్నది. ఆటంకాలను ప్రభుత్వం అకుంఠిత దీక్షతో అధిగమించింది. తలపెట్టిన అన్ని ప్రాజెక్టులకూ అటవీ, పర్యావరణ, పరిపాలనా అనుమతులను వివిధ కేంద్ర ప్రాధికారిక సంస్థల నుంచి పొందింది. ఉమ్మడి ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేసే సీతారామ ప్రాజెక్టు అటవీ, పర్యావరణ అనుమతులను సాధించుకున్నాం. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికీ అన్ని అనుమతులూ సాధించడానికి ప్రభుత్వం తీవ్రంగా కషి చేస్తున్నది. తెలంగాణ వరదాయని కాళేశ్వరం ప్రాజెక్టు పనులు జరుగుతున్న తీరును పర్యవేక్షించిన కేంద్ర జలసంఘం ప్రభుత్వ కషిని కొనియాడింది. ఈ ప్రాజెక్టు ద్వారా ఈ ఏడాది వర్షాకాలంలోనే గోదావరి నది ద్వారా ఎత్తిపోతలు ప్రారంభిచండానికి ప్రభుత్వం నిర్మాణ పనుల్లో వేగం పెంచింది. ఇటీవలే సీఎం కేసీఆర్ ప్రాజెక్టు పనులను సందర్శించి, సకాలంలో పూర్తి చేసి, నీరందించడానికి వీలుగా తీసుకోవాల్సిన చర్యలపై స్పష్టమైన ఆదేశాలిచ్చారు. అన్ని ప్రాజెక్టులనూ ఈ ఐదేళ్ల కాలంలో పూర్తి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తున్నది. మిషన్ కాకతీయ ద్వారా 20,171 చెరువుల పునరుద్ధరణ పూర్తయింది. నీటి పారుదల రంగానికి నాలుగున్నరేండ్లలో రూ.77,777 కోట్లు ప్రభుత్వం ఖర్చు చేసింది. రాబోయే కాలంలో రూ.1.17 లక్షల కోట్ల అంచనా వ్యయంతో పనులు చేస్తుంది.'అని నరసింహన్ చెప్పారు.

సోలార్ ఉత్పత్తిలో దేశంలోనే రెండోస్థానం

'రాష్ట్రం ఏర్పడే నాటికి విద్యుత్ రంగం అధ్వాన్నస్థితికి చేరింది. తీవ్రమైన విద్యుత్ సంక్షోభం నెలకొంది. తెలంగాణ ప్రభుత్వం ఈ సంక్షోభాన్ని చాలా తక్కువ సమయంలో పరిష్కరించింది. రాష్ట్రం ఏర్పడిన తొమ్మిదో నెల నుంచే నిరంతరాయ నాణ్యమైన విద్యుత్తును 24 గంటల పాటు సరఫరా చేస్తున్నది. రాష్ట్రాన్ని మిగులు విద్యుత్ రాష్ట్రంగా మార్చేందుకు 28 వేల మెగావాట్ల స్థాపిత విద్యుత్ సామర్థ్యం లక్ష్యంగా తలపెట్టిన కొత్త విద్యుత్ ప్లాంట్ల నిర్మాణం శరవేగంగా జరుగుతున్నది. 800 మెగావాట్ల కేటీపీఎస్ 7వ దశ నిర్మాణాన్ని కేవలం 42 నెలల రికార్డు సమయంలో పూర్తి చేసి, విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించింది. 1080 మెగావాట్ల సామర్థ్యంతో నిర్మిస్తున్న భద్రాద్రి పవర్ ప్లాంటు ఈ ఏడాది నుంచి ఉత్పత్తి ప్రారంభిస్తుంది. 4 వేల మెగావాట్ల సామర్థ్యంతో నిర్మిస్తున్న యాదాద్రి అల్ట్రామెగా పవర్ ప్లాంటు నిర్మాణ పనులు వేగంగా జరగుతున్నాయి. సంప్రదాయేతర ఇంధన వనరుల ద్వారా విద్యుత్ ఉత్పత్తిని ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం 5 వేల మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకున్నది. ఇప్పటికే 3,613 మెగావాట్ల సోలార్ విద్యుత్ అందుబాటులోకి వచ్చింది. దేశంలో సోలార్ విద్యుత్ ఉత్పత్తిలో కర్ణాటక రాష్ట్రం తర్వాత తెలంగాణ రెండో స్థానంలో నిలిచింది. రాష్ట్రం ఏర్పడే నాటికి 7,778 మెగావాట్ల స్థాపిత విద్యుత్ సామర్థ్యం మాత్రమే ఉండేది. నాలుగున్నరేండ్లలో ప్రభుత్వ కషి వల్ల రాష్ట్రంలో 16,503 మెగావాట్ల స్థాపిత విద్యుత్ అందుబాటులోకి వచ్చింది. తలసరి విద్యుత్ వినియోగం వద్ధిరేటులో దేశంలోనే ప్రథమంగా నిలిచింది. దేశంలో వ్యవసాయానికి 24 గంటల నాణ్యమైన విద్యుత్తును ఉచితంగా సరఫరా చేస్తున్న ఏకైక రాష్ట్రంగా తెలంగాణ నిలిచింది.'అని గవర్నర్ అన్నారు.

రైతుబంధు దేశంలోనే ఆదర్శ పథకం

'ప్రభుత్వం తీసుకున్న వ్యూహాత్మక చర్యల వల్ల సకాలంలో ఎరువులు, విత్తనాలు అందుతున్నాయి. కల్తీ విత్తనాలు, ఎరువుల అమ్మకాలను నిరోధించడానికి కఠినమైన చర్యలు చేపట్టింది. కల్తీలు, నకిలీలకు పాల్పడే వారిపై పీడీ యాక్టు నమోదు చేయడానికి ప్రభుత్వం చట్టం తెచ్చింది. ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల కల్తీకి పాల్పడే వారిపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తున్నది. టీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతుబంధు పథకం ప్రపంచ వ్యాప్తంగా ప్రశంసలు పొందింది. రైతులకు పెట్టుబడి కోసం ఎకరానికి రూ.4 వేల చొప్పున రెండు పంటలకు రూ.8వేల దక్కుతుండంతో రైతాంగం హర్షం వ్యక్తం చేస్తున్నది. ఈ పథకాన్ని ఐక్యరాజ్యసమితి ప్రశంసించడం గర్వకారణం. రైతుబంధు పథకం దేశంలో ఇప్పుడు ఓ రోల్ మోడల్ పథకంగా మారింది. రైతు బీమా ద్వారా ఆ కుటుంబానికి రూ.5 లక్షల పది రోజుల్లో అందిస్తున్నది. ఇప్పటి వరకు 5,675 మంది రైతుల కుటుంబాలకు రూ.283 కోట్ల రైతుబీమా పథకం కింద సహాయం అందించింది. 94 శాతం భూముల యాజమాన్యాల హక్కుల విషయంలో స్పష్టత వచ్చింది. భూముల రిజిస్ట్రేషన్ వ్యవస్థలో ఇకపై వందకువంద శాతం పారదర్శకత సాధించేందుకు సంస్కరణలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది.'అని నరసింహన్ చెప్పారు.



వృత్తులకు ప్రోత్సాహం

'గ్రామీణ ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమైపోయింది. కుల వత్తుల మీద ఆధారపడి జీవించే బీసీ కులాల జీవితాలు కుప్ప కూలి పోయాయి. ఈ వృత్తులకు ఆర్థిక చేయూత, ప్రోత్సాహం ఇవ్వడం వల్ల రాష్ట్రంలోని బీసీల స్థితిగతులను మార్చాలని తద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను తిరిగి నిలబెట్టాలని ప్రభుత్వం భావించింది. గొల్ల కుర్మలకు పెద్దఎత్తున గొర్రెలు పంపిణీ చేసే కార్యక్రమం ప్రభుత్వం ప్రారంభించింది. ఇప్పటికే 75 లక్షల గొర్రెలు పంపిణీ చేసింది. పెరిగిన జీవ సంపదతో ఇప్పటికే రూ.1,200 కోట్లకు పైగా ప్రయోజనం గొల్ల కుర్మలకు చేకూరింది. దేశంలో గొర్రెలతో పాటు ఇతర పశువులకు సత్వర వైద్య సేవలు అందించడం కోసం 100 సంచార పశువైద్యశాలలు నడుపుతున్నది. భవిష్యత్తులో మత్స్యపరిశ్రమను మరింత అభివృద్ధి చేస్తాం. నేత కార్మికులు నేసె వస్త్రాలను ప్రభుత్వమే కొనుగోలు చేస్తున్నది. విద్యార్థులు, పోలీసులకు, ఇతర సంస్థల ఉద్యోగుల యూనిఫారాలు, బతుకమ్మ, రంజాన్, క్రిస్మస్ పండుగల సందర్భంగా పంచే చీరల కోసం చేనేత ఉత్పత్తులను అదేవిధంగా పవర్‌లూమ్ ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్నది. చేనేత, మరమగ్గాలవారికి నూలు, రసాయనాలపై 50 శాతం సబ్సిడీని కల్పిస్తున్నది. మార్కెట్ సదుపాయాలను మెరుగుపరిచి, కార్మికులకు కనీస ప్రతిఫలం దక్కే విధంగా చర్యలు తీసుకున్నది. చేనేత ఉత్పత్తులకు మంచి ప్రచారం కల్పిస్తున్నది. నేత కార్మికులకు ఉపాధి కల్పించేందుకు వరంగల్ లో మెగా టెక్స్ టైల్ పార్కు నిర్మిస్తున్నది. సిరిసిల్ల, గద్వాలలో టెక్స్ టైల్ హబ్స్ ఏర్పాటు చేస్తున్నది. నవీన క్షౌరశాలలు పెట్టుకునేందుకు నాయీ బ్రాహ్మణులకు, బట్టలు ఉతికే అధునాతన పరికరాలు కొనుగోలు చేసేందుకు రజకులకు ఆర్థిక సాయం అందిస్తున్నది. తాటి, ఈత చెట్ల పన్ను రద్దు చేసింది. రూ.వెయ్యి కోట్లతో ఎంబీసీ కార్పొరేషన్ ఏర్పాటు చేసింది.'అని గవర్నర్ వివరించారు.

బీసీలకు మరో 119 గురుకులాలు

'తెలంగాణ ఏర్పడక ముందు 296 గురుకులాలున్నాయి. ఈ ప్రభుత్వం అన్ని హంగులతో, రికార్డు స్థాయిలో 542 కొత్త గురుకులాలు ఏర్పాటుచేసింది. వచ్చే విద్యా సంవత్సరం నుంచి బీసీల కోసం మరో 119 గురుకులాలు ప్రారంభిస్తుంది. పభుత్వాసుపత్రుల్లో డయాలసిస్ కేంద్రాలు ఏర్పాటు చేసింది. ఎంఆర్ఐ, సిటీస్కాన్, డిజిటల్ రేడియాలజీ, టూ డి ఎకో తదితర అత్యాధునిక పరికరాలను వివిధ దవాఖానాలలో ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. హైదరాబాద్‌లో వైద్యసేవలను మరింత విస్తరించి, పేదలందరికీ అందుబాటులోకి తెచ్చేందుకు ప్రతీ పదివేల మందికి ఒకటి చొప్పున బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేసింది. 40 బస్తీ దవాఖానాలు ఇప్పటికే సేవలు అందిస్తున్నాయి. వైద్య విద్యను, సేవలను మరింత విస్తరించడం కోసం రాష్ట్రంలో కొత్తగా నాలుగు వైద్య కళాశాలలను ప్రభుత్వం మంజూరు చేసింది. సిద్ధిపేట, మహబూబ్ నగర్ కాలేజీల్లో ప్రవేశాలు ప్రారంభమయ్యాయి. సూర్యాపేట, నల్లగొండలో వచ్చే ఏడాది నుంచి ప్రారంభమవుతాయి. ఒక్కో వైద్య కళాశాలకు అనుబంధంగా 750 పడకల ఆసుపత్రులు ప్రారంభిస్తున్నాం. కేసీఆర్ కిట్ పథకం అమలు తర్వాత ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య గణనీయంగా పెరగడంతోపాటు, సమర్థవంతంగా మాతా, శిశు సంరక్షణ జరుగుతున్నది. కంటి వెలుగు తరహాలోనే చెవి, ముక్కు, గొంతు, దంత సంబంధమైన వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించడం కోసం రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక శిబిరాలు నడపాలని ప్రభుత్వం నిర్ణయించింది. అన్ని రకాల పరీక్షలు నిర్వహించి, తెలంగాణ హెల్త్ ప్రొఫైల్ రూపొందించడానికి ప్రభుత్వం సంకల్పించింది. ఈ పథకం అమలు కోసం ప్రాథమికమైన ఏర్పాట్లను ప్రభుత్వం ప్రారంభించింది.'అని నరసింహన్ అన్నారు.

త్వరలో రెండు కొత్త జిల్లాలు

'పరిపాలనా సౌలభ్యం కోసం, ప్రభుత్వ కార్యక్రమాల అమలులో వేగాన్ని, పారదర్శకతను పెంచడం కోసం, 10 జిల్లాలను 31 జిల్లాలు చేసుకున్నాం. కొత్తగా నారాయణపేట, ములుగు జిల్లాలను త్వరలో ఏర్పాటు చేసుకుంటున్నాం. 43 రెవెన్యూ డివిజన్ల సంఖ్యను 69కి పెంచుకున్నాం. 459 మండలాలను 584 మండలాలు చేసుకున్నాం. గతంలో 68 మున్సిపాలిటీలుంటే, కొత్తగా మరో 68 మున్సిపాలిటీలు కలిపి మొత్తం 136 మున్సిపాలిటీలు, 6 కార్పొరేషన్లున్నాయి. గతంలో 8,690 గ్రామ పంచాయతీలుంటే, కొత్తగా 4,383 గ్రామ పంచాయతీలతో మొత్తం 12,751 ఉన్నాయి. రాష్ట్రంలో కొత్తగా 1,326 ప్రత్యేక ఎస్టీ గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేసింది. వీటికి తోడు 1,311 గ్రామ పంచాయతీలు షెడ్యూల్డ్ ఏరియాలోనే ఉన్నాయి. పంచాయితీ ఎన్నికల్లో 3 వేల మంది ఎస్టీలు సర్పంచులుగా అయ్యే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. కొత్త జిల్లాల ప్రాతిపదికన స్థానికుల హక్కులు పరిరక్షించటం కోసం, ప్రభుత్వం కొత్త జోనల్ వ్యవస్థను ఏర్పాటు చేసింది. లోకల్ క్యాడర్ ఉద్యోగాలలో 95 శాతం అవకాశాలు స్థానికులకే లభించే విధంగా చట్టం చేసింది. జిల్లా క్యాడర్‌తో పాటు ఏడు జోన్లు, రెండు మల్టీ జోన్లు ఏర్పాటు చేసింది. కొత్త జోనల్ వ్యవస్థ ప్రకారమే తెలంగాణలో నియామకాలు జరుగుతాయి'.అని గవర్నర్ వివరించారు.

ఐకెపీ ఉద్యోగుల సర్వీసులు క్రమబద్ధీకరిస్తాం

'ప్రజా సంక్షేమం, అభివద్ధి కోసం ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాలు ప్రజల జీవితాల్లో మెరుగుదలను సాధించగలిగాయి. కేసీఆర్ నేతత్వంలోని ప్రభుత్వం సమర్థవంతమైన పరిపాలన వల్ల రాష్ట్రం దేశంలోనే అనేక రంగాల్లో అగ్రగామిగా పురోగమిస్తున్నది. అందువల్లనే గత ఎన్నికల్లో అన్ని వర్గాల ప్రజలు ప్రభుత్వంపై తమ విశ్వాసాన్ని పెద్ద ఎత్తున ప్రకటిస్తూ తీర్పునిచ్చారు. తిరిగి అధికారంలోకి తీసుకొచ్చారు. ఈ విజయాన్ని వినమ్రంగా స్వీకరిస్తూ, నా ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు చర్యలు ప్రారంభించింది. అర్హులకు అందించే ఆసరా పింఛన్లను రూ.1000 నుంచి రూ.2,016కు, వికలాంగులకు రూ.1500 నుంచి రూ.3,016 పెంచాలని నిర్ణయించింది. వద్ధాప్య పింఛన్ పొందే అర్హత వయో పరిమితిని సడలించి, 57 ఏండ్లు నిండిన వారందరికీ అందించబోతున్నది. నిరుద్యోగులకు నెలకు రూ.3,016 భృతి అందించనుంది. డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం కొనసాగిస్తూనే, సొంతస్థలం ఉన్న అర్హులైన పేదలకు డబుల్ బెడ్రూం ఇంటి నిర్మాణం కోసం రూ.5 లక్షల నుంచి రూ.6 లక్షల వరకు అందిస్తుంది. రైతులకు రూ.లక్ష వరకున్న పంట రుణాలను మాఫీ చేస్తుంది. ఈ ఏడాది నుంచే రైతుబంధు సహాయాన్ని ఎకరానికి ఏడాదికి రూ.8 వేల నుంచి రూ.10 వేలకు పెంచుతుంది. రైతుసమన్వయ సమితి సభ్యులకు గౌరవ భృతి అందిస్తుంది. ఎస్సీ,ఎస్టీ వర్గాల సమగ్ర అభివద్ధి కోసం ప్రత్యేక పథకాలు రూపొందించేందుకు నియమించిన కమిటీ ఇచ్చే నివేదికను ప్రభుత్వం అమలు చేస్తుంది. చట్టసభల్లో బీసీలకు 33 శాతం, మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలు కోసం ప్రభుత్వం పోరాడుతుంది. ఎస్టీలకు 12 శాతం, మైనార్టీలకు 12 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ తెలంగాణ అసెంబ్లీ తీర్మానం చేసింది. ఈ రిజర్వేషన్లు అమలు చేయడం కోసం కేంద్రంతో రాజీలేని పోరాటం చేస్తుంది. ఎస్సీ వర్గీకరణ కోసం అసెంబ్లీ తీర్మానం చేసి, కేంద్రానికి పంపించింది. కేంద్రం నుంచి ఆమోదం రావడం కోసం టీఆర్ఎస్ పోరాటం చేస్తుంది. రైతులకు గిట్టుబాటు ధర లభించడం కోసం పెద్ద ఎత్తున ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను నెలకొల్పాలని ప్రభుత్వం ఆలోచిస్తున్నది. ప్రభుత్వం, మహిళా సంఘాలు, ఐకెపీ ఉద్యోగుల సంయుక్త నిర్వహణలో ఈ యూనిట్లు పనిచేస్తాయి. సందర్భోచితంగా ఐకెపీ ఉద్యోగుల సర్వీసులను క్రమబద్ధీకరించాలని ప్రభుత్వం యోచిస్తున్నది. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కషి చేస్తుంది.'అని నరసింహన్ చెప్పారు.

అందరి అభివృద్ధి కాదు, అందరి వినాశనం : యశ్వంత్‌సిన్హా

(మొదటిపేజీ తరువాయి)

పెద్దనోట్ల రద్దే నిదర్శనమని అన్నారు. ప్రతి పక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాలను అస్థిరపరిచేందుకు మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆయన దుయ్యబట్టారు. మోడీ నేతృత్వంలోని బీజేపీకి వ్యతిరేకంగా జాతీయస్థాయిలో మహాకూటమి ఏర్పాటే లక్ష్యంగా తృణమూల్ కాంగ్రెస్ అధ్యక్షురాలు, బెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జీ నేతృత్వంలో కోల్‌కతా వేదికగా ప్రతిపక్షాలు భారీ ర్యాలీ నిర్వహించాయి. ఈ ర్యాలీకి కాంగ్రెస్‌సహా పలు జాతీయ, ప్రాంతీయ పార్టీల నేతలు హాజరయ్యారు. పలువురు నేతల ప్రసంగాల తర్వాత చివరగా మమతా బెనర్జీ ముగింపు సందేశమిచ్చారు. ర్యాలీకి హాజరైనవారిలో కాంగ్రెస్ నేత మల్లికార్జున్‌ఖర్గే, ఎస్పీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్, ఎన్సీపీ అధ్యక్షుడు శరద్‌పవార్, డీఎంకే అధ్యక్షుడు స్టాలిన్,ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్, నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఫరూఖ్ అబ్దుల్లా,కర్నాటక సీఎం హెచ్‌డి కుమారస్వామి, ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్, ఆర్ఎల్డీ నేత జయంత్‌చౌదరి, పటీదార్ నేత హార్థిక్‌పటేల్, జేఎంఎం నేత హేమంత్ సోరేన్, దళిత నేత జిగ్నేశ్‌మెవానీ, లోక్ జనశక్తి నేత శరద్ యాదవ్, బీజేపీ ఎంపీ శత్రుఘ్నుసిన్హా,టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు హాజరయ్యారు. ప్రధాని మోడీపై బీజేపీ ఎంపీ శత్రుఘ్నుసిన్హా విమర్శల దాడి సాగించారు. రాఫెల్ జెట్ల ఒప్పందంపై ప్రజలు అడుగుతున్న ప్రశ్నలకు ప్రధాని సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. లేదంటే కాపాలదారునే దొంగగా విమర్శిస్తూనే ఉంటామని సిన్హా స్పష్టం చేశారు. 126 జెట్లను రద్దు చేసి 36 జెట్లకే ఎందుకు ఒప్పందం చేసుకున్నారని ఆయన ప్రశ్నించారు. కొత్త డీల్‌లో 41 శాతం ధర పెంచినట్టు 'ది హిందూ'లో వచ్చిన కథనాన్ని ఆయన గుర్తు చేశారు.

ర్యాలీలో పాల్గొన్న గుజరాత్ ఎమ్మెల్యే, దళిత నేత జిగ్నేశ్‌మెవానీ మాట్లాడుతూ మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేస్తోందని అన్నారు. మోడీ పాలనలో దళితు లు, మైనారిటీలు అణిచివేతకు గురవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దేశం మునుపెన్న డూలేని సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నదని మెవానీ అన్నారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీని ఓడించడమే లక్ష్యంగా ఐక్యంగా పని చేయాలని మెవానీ పిలుపునిచ్చారు.

మోడీని ఐక్యంగా ఎదుర్కొంటాం

ప్రధానిని ఎన్నికల తర్వాత నిర్ణయిస్తాం: మమతాబెనర్జీ

ప్రధాని మోడీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వానికి గడువు ముగిసిపోయిందని, త్వరలో జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో దేశ ప్రజలు ఆయన్ని సాగనంపుతారని తృణమూల్ కాంగ్రెస్ అధ్యక్షురాలు, బెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జీ ధీమా వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికల్లో ప్రతిపక్షాలు ఐక్యంగా పని చేస్తాయని, ప్రధాని ఎవరన్నది ఎన్నికల తర్వాత నిర్ణయిస్తామని మమతాబెనర్జీ స్పష్టం చేశారు. తనది అవినీతి లేని పాలన అని మోడీ చెబుతారు. కానీ, ఆయన హయాంలోనే రాఫెల్‌లాంటి భారీ కుంభకోణాలు జరిగాయి. నోట్లరద్దు, జీఎస్టీలాంటి ప్రజావ్యతిరేక నిర్ణయాలు అమలు చేశారు. రాజకీయాల్లో కనీస మర్యాదలుంటాయి. వాటిని బీజేపీ పాటించడంలేదు. మీతో(బీజేపీతో) ఉంటే ఫర్వాలేదు. లేదంటే దొంగలుగా చిత్రీకరిస్తారని మమత విమర్శలు సంధించారు. బీజేపీలో ఆపార్టీ సీనియర్లకు కూడా గౌరవం లేకుండా పోయిందన్నారు. కేంద్రమంత్రులు రాజ్‌నాథ్ సింగ్, సుష్మాస్వరాజ్, నితిన్‌గడ్కరీలాంటివారిని కూడా ప్రధాని మోడీ నిర్లక్ష్యం చేస్తున్నారంటూ మమత దుయ్యబట్టారు. మోడీ అనుయాయులిపుడు సమిష్టి నాయకత్వం గురించి చెబుతున్నారు. కానీ, లోక్‌సభ ఎన్నికల్లో తిరిగి గెలిస్తే మళ్లీ నిర్లక్ష్యం చేస్తారంటూ మమత హెచ్చరించారు.



అద్దంలా రహదారులు

(మొదటిపేజీ తరువాయి)

శనివారం ప్రగతిభవన్‌లో సమీక్ష నిర్వహించారు. ఇందులో ముఖ్య కార్యదర్శులు సునీల్‌శర్మ, రామకృష్ణారావు, ఆర్అండ్‌బీ ఈఎన్సీ గణపతిరెడ్డి, ఎస్ఈ చంద్రశేఖర్, సీఎంఓ అధికారులు స్మితా సభర్వాల్, రాజశేఖరరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కేంద్రం నుంచి రికార్డు స్థాయిలో జాతీయ రహదారులు సాధించుకున్నామని చెప్పారు. రాష్ట్రంలోని ఆర్అండ్‌బీ, పంచాయతీ రాజ్ శాఖల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున రోడ్ల నిర్మాణం చేపట్టామన్నారు. ఇంకా రాష్ట్రంలో అవసరమైన చోట రహదారులకు మరమ్మత్తులు చేయాలని, శిథిలావస్థకు చేరిన బ్రిడ్జిలకు మరమ్మతులు చేయడంతో పాటు ఇరుకు రోడ్లను వెడల్పు చేయాలని ఆదేశించారు. దీనికోసం ఈఎన్సీ స్థాయి నుంచి ఎస్ఈ స్థాయి వరకు రాష్ట్ర స్థాయి ఆర్అండ్‌బీ అధికారుల సదస్సు నిర్వహించాలని సూచించారు. గ్రామస్థాయి నుంచి ప్రతీరోడ్డు పరిస్థితిని సమీక్షించి రహదారుల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై ప్రణాళిక రూపొందించాలన్నారు. జిల్లా, మండలం అనే వ్యత్యాసం ఉండవద్దని, అక్కడ ఏ పార్టీ ప్రజాప్రతినిధి ప్రాతినిధ్యం వహిస్తున్నారనే విషయం పక్కన బెట్టి మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. స్థానిక ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు కూడా రోడ్ల మరమ్మతుల పనులు చేయించుకోవాలని సూచించారు. పంచాయతీరాజ్ నుంచి ఆర్అండ్‌బీకి, ఆర్అండ్‌బీ నుంచి జాతీయ రహదారులకు రోడ్లు బదిలీ అయిన సందర్భాల్లో వాటి నిర్వహణ, మరమ్మతుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారని సీఎం అసంతృప్తి వ్యక్తం చేశారు. కొత్త రోడ్ల నిర్మాణం పూర్తయ్యేవరకు పాత రోడ్లు పాడుపడినా ఎవరూ పట్టించుకోవడం లేదని, దీనివల్ల ప్రయాణికులు ఇబ్బందిపడాల్సి వస్తుందన్నారు. రోడ్ల బదిలీలకు సంబంధించి అనుసరించాల్సిన వ్యూహాన్ని రూపొందించాలని అధికారులను ఆదేశించారు.

భూములు కోల్పోయిన రైతులకు పరిహారం చెల్లించండి : సీఎం

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా కాల్వల నిర్మాణం సందర్భంగా భూమిని కోల్పోయిన రైతులకు వెంటనే పరిహారం చెల్లించాలని సీఎం కేసీఆర్ ఆదేశించారు. ముధోల్ నియోజకవర్గం పరిధిలోని రైతులకు పరిహారం ఇప్పించాలని ఎమ్మెల్యే జి. విఠల్ రెడ్డి చేసిన విజ్ఞప్తికి స్పందించిన ముఖ్యమంత్రి ఆర్థిక శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. చిన్న సుద్దవాగు ప్రాజెక్టు నిర్మాణంతో ముంపునకు గురైన ప్రజలకు భూపరిహారం ఇవ్వటంతో పాటూ పునరావాస ప్యాకేజీ అమలు చేయాలని ఎమ్మెల్యే సీఎంను కోరారు. ముధోల్‌లోని కమ్యూనిటీ హాల్‌ను అప్‌గ్రేడ్ చేయాలని ఆయన సీఎం దృష్టికి తెచ్చారు.

జేఈఈ మెయిన్స్‌లో తెలంగాణ తేజాలు

(మొదటిపేజీ తరువాయి)

సాధించడం గమనార్హం. జేఈఈ మెయిన్స్ మొదటి విడత పేపర్-1 ఫలితాలను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) శనివారం విడుదల చేసింది. మొదటి విడత జేఈఈ మెయిన్స్ పరీక్షలు ఈనెల 9 నుంచి 12వ తేదీ వరకు 258 నగరాల్లో 467 పరీక్షా కేంద్రాల్లో జరిగిన విషయం తెలిసిందే. దేశవ్యాప్తంగా ఆన్‌లైన్‌లో ఈ పరీక్షను ఎన్‌టీఏ నిర్వహించింది. జేఈఈ మెయిన్స్ పేపర్-1కు దేశవ్యాప్తంగా 9,29,198మంది దరఖాస్తు చేశారు. వారిలో రాతపరీక్షలకు 8,74,469 మంది హాజరయ్యారు. జేఈఈ మెయిన్స్ రెండో విడత రాతపరీక్షలు ఏప్రిల్ 6 నుంచి 20వ తేదీ వరకు జరగనున్నాయి. పేపర్-1 బీఈ, బీటెక్ కోర్సుల్లో ప్రవేశాల కోసం పరీక్ష నిర్వహించనుంది. పేపర్-2 బీఆర్క్, బీఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు జరుగుతాయి. తెలంగాణ నుంచి ఆడెల్లి సాయికిరణ్, ఇందుకూరి జయంత్ ఫణిసాయి, విశ్వంత్ కె, బట్టిపాటి కార్తికేయ ఈ నలుగురు వంద శాతం పర్సెంటైల్ సాధించిన వారిలో ఉన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన బొజ్జ చేతన్‌రెడ్డి వంద శాతం పర్సెంటైల్ సాధించారు. రెండో విడత జేఈఈ మెయిన్స్ పరీక్షలకు సంబంధించి ఫిబ్రవరి 8 నుంచి మార్చి 7వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరించనున్నారు. పరీక్షలను ఏప్రిల్ 6 నుంచి 20వ తేదీ వరకు నిర్వహిస్తారు. రెండో విడత తర్వాత రెండింటిలో అభ్యర్థులు సాధించిన మార్కుల ఆధారంగా జేఈఈ మెయిన్స్ ర్యాంకులను ఎన్‌టీఏ ప్రకటిస్తుంది.

వందశాతం పర్సెంటైల్ సాధించిన అభ్యర్థులు

పేరు	రాష్ట్రం
1. ధ్రువ్ అరోరా	మధ్యప్రదేశ్
2. రాజ్ ఆర్యన్ అగర్వాల్	మహారాష్ట్ర
3. ఆడేల్లి సాయికిరణ్	తెలంగాణ
4. బొజ్జ చేతన్‌రెడ్డి	ఆంధ్రప్రదేశ్
5. సాంబిత్ బెహెరా	రాజస్థాన్
6. నమన్ గుప్తా	ఉత్తర్‌ప్రదేశ్
7. ఇందుకూరి జయంత్‌ఫణిసాయి	తెలంగాణ
8. విశ్వంత్ కె	తెలంగాణ
9. హిమాన్షు గౌరవ్ సింగ్	ఉత్తరప్రదేశ్
10. కెవిన్ మార్టిన్	కర్ణాటక
11. శుభాంకర్ గంభీర్	రాజస్థాన్
12. బట్టిపాటి కార్తికేయ	తెలంగాణ
13. అంకిత్‌కుమార్ మిశ్రా	మహారాష్ట్ర
14. జయేష్ సింగ్లా	పంజాబ్
15. గుప్త కార్తికేయ చంద్రేష్	మహారాష్ట్ర

విపత్కర పరిస్థితుల్లో మీడియా..

(మొదటిపేజీ తరువాయి)

ఫ్లస్ మీడియా' అనే అంశంపై శనివారం హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టుడియోలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో సాయినాథ్ ముఖ్య వక్తగా ప్రసంగించారు. పీపుల్స్ ఆర్చీవ్ ఆఫ్ రూరల్ ఇండియా (పారి), మంథన్ సంస్థలు సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో... దేశంలోని వాతావరణ, పర్యావరణ అంశాలను, వ్యవసాయ రంగంలో నెలకొన్న సంక్షోభాలను, వ్యవసాయ కార్మికుల జీవన పరిస్థితులను, కరువులు, వలసలను, అందుకుగల కారణాలను ఆయన సోదాహరణంగా వివరించారు. దేశంలోని జీవ వైవిధ్యం, సంస్కృతి, సాంప్రదాయాలు, గిరిజనుల బతుకు చిత్రాలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. వాస్తవానికి కరువు, కాటకాలు వచ్చినప్పుడు ఆహారం, తాగు నీటి కొరత గురించి మాత్రమే మనం మాట్లాడుతుంటాం.. కానీ వీటితోపాటు ఉపాధి సమస్య తీవ్రతరమవుతుందని ఆయన చెప్పారు. ఫలితంగా వలసలు పెరిగి.. గ్రామీణ జీవనం విధ్వంసానికి గురవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. దీని వల్ల ఆకలి చావులు, ఆర్థిక అసమానతలు కూడా పెరుగుతాయని చెప్పారు. వ్యవసాయ కూలీల జీవనం మరింత దుర్భరమవుతుందని తెలిపారు. దురదృష్టవశాత్తూ దేశంలోని ప్రముఖ పత్రికలు, ఛానళ్లు ఇలాంటి అంశాలకు పెద్దగా ప్రాధాన్యతనివ్వటం లేదన్నారు. దీన్నిబట్టి మొత్తం జనాభాలో 75 శాతం మందికి (రైతులు,



వ్యవసాయ కూలీలు, వలస జీవులు) సంబంధించిన వార్తలకు ప్రధాన మీడియాలో స్థానమే లేకుండా పోతున్నదనే విషయం విదితమవుతున్నదని వివరించారు. మరోవైపు సమాజంలో మహిళలపై వివక్ష కొనసాగుతున్నదని.. ఈ క్రమంలో మీడియా సైతం వారికి ప్రాధాన్యతనివ్వటం లేదని సాయినాథ్ తెలిపారు. ఇటీవల కేరళలో మహిళలు నిర్వహించిన మానవహారం ప్రపంచ రికార్డులకెక్కింది.. వారు తమ హక్కులు, స్వేచ్ఛ, సమానత్వం కోసం నినదించారని గుర్తుచేశారు. అంతటి ముఖ్యమైన కార్యక్రమానికి మీడియా ఏ మాత్రం ప్రాధాన్యతనిచ్చిందని ప్రశ్నించారు. ముంబయిలోనూ, ఆ తర్వాత ఇటీవల ఢిల్లీలోనూ రైతులు నిర్వహించిన పాదయాత్రలకు కూడా మీడియాలో తొలుత సముచిత స్థానం దక్కలేదని అన్నారు. అనివార్య పరిస్థితుల్లో ఆయా యాత్రల ముగింపును పత్రికలు ప్రముఖంగా ప్రచురించాల్సి వచ్చిందని తెలిపారు. ఎంతో నైపుణ్యంగల చేనేత కార్మికులు, కల్లుగీత కార్మికుల పరిస్థితి కూడా ఇదే విధంగా ఉందన్నారు. 1980ల కాలంలో జాతీయ, ప్రాంతీయ పత్రికలన్నీ వ్యవసాయ, కార్మిక, ఉపాధి కల్పన శాఖలకు విధిగా ప్రతినిధులను, విలేకరులను నియమించేవి.. కానీ ఇప్పుడు ఆయా శాఖలకు మీడియాలో విలేకరులే లేకుండా పోతున్నారు.. ఒకవేళ ఉన్నా ఆయా శాఖల మంత్రులు చెప్పిన అంశాలకే ప్రాధాన్యతనిస్తున్నారు తప్పితే, విశ్లేషణలు, వివరణాత్మక కథనాలు ఉండటం లేదని చెప్పారు. ఇదే సమయంలో మీడియా మొత్తం వ్యాపారాత్మక ధోరణితో నడుస్తున్న తరుణంలో బిజినెస్, స్పోర్ట్స్ రంగాలకు ప్రాధాన్యత నానాటికీ పెరిగిపోతున్నదని తెలిపారు. లాభనష్టాలను బేరీజు వేసుకునే వీటికి ప్రాధాన్యతనిస్తున్నారని చెప్పారు. ఈ నేపథ్యంలో పత్రికలు, ఛానళ్ల తీరులో, ధోరణిలో మార్పు రావాలని కోరారు. అత్యధిక మంది ప్రజలకు ఉపయోగపడే విధంగా వార్తలను ప్రచురించాలని సూచించారు. యువ పాత్రికేయులు.. అదే కోణంలో పరిశీలించటం ద్వారా తమ సృజనాత్మకతకు పదునుపెట్టాలని సాయినాథ్ ఈ సందర్భంగా కోరారు.


టీఆర్టీ ఫలితాలు విడుదల

- **925 పోస్టులకు ఉపాధ్యాయ అభ్యర్థుల ఎంపిక**

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉపాధ్యాయ నియామక పరీక్ష (టీఆర్టీ) ఫలితాలను తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) విడుదల చేసింది. ఈ మేరకు టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి ఎ వాణీప్రసాద్ శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. టీఆర్టీలో స్కూల్ అసిస్టెంట్, పీఈటీ, ఎస్జీటీ కేటగిరీల్లో ప్రకటించిన 925 పోస్టులకు ఉపాధ్యాయ అభ్యర్థులను ఎంపిక చేశామని తెలిపారు. స్కూల్ అసిస్టెంట్ (ఇంగ్లీష్ మీడియం)-4, స్కూల్ అసిస్టెంట్ సోషల్ స్టడీస్ (హిందీ మీడియం)-1, స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ (తెలుగు మీడియం)-9, పీఈటీ (ఉర్దూ మీడియం)-4, పీఈటీ (ఇంగ్లీష్ మీడియం)-1, ఎస్జీటీ (ఉర్దూ)-281, స్కూల్ అసిస్టెంట్ మ్యాథ్స్ (తెలుగు మీడియం)-191 చొప్పున ఉపాధ్యాయ అభ్యర్థులు ఎంపికయ్యారని పేర్కొన్నారు. ఎస్జీటీ (ఉర్దూ)లో 636 పోస్టులకు 320 మంది అభ్యర్థులు ఎంపికయ్యారని తెలిపారు. 316 పోస్టులకు అర్హులైన అభ్యర్థులు అందుబాటులో లేరని పేర్కొన్నారు. వికలాంగులకు చెందిన 35 పోస్టులకు మెడికల్ రిపోర్టులు అందగానే ఫలితాలు విడుదల చేస్తామని తెలిపారు. స్కూల్ అసిస్టెంట్ మ్యాథ్స్ (తెలుగు మీడియం)లో ప్రకటించిన 215 పోస్టులకు వికలాంగులకు చెందిన 16 అభ్యర్థులను మెడికల్ రిపోర్టులు అందిన వెంటనే ఫలితాలు ప్రకటిస్తామని పేర్కొన్నారు. కోర్టు కేసు వల్ల ఆరు పోస్టులు, ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న రెండు కలిపి ఎనిమిది పోస్టులను విత్‌హెల్డ్‌లో ఉంచామని తెలిపారు. వివిధ కేటగిరీల్లో 16 పోస్టులకు అర్హులైన అభ్యర్థులు అందుబాటులో లేనందున ఎంపిక చేయలేదని పేర్కొన్నారు. 925 పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల వివరాల జాబితా టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో పొందుపరిచామని తెలిపారు.

మోడీ పాలనలో పెరిగిన అప్పులు 49శాతం



న్యూఢిల్లీ: మోడీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం కేంద్రంలో అధికారం చేపట్టిన తర్వాత ఈ నాలుగున్నరేండ్ల కాలంలో అప్పులు 49 శాతం పెరిగి రూ.82 లక్షల కోట్లకు చేరుకున్నాయి. ప్రభుత్వ అప్పులపై ఆర్థికశాఖ విడుదల చేసిన 8వ స్థాయీ పత్రంలో ఈ వివరాలను వెల్లడించింది. యూపీఏ ప్రభుత్వం అధికారం కోల్పోయిన సమయంలో(2014 జూన్ వరకు) దేశానికి ఉన్న అప్పుల మొత్తం రూ.54,90,763 కోట్లు కాగా, 2018 సెప్టెంబర్ వరకు అవి రూ.82,03,253 కోట్లకు చేరుకున్నాయి. ఆర్థికశాఖ 2010-11 నుంచి ప్రతిఏటా దేశానికున్న అప్పులపై స్థాయీ పత్రాన్ని విడుదల చేస్తోంది. ప్రభుత్వ అవసరాలు, పలు పథకాలకు అవసరమైన నిధుల్ని అప్పుల రూపంలో సేకరిస్తుంది. ఏటా అప్పులపై చెల్లించే వడ్డీలు, ఆదాయానికి మించి చేసే ఖర్చులను బడ్జెట్‌లో ద్రవ్యలోటుగా ఆర్థికశాఖ చూపిస్తుంది. ఈ ఆర్థిక సంవత్సరం పూర్తయ్యేనాటికి అంచనాకన్నా అధికంగానే ద్రవ్యలోటు ఉండనున్నట్టు ఇప్పటికే స్పష్టమైంది. 2018-19 ద్రవ్యలోటు లక్ష్యం రూ.6.24 లక్షల కోట్లు కాగా, నవంబర్ నాటికే రూ.7.17 లక్షల(114.8 శాతం)కు చేరుకున్నది. అంటే అనుకున్న లక్ష్యానికన్నా 14.8 శాతం ఇప్పటికే అదనంగా ఖర్చయిందని అర్థం.

నామినేషన్ వేశాడని కుల బహిష్కరణ

(మొదటిపేజీ తరువాయి)

వేశాడు. అయితే, అదే వార్డుకు గతంలో వార్డు సభ్యునిగా చేసిన వ్యక్తి కుమారుడూ నామినేషన్ వేశాడు. అతన్ని ఏకగ్రీవంగా ఎన్నుకోవాలని కులపెద్దలు నిర్ణయించారు. కానీ మహేందర్ నామినేషన్ వేయడంతో నేతకాని కులపెద్దలు ఆగ్రహం వ్యక్తం చేశారు. కుల కట్టుబాట్లు తప్పి నామినేషన్ వేశాడని శనివారం ఉదయం మహేందర్‌ను ప్రభుత్వ పాఠశాలకు పిలిపించి పంచాయితీ పెట్టారు. ఎవరూ వేయొద్దు అనుకున్నాక 'నువ్వు ఎలా నామినేషన్ వేస్తావు' అంటూ ఆ కుటుంబాన్ని కులం నుంచి బహిష్కరించారు. ఆ కుటుంబంతో ఎవరైనా మాట్లాడితే రూ.వెయ్యి జరిమానాతోపాటు, వారిని ఎలాంటి శుభకార్యాలకూ ఆహ్వానించొద్దనీ, మంచినీళ్లు కూడా ఇవ్వొద్దనీ తీర్మానించారు.

కేంద్ర ఉద్యోగాల్లో భర్తీ నిల్

(మొదటిపేజీ తరువాయి)

ఖాళీల్ని కేంద్రం భర్తీ చేయటం లేదని తెలుస్తోంది. ఈనేపథ్యంలో ఈబీసీలకు 10శాతం రిజర్వేషన్ కల్పిస్తూ చట్టాన్ని తీసుకొచ్చి ప్రయోజనమేంటన్న ప్రశ్నను రాజకీయ, ఆర్థిక రంగ విశ్లేషకులు లేవనెత్తుతున్నారు.

తగ్గారా? పెరిగారా?

2018-19 బడ్జెట్, కేంద్ర ప్రభుత్వ సిబ్బంది వివరాల్ని విడుదల చేశారు. మొత్తం 55 కేంద్ర ప్రభుత్వ శాఖల్లో (రక్షణ శాఖ తప్ప..), రైల్వే శాఖతో కలుపుకొని...ప్రస్తుతం ఉన్న సిబ్బంది 32.52 లక్షలు. 2014, మార్చి 1న ఉన్న సిబ్బంది 33.3 లక్షలు. ప్యూన్, డ్రైవర్ ఉద్యోగాల్ని కాంట్రాక్ట్ విధానంలో కేంద్రం నియామకాలు జరిపింది. ఇవి మినహా వివిధ ప్రభుత్వ శాఖల్లో ఆఫీసర్ స్థాయి ఉద్యోగాలేవీ భర్తీ చేయలేదు. ఇక రైల్వే శాఖ సంగతి చెప్పక్కర్లేదు. సరైన సంఖ్యలో సిబ్బంది లేక రైల్వే శాఖ పూర్తిస్థాయిలో సేవలు అందించలేకపోతోంది. 2016లో 13.31 లక్షల మంది రైల్వేలో పనిచేయగా, 2017లో సిబ్బంది సంఖ్య 13.08లక్షలకు తగ్గిపోయింది. 23వేల ఉద్యోగాల్లో కోత పెట్టారు. ఖాళీ అయిన ఉద్యోగాల్ని భర్తీ చేయటంపై, సిబ్బందిని పెంచటంపై మోడీ సర్కార్ ఎన్నడూ కూడా ఆసక్తి చూపలేదు.

పెరిగిన పోలీస్ ఫోర్స్

సెంట్రల్ పారామిలటరీ విభాగంలో సిబ్బంది నియామకాల్ని జరిపారు. సిబ్బంది సంఖ్య 10.24లక్షల నుంచి 11.25లక్షలకు పెరిగింది. అంటే సుమారుగా లక్షమంది సిబ్బందిని పెంచారు. పన్నులు వసూలు చేసే శాఖల్లో, నిఘా, విదేశాంగ శాఖల్లో సిబ్బంది సంఖ్య పెరిగింది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ జరుపుతామన్నట్టుగా ప్రతీ ఏటా 'స్టేటస్ రిపోర్ట్'లో మోడీ సర్కార్ అంకెల గారడీ చేసిందని రాజకీయ పరిశీలకులు అంటున్నారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు ఓటర్లను ప్రలోభ పెట్టేందుకే ఈబీసీలకు 10శాతం రిజర్వేషన్ల అంశాన్ని మోడీ సర్కార్ తెరపైకి తెచ్చిందని విశ్లేషిస్తున్నారు.

సెన్సెక్స్ ▲ 13
36,386

నిఫ్టీ ▲ 02
10,906

శుక్రవారం మార్కెట్లు ముగిసే సమయానికి..

డాలరుకు రూపాయి విలువ
71.04

బంగారం (10.గ్రా)
రూ. 32,120

వెండి (కేజీ)
రూ. 39,260


కోడిగుడ్లు (వందకి)

హైదరాబాద్	433	విజయవాడ	441
ఒక్కగుడ్డుకు	4.70	చెన్నై	455
వరంగల్	433	ముంబయి	484

బ్యాంకింగ్‌లో పారదర్శకత పెరగాలి..

మరిన్ని విధానపరమైన చర్యలపై దృష్టి సారించాల్సి ఉంది

- ప్రభుత్వం, బీబీబీతో కలిసి పని చేస్తున్నాం
- బ్రెగ్జిట్‌ను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నాం
- ఆర్థిక స్థిరత్వమే ధ్యేయంగా మా అడుగులు: ఆర్బీఐ కొత్త గవర్నర్ శక్తికాంత దాస్



గాంధీనగర్: దేశీయ బ్యాంకింగ్ వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించేలా కార్పొరేట్ గవర్నెన్స్‌ను మరింతగా పటిష్టం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని భారతీయ రిజర్వు బ్యాంక్ (ఆర్బీఐ) గవర్నర్ శక్తికాంత దాస్ అన్నారు. శనివారం ఆయన ఇక్కడ ఏర్పాటు చేసిన వైబ్రెంట్ గుజరాత్ అంతర్జాతీయ సదస్సులో పాల్గొని ప్రసంగించారు. ఆర్బీఐ గవర్నర్‌గిరి చేపట్టిన తరువాత ఆయన మొదటి అంతర్జాతీయ సదస్సులో ప్రసంగిస్తూ దేశీయ బ్యాంకింగ్‌లో పారదర్శకత, జవాబుదారీతనం పెంచే విషయమై విధానపరమైన చర్యలు తీసుకోవడంపై దృష్టి సారించాల్సి అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. పెరుగుతోన్న భారత ఆర్థిక వ్యవస్థ పరిమాణం, సంక్లిష్టత ఈ అవసరాన్ని మరింతగా ఎత్తిచూపుతోందని ఆయన అన్నారు. ఇటీవల పంజాబ్ నేషనల్ బ్యాంక్‌తో పాటు వివిధ బ్యాంకుల్లో వెలుగుచూసిన మోసాలను ఆయన పరోక్షంగా ప్రస్తావిస్తూ ఈ వ్యాఖ్యలు చేయడం విశేషం. బ్యాంకుల్లో పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంచేందుకు గాను ప్రభుత్వం, బ్యాంక్స్ బోర్డు బ్యూరో (బీబీబీ), ఆర్బీఐలు కలిసి పని చేస్తున్నాయని శక్తికాంత్ తెలిపారు. పనితీరు మూల్యాంకణ లక్ష్యంతో విధివిధానాలను రూపొందించే దిశగా తాము కలిసి పని చేస్తున్నామని ఆయన తెలిపారు. ఈ విధివిధానాలు ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో కార్పొరేట్ పాలనకు కొత్త రూపాన్ని నిర్వచించేలా వాటి రూపకల్పన జరుగుతోందని ఆయన అన్నారు. దీని వల్ల బ్యాంకుల్లో పారదర్శకత, జవాబుదారీతనం పెరుగ గలదని ఆయన వివరించారు. దాస్ కంటే ముందు ఆర్బీఐ గవర్నర్‌గా పని చేసిన ఉర్జిత్ పటేల్ పలు ప్రయివేటు బ్యాంకుల పట్ల కఠినంగా వ్యవహరించి వాటి యాజమాన్యంలో మార్పులు వచ్చేలా పలు కీలక చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో కొత్తగా ఆ పదవిలోకి వచ్చిన శక్తికాంత బ్యాంకులపై ఎలాంటి తీరును ప్రదర్శిస్తారోనన్న ఆలోచనల మధ్య దాస్ వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి.

సూక్ష్మ గణాంకాలకే ప్రథమ ప్రాధాన్యత..

దేశ ఆర్థిక వ్యవస్థ పనితీరుకు అద్దంలా నిలిచే సూక్ష్మగణాంకాల్లో మెరుగైన వృద్ధిని సాధించేందుకే తాము ప్రథమ ప్రాధాన్యతను ఇవ్వనున్నట్టుగా ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత తెలిపారు. దీనికి తోడు అంతార్జతీయంగా నెలకొన్న తీవ్ర అనిశ్చిత వాతావరణం నెలకొన్న నేపథ్యంలో దేశంలో ఆర్థిక స్థిరత్వాన్ని తీసుకురావడంపై కూడా ప్రధానంగా దృష్టి పెట్టనున్నట్లు దాస్ వివరించారు. బ్రెగ్జిట్ విషయమై ఇటీవలి కాలంలో జరుగుతున్న పరిణామాలను గురించి శక్తికాంత్ మాట్లాడుతూ అంతర్జాతీయ పరిణామాలను క్షుణ్ణంగా పరిశీలిస్తోందని అన్నారు. తాజా పరిణామాల నేపథ్యంలో భారత్‌కు ఎదుర య్యే సవాళ్లు, అందుబాటులోకి వచ్చే కొత్త అవకాశాలను క్షుణ్ణంగా బేరీజు వేసుకొని ఆర్బీఐ ఒక విధానపనరమై స్పందనను వెలువరిస్తుందని ఆయన అన్నారు. ఇటీవలి బ్రెగ్జిట్ పరిణామాల నేపథ్యంలో భారత కంపెనీలు, విధానకర్తలు తమ వ్యూహాలను తిరిగి రూపొందించుకొని తగిన విధంగా ప్రతిస్పందించాల్సి ఉంటుందని అన్నారు.

రిలయన్స్‌లోకి మరో వారసుడొచ్చాడు..



న్యూఢిల్లీ: రిలయన్స్ గ్రూపులోకి అంబానీల మరో వారసుడు అడుగుపెట్టాడు. అనిల్ అంబానీకి చెందిన చిన్న కుమారుడు 23 ఏండ్ల అన్మాల్ అంబానీ సంస్థలోకి అడుగు పెట్టినట్టుగా రిలయన్స్ గ్రూపు తెలిపింది. న్యూయార్క్‌లోని స్టెర్న్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో మేనేజ్‌మెంట్ యూజీ పట్టా పొందిన అనంతరం అన్మాల్ రిలయన్స్ ఇన్‌ఫ్రాలో మేనేజ్ మెంట్ ట్రైనీగా చేరారని సంస్థ శనివారం వెల్లడించింది. రిలయన్స్ గ్రూపు నకు రిలయన్స్ ఇన్‌ఫ్రా ఇంజినీరింగ్, ప్రొక్యూర్‌మెంట్ కార్యకలాపాలను నిర్వహిస్తోంది. రిలయన్స్ గ్రూపునకు చెందిన విద్యుత్తు ఉత్పత్తి, ముంబయి లాంటి మెట్రో నగరాలలో విద్యుత్తు పంపిణీ, రిలయన్స్ డెఫెన్స్, రిలయన్స్ రోడ్స్ అండ్ ఎయిర్‌పోర్ట్స్ ప్రాజెక్ట్స్ తదితర వ్యాపారాలకు రిలయన్స్ ఇన్‌ఫ్రా హెూల్డింగ్ కంపెనీగా వ్యవహరిస్తోంది. అనిల్ అంబానీకి చెందిన పెద్ద కుమారుడు కూడా అన్‌మోల్ కూడా 2014లో చదువు పూర్తి చేసుకొని తొలత రిలయన్స్ మ్యూచువల్ ఫండ్‌లో ట్రైనీగానే గ్రూపులో తన ప్రస్థానాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన రియలన్స్ క్యాపిటల్‌లో చేరారు. ప్రస్తుతం అన్‌మోల్ రిలయన్స్ గ్రూపునకు చెందిన విదేశీ ఆర్థిక సేవల వ్యాపారాన్ని కూడా అన్‌మోల్ నిర్వహిస్తున్నారు.

చేనేతకు మైక్రోసాఫ్ట్ చేయూత..

- రి-వైవ్ పేరుతో ఈ-కామర్స్ ఫోర్టల్ ప్రారంభం



నవతెలంగాణ, వాణిజ్య విభాగం: తెలంగాణలోని చేనేతకారులకు చేయూతను అందించేందుకు సాఫ్ట్‌వేర్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ మరో ముందడుగు వేసింది. రాష్ట్రంలోని చేనేత వృత్తిదారులు తమ కార్యకలాపాలను మరింతగా విస్తృత పరుచుకునేందుకు, మెరుగైన వినియోగదారులకు చేరువయ్యేలా సంస్థ రి- వైవ్ డాట్ ఇన్ పేరుతో సరికొత్త ఈ-కామర్స్ ఫోర్టల్‌ను ప్రారంభించింది. చేనేతకారులు సహజ రంగులను ఉపయోచి రూపొందించిన మేటి డిజైన్లను ఈ పోర్టల్‌లో వినియోగదారులకు అందుబాటులో ఉంచనున్నట్టుగా మైక్రోసాఫ్ట్ ఇండియా ఆర్ అండ్ డీ విభాగం ఎండీ అనిల్ బన్సాలీ తెలిపారు. రాష్ట్రంలోని అన్ని చేనేత క్లస్టర్లకు ఈ పోర్టల్ సేవలను అందుబాటులోకి తేనున్నట్టుగా బన్సాలీ తెలిపారు. దీనికి తోడు లాభదాయకత ఆశించని ఎన్‌జీవోల ద్వారా చేనేతకారులకు నిర్వహణ మూలధనం లభించేలా కూడా ఈ కొత్త ప్రాజెక్టులో చర్యలు చేపట్టనున్నట్టుగా ఆయన తెలిపారు. కొత్త ప్లాట్‌ఫాం ద్వారా భారత చేనేత గొప్పదనాన్ని విస్తరించి చేనేతకారుల మార్కెట్‌ను విస్తరింపజేసేందుకు వీలు పడుతుందని బన్సాల్ వివరించారు. దీంతో వారి సాధికారికతకు ఇది తోడ్పడగలదని తెలిపారు. చేనేత ఉత్పత్తులకు క్యాడ్ మరియు రంగులు అద్దేందుకు గాను చేనేతకారులకు శిక్షణనిచ్చేందుకు గాను మైక్రోసాఫ్ట్ సంస్థ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సంస్థతో జట్టుకట్టినట్టుగా తెలిపారు. తొలి విడుతగా శిక్షణ పొందిన వంద మందికి ఈ సందర్భంగా ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. మైక్రోసాఫ్ట్ చర్యతో చేనేతకారులు తమంతట తాము నిలదొక్కుకొనేందుకు, చేతివృత్తిదారులకు తగిన ఉపాధి కల్పించేందుకు వీలు కల్పిస్తుందని తెలంగాణ రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖల ప్రిన్సిపల్ సెక్రెటరీ జయేష్ రంజన్ అన్నారు.

ఓబీసీకి పూర్వవైభవం తీసుకువద్దాం: ఈడీ



నవతెలంగాణ, వాణిజ్య విభాగం: 'ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్'కు (ఓబీసీ) పూర్వ వైభవం తీసుకు వచ్చేందుకు గాను సిబ్బంది సమిష్టిగా కృషి చేయాలని ఆ బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బాలకృష్ణ ఆస్లే ఎస్ పిలుపునిచ్చారు. శనివారం ఆయన హైదరాబాద్, విజయవాడకు చెందిన సర్కిల్ ఉద్యోగ సభ్యులతో టౌన్‌హాల్ మీటింగ్‌ను నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన రెండు నగరాల్లోని బ్యాంకు ప్రగతిని సమీక్షించారు. ఈ కార్యక్రమాన్ని హైదరాబాద్ సర్కిల్ హెడ్ అరుణ్ కుమార్ అగర్వాల్ స్వాగతోపన్యాసంతో ప్రారంభమైంది. అనతరం ఈడీ మాట్లాడుతూ సిబ్బంది ఒక జట్టుగా రాణించి వినియోగదారులకు మెరుగైన సేవలను అందించడం ద్వారా ఓబీసీని వీలైనంత త్వరగా పీసీఏ నిబంధనల నుంచి బయటపడేసేలా కృషి చేయాలని కోరారు. దృఢ సంకల్పంతో జట్టుగా రాణిస్తే సాధించలేనిదంటూ ఏదీ ఉండదని ఆయన అన్నారు. ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడానికి ఉద్యోగులు కృషి చేయాలని బాలక్రిష్ణ సూచించారు. ఈ సందర్భంగా మెరుగ్గా రాణించిన శాఖల మేనేజర్లను ఈడీ సత్కరించారు. మేటి పనితీరుతో రాణించిన వారికి ప్రశంసా పత్రాలను అందించి సన్మానించారు. ఈ కార్యక్రమానికి హైదరాబాద్, విజయవాడకు సర్కిల్ కార్యాలయానికి చెందిన అధికారులు ఉద్యోగులతో పాటు జంటనగరాలలోని ఓబీసి బ్యాంక్‌నకు చెందిన శాఖత ఉద్యోగులు, శాఖల సభ్యులు పాల్గొన్నారు.

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌కు మేటి లాభాలు

న్యూఢిల్లీ: హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు అక్టోబరు-డిసెంబరు త్రైమాసికానికి మెరుగైన ఆర్థిక ఫలితాలను విడుదల చేసింది. ఏడాది ప్రాతిపదికన పోలిస్తే డిసెంబరు మాసాంతానికి సంస్థ నికర లాభం 20.31 శాతం పెరిగిందని సంస్థ తెలిపింది. గత త్రైమాసికంలో సంస్థ నికర లాభం రూ.5,585.85 కోట్లుగా నమోదైనట్టుగా వెల్లడించింది. అంతకు ముందు ఏడాది ఇదే త్రైమాసికంలో బ్యాంక్ లాభం రూ.4,642.60కోట్లుగా నమోదు అయింది. ఈసారి నికర వడ్డీ ఆదాయం పెరగడంతో సంస్థ ఎక్కువగా లాభపడినట్లు పేర్కొంది. కంపెనీ నికర వడ్డీ ఆదాయం డిసెంబరు త్రైమాసికంలో 21.9 శాతం మేర పెరిగి రూ.12,576.75 కోట్లుగా నమోదైందని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ వెల్లడించింది. అంతకుముందు ఏడాది ఇదే త్రైమాసికంలో నికర వడ్డీ ఆదాయం రూ.10,314.3కోట్లుగా నమోదైనట్లు తెలిపింది.

ఇద్దరు పీఎన్‌బీ ఈడీలపై వేటు!

ముంబయి: పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో (పీఎన్‌బీ) అతి పెద్ద బ్యాంకింగ్ మోసం వెలుగు చూసిన నేపథ్యంలో ప్రభుత్వం ఆ బ్యాంక్‌పై ప్రత్యక్ష చర్యలను మొదలు పెట్టింది. బ్యాంక్‌కు చెందిన ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు సంజీవ్ శరణ్, కె.వీర బ్రహ్మాజీ రావులను విధుల నుంచి తొలగించింది. నేషనల్ బ్యాంక్స్ స్కీం 1970 కింద ఒక జాతీయ బ్యాంక్‌కు చెందిన ఇద్దరు డైరెక్టర్లను తొలగించడం ఇదే తొలిసారి. 2018 జులైలో శరణ్, బ్రహ్మాజీలకు సర్కారు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. బ్రాడీ హౌస్ బ్రాంచ్‌లో స్విఫ్ట్ వ్యవస్థను దుర్వినియోగం చేయడంపై ఎందుకు చర్యలు తీసుకోకూడదో వివరించాలని నోటీస్‌లో పేర్కొంది. వారి వివరణలు పరిశీలించాక బ్యాంక్ బోర్డు అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకొని సర్కారు వారిని తొలగించింది. ప్రభుత్వ చర్యను ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ స్వాగతించింది. ఆ సంఘ జనరల్ సెక్రటరీ సీహెచ్ వెంకటాచలం మాట్లాడుతూ "మేము కేంద్ర ప్రభుత్వ చర్యను స్వాగతిస్తున్నాం. అత్యున్నత నిర్వహణ బృందానికి తెలియకుండా ఇంత భారీ స్థాయిలో మోసం జరగడానికి అవకాశం లేదు. ప్రభుత్వం కూడా వారి వాదనలు విన్న తర్వాతే ఈ నిర్ణయం తీసుకొంది" అని ఆయన పేర్కొన్నారు.

ఎల్అండ్‌టీకి సెబీ ఎదురుదెబ్బ



ముంబయి: ఇంజినీరింగ్ దిగ్గజం ఎల్అండ్‌టీకి ఎదురుదెబ్బ తగిలింది. దాదాపు రూ.9,000 కోట్ల మేం షేర్లను బైబ్యాక్ చేసేందుకు ఎల్అండ్‌టీ సంస్థ ఇచ్చిన ప్రతిపాదనకు అనుమతులిచ్చేందుకు మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ నిరాకరించింది. ఈ విషయాన్ని ఎల్అండ్‌టీ స్టాక్ ఎక్స్ఛేంజీకి అందజేసిన ఫైలింగ్‌లో పేర్కొంది. బైబ్యాక్ ఆఫర్ సెబీ, కంపెనీ చట్టంలోని నిబంధనలకు అనుకూలంగా లేదని మార్కెట్ నియంత్రణ సంస్థ అధికారులు పేర్కొన్నారు. ఈ ఆఫర్‌లో భాగంగా ఒక్కో షేరుకు రూ.1,475 చెల్లించి మొత్తం 6.1కోట్ల షేర్లను బైబ్యాక్ చేయాలని ఎల్ అండ్ టీ నిర్ణయించింది. ఈ లెక్కన ఈ బైబ్యాక్ విలువ రూ.9,000 కోట్లుగా ఉంటుందని సంస్థ లెక్కగట్టింది. అక్టోబర్ 15నాటికి ఈ కంపెనీ షేర్లను కలిగి ఉన్నవారు ఈ బైబ్యాక్‌కు అర్హులుగా పేర్కొంది. కానీ ఇప్పుడు సెబీ ఎల్అండ్‌టీ నిర్ణయానికి బ్రేకులు వేసింది.

కుంభమేళాలో మళ్లీ అగ్గిమంటలు..

- వారంలో రెండోది!
- భద్రతా ప్రమాణాలపై ముందే హెచ్చరించిన 'నవతెలంగాణ'



అలహాబాద్: ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగరాజ్ లో జరుగుతున్న కుంభమేళాలో శనివారం సాయంత్రం అగ్నిప్రమాదం సంభవించింది. ఆధ్యాత్మిక ప్రదర్శనలు జరుగు తున్న సెక్టార్ 13లోని కల్పవాసి క్యాంప్‌లో మంటలు అంటుకున్నాయి. ఒక గుడారం పూర్తిగా అగ్నికి ఆహుతైంది. అగ్నిప్రమాదం సమాచారం అందుకోగానే ఫైరింజన్లు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశాయి. ప్రమాదానికి గల కారణాలు, ఆస్తి, ప్రాణనష్టం వివరాలు ఇంకా తెలియాల్సి ఉన్నది. ఈ వారమే ప్రారంభమైన కుంభ మేళాలో ఇది రెండో అగ్నిప్రమాదం. కుంభమేళా ప్రారంభం ముందు రోజే అగ్ని ప్రమాదం చోటుచేసుకున్న విషయం తెలిసిందే. గత సోమవారం దిగంబర్ అకాడ శిబిరంలో గ్యాస్ సిలిండర్ పేలి పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. కాగా, మార్చి 4తో ముగిసే కుంభమేళా భద్రతా ప్రమాణాలపై తేది. 02.01.2019న 'మహాకుంభమేళా.. భద్రత ఎలా?' పేరిట 'నవతెలంగాణ' క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి సెక్యూరిటీ, మౌలిక సదుపాయాల స్థితిగతులపై ప్రత్యేక కథనాన్ని ప్రచురించడం విదితమే! ప్రమాదాలతో పాటు అక్కడ సరైన వసతులు కల్పించకపోవటంపై భక్తులు యూపీ సర్కార్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పెరిగిన స్వైన్ ఫ్లూ మరణాలు

- రాజస్థాన్‌లో 48కి చేరిన మృతుల సంఖ్య



జైపూర్: రాజస్థాన్‌లో స్వైన్‌ఫ్లూ వ్యాధి ప్రబలుతోంది. రాష్ట్రంలో శనివారం ఒక్కరోజే ఐదుగురు ఈ వ్యాధితో మరణించారు. దీనిపై వైద్యాధికారి ఒకరు మాట్లాడుతూ... జోధ్‌పూర్, ఉదయ్‌పూర్‌లో మొత్తం నలుగురు, బార్మర్‌లో ఒకరు ఈ వ్యాధితో మరణించారని అన్నారు. దీంతో మొత్తం మరణాల సంఖ్య 48కి చేరకున్నదని తెలిపారు. ఇప్పటి వరకు మొత్తం 5061 మంది నుంచి రక్తనమూనాలను సేకరించామన్నారు. వారిలో 1173 మందికి స్వైన్‌ఫ్లూ వచ్చినట్టు గుర్తిం చామని అధికారి వెల్లడించారు. కాగా ప్రతీ ఇంటికి తిరిగి వైద్యపరీక్షలు నిర్వహించాలని ఆరోగ్యశాఖ మంత్రి ఆదేశించారు. గతేడాది దేశవ్యాప్తంగా సుమారు 15వేల మందిలో ఈ వ్యాధిని గుర్తించారు. అందులో సుమారు11 వందల మంది మరణించిన సంగతి తెలిసిందే.

సీఎస్‌తో సీఈవో రజత్ కమార్ భేటీ

పార్లమెంట్ ఎన్నికల పర్యవేక్షణకు నోడల్ అధికారుల నియామకం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పార్లమెంట్ ఎన్నికల ఏర్పాట్లు, నిర్వహణపై చర్చించేందుకు సీఎస్ ఎస్‌కే జోషితో చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ రజత్ కుమార్ సచివాలయంలో శనివారం సమావేశమయ్యారు. ఈ భేటీలో డీజీపీ మహేందర్ రెడ్డి కూడా పాల్గొన్నారు. ఈనెల 22న కేంద్ర ఎన్నికల సంఘం అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ఉంటుందని రజత్ కుమార్ తెలిపారు. రాష్ట్రంలో ఓటరు జాబితా నమోదు ప్రక్రియ జరుగుతున్నదని.. కేంద్ర ఎన్నికల కమిషన్ ఓటరు జాబితాపై ఈనెల 25 వరకు గడువునిచ్చిందని తెలిపారు. ఈ గడువును ఫిబ్రవరి 4 వరకు పొడిగించాల్సిందిగా కోరినట్టు చెప్పారు. మరోవైపు రాష్ట్రంలో ఎన్నికల వ్యయ పరిశీలన, నిర్వహణకు సంబంధించి పది మంది ఉన్నతాధికారులను నోడల్ అధికారులుగా ఈసీ నియమించింది.

పచ్చని పొలాల్లో రియల్ దందా



మొదటి పేజీ తరువాయి

2,672ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఇటీవల దాదాపు 2వేల ఎకరాల వరకూ సాగు భూమిని ప్లాట్లుగా మార్చారు. ఐదేండ్ల కిందటి వరకు పచ్చని పంటలతో అలరారిన గ్రామ పరిసరాలు అన్నీ ఇప్పుడు ఇండ్లుగానూ, ప్లాట్లుగానూ దర్శనమిస్తున్నాయి. ఈ గ్రామంలోని చెరువుశిఖాన్ని కూడా ఆక్రమించారు. ఈ గ్రామ పరిధిలోనే ప్రస్తుతం ఆదిత్యనగర్, స్తంభాద్రినగర్, సూర్యనగర్, చంద్రనగర్, సింహాద్రినగర్, సాయిగణేష్‌నగర్, లక్ష్మీబృందావనం, శ్రీరాంనగర్, వెంపటినగర్, ఓరుగంటినగర్, సాయిటౌన్‌షిప్, అనన్య టౌన్‌షిప్, శ్రీగాయత్రీ నగర్‌తో పాటు ఇంకా పేరుపెట్టని పదుల సంఖ్యలో వెంచర్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చాయి.

పట్టా భూముల మార్పుకూ అనుమతి

ప్రయివేటు పట్టా భూములను ఇండ్ల స్థలాలుగా మార్చాలంటే ప్రభుత్వం నుంచి అనుమతులు తప్పనిసరి. వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా అధికారికంగా(రికార్డుపరంగా) మార్చాల్సి ఉంటుంది. పట్టా భూమిని రిజిస్టర్డ్ డాక్యుమెంట్ ద్వారా కొనుగోలు చేసిన వ్యక్తి ఇందుకోసం దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. పట్టా భూమికి సదరు సర్వే నెంబరుపై సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో నమోదైన ప్రభుత్వ మార్కెట్ ధరలో 3శాతం సొమ్ముతో చలానా చెల్లించి ఆర్డీవో కార్యాలయంలో దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి దరఖాస్తుదారుకు ఆర్డీవో వ్యవసాయేతర భూమిగా మారుస్తూ(కన్వర్షన్) ధ్రువీకరణ పత్రం జారీ చేస్తారు. కన్వర్షన్ అయిన భూమి ఇండ్ల స్థలాలు, పరిశ్రమల ఏర్పాటు, వ్యాపార నిమిత్తం వినియోగించుకునేందుకు అనుకూలమైనది. చెరువు శిఖంలో పట్టా భూమి అయినా, ఇతర పట్టాయేతర, వివాదాస్పద, అటవీ భూములు అయితే కన్వర్షన్ సర్టిఫికేట్ జారీ చేయరు. అందుకే కన్వర్షన్ ఉన్న భూముల్లో ఇండ్ల స్థలాల కొనుగోలుకు అభ్యంతరాలు ఉండవు. ఇవేమీ పాటించనప్పటికీ అధికారులు రియల్ వ్యాపారులతో కుమ్మక్కై చూసీచూడనట్టు వదిలేస్తున్నారు. దీని వల్ల ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం రాకపోగా, ప్లాట్లు కొనుగోలు చేసిన వారు భవిష్యత్‌లో అనుమతుల కోసం తీవ్ర ఇబ్బందులు పడే ప్రమాదం ఉంది.

లే-అవుట్ అనుమతి

కన్వర్షన్ చేసిన భూమిని ఇండ్ల స్థలాలుగా మార్చాలన్నా లేఅవుట్ తప్పనిసరి. ఇండ్ల స్థలాలు చేయాలంటే గ్రామపంచాయతీ/నగరపాలక సంస్థ నుంచి లే-అవుట్ అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. దీనిలో భాగంగా స్థానిక ప్రజావసరాల నిమిత్తం లేఅవుట్ చేసే భూమిలో 10 శాతం భూమిని గ్రీన్‌బెల్టు స్థలంగా కేటాయించాల్సి ఉంటుంది. అలాంటి భూములకే అనుమతులు జారీ చేస్తారు. లే-అవుట్ చేయాలంటే సదరు స్థలం పరిసరాల్లో నదులు, వాగులు, చెరువులు, డొంకలు వంటి వాటిని గుర్తిస్తూ పటాన్ని రూపొందించాల్సి ఉంది. కానీ ఖమ్మం పరిసర ప్రాంతాల్లోని వెంచర్లలో ఎక్కడా గ్రీన్‌బెల్ట్ స్థలాలు లేవు.

చట్టాన్ని కఠినతరం చేస్తున్నాం
అశోకచక్రవర్తి- తహసీల్దార్ ఖమ్మంరూరల్



ఖమ్మం నగర పరిసర ప్రాంతాల్లో కన్వర్షన్ చట్టాన్ని అడ్డుపెట్టుకుని వెంచర్లు వేస్తున్న వాటిని పరిశీలిస్తాం. ఇప్పటికే సబ్‌కలెక్టర్ అనురాగ్ జయంతి చట్టాన్ని కఠినతరం చేస్తున్నారు. ఇటీవల వచ్చిన దరఖాస్తులను తిరస్కరించారు. స్వయంగా ఫీల్డ్‌కు వచ్చిన తరువాతే అనుమతుల గురించి పరిశీలిస్తున్నారు. చట్టానికి విరుద్ధంగా వెంచర్లు వేసినట్టు ఫిర్యాదు చేస్తే వాటిని రద్దు చేసే అధికారం కలెక్టర్‌కు ఉంది. రహదారులు, గ్రీన్‌బెల్ట్ స్థలాలను పరిశీలించాల్సి ఉంది.

భారత్‌లో కాశ్మీర్ అంతర్భాగమే

పాకిస్థాన్ తన జోక్యాన్ని ఆపేయాలి

- అభివృద్ధిపై బీజేపీ, కాంగ్రెస్ మోసపూరిత హామీలతోనే అక్కడ అలజడి
- ప్రభుత్వం కూలి 8 నెలలైనా అక్కడ అశాంతే : అసదుద్దీన్ ఓవైసీ

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

'ముమ్మాటికీ కాశ్మీర్ భారతదేశంలో అంతర్భాగమే. అది భారత్‌కు గుండెకాయలాంటిది. కాశ్మీర్ విషయంలో పాకిస్తాన్ తన జోక్యాన్ని మానుకోవాలి. బీజేపీ, కాంగ్రెస్ మోసపూరిత విధానాలతోనే అక్కడ అలజడి చెలరేగుతున్నది' అని ఎంఐఎం పార్టీ అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ అన్నారు. హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో అంతర్జాతీయ యువజన నాయకత్వ సదస్సు శనివారం మొదలైంది. అందులో భాగంగా 'ది ప్రింట్' ఎడిటర్ శేఖర్ గుప్తా సమన్వకర్తగా 'భారత దేశంలో యువత అభివృద్ధి-విధాన పర నిర్ణయాలు' అనే అంశంపై చర్చాగోష్టిని నిర్వహించారు. ఈ సందర్భంగా అసదుద్దీన్ ఓవైసీ మాట్లాడుతూ..జమ్మూకాశ్మీర్‌లో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు మోసపూరిత హామీలతో అక్కడి ప్రజలను మభ్యపెడుతున్నాయని విమర్శించారు. న్యాయంగా వాళ్లకు దక్కాల్సిన వాటిని ఇవ్వడంలోనూ ఆ పార్టీల మోసపూరితంగానే వ్యవహరిస్తున్నాయన్నారు. వాళ్లకు జరుగుతున్న అన్యాయాన్ని తట్టుకోలేక, మరోవైపు ఉద్యోగాల్లేక యువత రోడ్లపైకి వస్తున్నదని వివరించారు. అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి, యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తే అక్కడ మామూలు వాతావరణ పరిస్థితిని నెలకొల్పవచ్చునన్నారు. జమ్మూకాశ్మీర్‌లో రాష్ట్ర ప్రభుత్వం కూలి 8 నెలలైందని, అక్కడ రాజకీయ అనిశ్చితి ఏర్పడిందని వ్యాఖ్యానించారు. భారతదేశంలో 25 ఏండ్ల లోపు యువత 50 శాతం ఉందని, దానిని ఉపయోగించుకోవడంలో పాలకులు విఫలమవుతున్నారని విమర్శించారు. నేటికీ భారత్‌లోని 60 శాతం యువత నిరుద్యోగ సమస్యతో అల్లాడుతున్నది. మరోవైపు జనాభావృద్ధి నియంత్రణ కరువైందన్నారు. జనాభా వృద్ధి నియంత్రణలో దక్షిణ భారతదేశం కొంత మెరుగ్గా ఉందని, ఉత్తరాదిలో మాత్రం జనాభా సంఖ్య ఏటికేడు పెరిగిపోతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. భారత్ వేగంగా అభివృద్ధి చెందాలంటే యువత రాజకీయాల్లోకి రావాలని పిలుపునిచ్చారు. చట్టసభలకు పోటీ చేసే వయస్సును 20 ఏండ్లకు తగ్గించాలని, అవసరమైతే ఇన్నిసార్లే పోటీచేయాలన్న నిబంధన రావాలని ఆకాంక్షించారు. జాతీయ పార్టీల్లో ఉంటే యువతకు సరైన ప్రాతినిధ్యం దక్కదని, 50 ఏండ్లయినా కార్పొరేటర్ కాలేని పరిస్థితి ఉంటుందని అన్నారు. ప్రత్యామ్నాయ పార్టీల ద్వారా యువత చొరవ చేసి రాజకీయాల్లోకి రావాలని కోరారు.

నిధుల కేటాయింపుల్లో అసమానతలు : ఎంపీ కవిత



దక్షిణాది, ఉత్తరాది రాష్ట్రాలకు ఆదాయ పంపిణీలో అసమానతలు ఉన్నాయని ఎంపీ కవిత అన్నారు. ఉత్తరాది కంటే దక్షిణాది రాష్ట్రాల్లో జనాభా వృద్ధి రేటు తక్కువగా ఉందన్నారు. భారత జాతీయ జనాభావృద్ధి రేటు 1.4 ఉన్నదని, అదే ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో దానికి రెట్టింపుగా 2.8 శాతం ఉందన్నారు. జనాభావృద్ధి రేటు నియంత్రణను పాటించని ఆ రాష్ట్రాలకు ఎందుకు అధిక నిధులు వెచ్చిస్తారని కేంద్రాన్ని ప్రశ్నించారు. తెలంగాణలో జీఎస్టీ ద్వారా కేంద్రానికి 23 నుంచి 25 శాతం ఆదాయం వెళ్తున్నదని, కేంద్రం తిరిగి 14 శాతమే కేటాయిస్తున్నదని వివరించారు. పట్టణీకరణ, జనాభావృద్ధిపై నియంత్రణ లేకపోవడం, రాజకీయ చైతన్యం లేకపోవటం వల్లనే నిరుద్యోగ సమస్య పెరిగిపోతున్నదన్నారు. కాంగ్రెస్ పార్టీ యువ ఎంపీ గౌరవ్ గగోయ్ మాట్లాడుతూ..మోడీ ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా నెరవేర్చలేదన్నారు. నల్లధనం హామీని వెనక్కి తెప్పించడంలో, రెండు కోట్ల ఉద్యోగాల కల్పనలో మోడీ పూర్తిగా విఫలమయ్యారన్నారు. ఈ చర్చాగోష్టిలో బ్రిటన్ ఎంపీ సీమా మల్హోత్రా(లేబర్ పార్టీ), న్యూజిలాండ్, శ్రీలంక, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. వివిధ దేశాలు, రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రతినిధులు, మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు చర్చాగోష్టిలో పాల్గొన్నవారు సమాధానాలు చెప్పారు.

బహిరంగ సభలో స్పీచ్‌లా..

మొదటి పేజీ తరువాయి

ఉద్యోగ క్యాలెండర్, ఉద్యోగుల సమస్యలు, రేషన్‌బియ్యంతోపాటు పేదలకు సరుకులు, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్, మైనార్టీ, ఎస్టీ రిజర్వేషన్ల వంటి అంశాలను విస్మరించారన్నారు. శనివారం సీఎల్పీ కార్యాలయంలో సీఎల్పీ నేతగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత శాసనమండలి సభ్యులు షబ్బీర్ అలీ, ఎమ్మెల్యేలు శ్రీధర్‌బాబు, గండ్ర వెంకటరమణారెడ్డితో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉద్యోగాలు, నియామకాలు, నీళ్ల కోసం తెలంగాణ ప్రజలు ఉద్యమించి, రాష్ట్రాన్ని సాధించుకున్నారని, వారి ఆకాంక్షలను గుర్తించి వాటి అమలు కోసం శాసనసభలో ప్రయత్నం చేస్తామని చెప్పారు. ప్రజల ఆశల్ని ప్రతిబింబించేలా శాసనసభలో ప్రజాగొంతుకగా ఉంటామన్నారు. నీటిపారుదల, ప్రాజెక్టులు, పరిశ్రమలు వంటి కీలకమైన సమస్యలపై లోతైన అధ్యయనం చేసి, సర్కారుపై సభలో విశ్లేషణాత్మకమైన పాత్ర పోషిస్తామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీకి కూడా ప్రజా సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, అందులో భాగంగానే సంక్షేమ ఫలాలు పేదలకు చేర్చడానికి పోరాటం చేస్తామన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టానికి కాంగ్రెస్ పార్టీ పునాది వేసిందని, ప్రతిపక్ష పార్టీగా వాటి అమలు కోసం అసెంబ్లీలో సర్కారుపై ఒత్తిడి పెంచుతామన్నారు. టీఆర్ఎస్ సర్కారు డ్వాక్రా సంఘాలను బలహీనపరిచిందని, సర్కారు మెడలు వంచైనా వాటిని బలోపేతం చేయిస్తామన్నారు. గతంలో ఇచ్చిన హామీలు, ఈ ఎన్నికల్లో ప్రజలకు చేసిన వాగ్దానాలను తూ చ తప్పకుండా అమలు చేయడానికి నిర్మాణాత్మకంగా పని చేస్తామన్నారు. గవర్నర్ ప్రసంగంలో కొత్తగా చెప్పిందేమీ లేదని, పాత విషయాలనే గవర్నర్‌తో చెప్పారని ఆయన విమర్శించారు.

బలహీన పర్చడం ప్రజాస్వామ్యానికి మంచిదికాదు

ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికల్లో గెలిచిన ఎమ్మెల్యేలను ప్రలోభపెట్టి, పార్టీలను బలహీనపర్చడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని భట్టి చెప్పారు. శాసనసభలో అధికారపక్షం, ప్రతిపక్షం, స్పీకర్ వంటి వ్యవస్థలు బలంగా ఉండాలనీ, లేకపోతే ప్రజాస్వామ్య వ్యవస్థ ప్రమాదంలో పడుతున్నదని ఒక ప్రశ్నకు సమాధానంగా ఆయన చెప్పారు. తమ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు పార్టీ మారుతున్నారంటూ అపోహలు సృష్టించి, భ్రమలు కల్పించి టీఆర్ఎస్ మైండ్‌గేమ్ ఆడుతుందని చెప్పారు.

భట్టికి సన్మానం

సీఎల్పీ నేతగా ఎన్నికైన మల్లు భట్టి విక్రమార్కను పార్టీ నాయకులు, అనుబంధ సంఘాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు సన్మానం చేశారు. పలువురు ఎమ్మెల్యేలు, సన్నిహితులు శుభాకాంక్షలు తెలిపారు. శనివారం గాంధీ భవన్‌లో పార్టీ ప్రధాన కార్యదర్శి బొల్లు కిషన్ ఆధ్వర్యంలో టీపీసీసీ అధ్యక్షులు ఎన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, భట్టి విక్రమార్కను గజమాలతో సన్మానించారు.

గొప్ప గొప్ప ప్రయత్నాలన్నీ
హేళనతోనే మొదలవుతాయి
- చేగువేరా



స్టేజ్ ఎక్కాలంటే భయంగా ఉందా... కాళ్ళు వణికిపోతున్నాయా... అరచేతుల్లో చెమటలు పడుతున్నాయా... గొంతు మూగబోతున్నదా... ముందు రోజు ఎంత ప్రాక్టీస్ చేసినా మీ వల్ల కావడం లేదా... రాయమంటే పుంఖాలుగా రాస్తాం. సరదాగా మాట్లాడమంటే ఎన్ని గంటలైనా కాలక్షేపం చేస్తాం. కానీ స్టేజ్ ఎక్కి పది మంది ముందు మైక్ తీసుకుని మాట్లాడాలంటే మాత్రం జంకుతాం. ఇలాంటి సమస్య మీకే కాదు చాలా మందికి ఎదురవుతుంది. భయాన్ని వదిలిపెట్టి కాస్త ధైర్యం చేస్తే మీకు మించిన స్పీకర్ ఉండరని గుర్తుపెట్టుకోండి. ఈ చిన్న చిట్కాలు మీలోని స్టేజ్ ఫీయర్‌ను వదిలిస్తాయి. అవేంటో మీరే చూడండీ...



భయాన్ని వదిలించుకోండి

టెన్షన్ సద్దుమణిగి...

వేదిక ఎక్కగానే గుండెల్లో రైళ్లు పరిగెత్తి, కండరాలు పట్టేసి నర్వస్‌గా ఫీలవుతాం. ముందు రోజు రాత్రి ప్రాక్టీస్ చేసిన ప్రసంగ పాఠం ఒక్క ముక్క కూడా గుర్తు రాదు. మాట్లాడబోతే మాట పెగలదు. ఈ మార్పులన్నిటనికీ కారణం టెన్షన్‌తో ఒంట్లో పెరిగిపోయే అడ్రినలిన్ హార్మోన్ ఫలితమే. అయితే ఈ స్థితిని అధిగమించాలంటే నిలబడ్డచోటే కదలకుండా ఉండిపోతే ప్రయోజనం ఉండదు. వేదిక మీద నడుస్తూ చేతులను కదుల్చుతూ హావభావాలు వ్యక్తపరచాలి. ఇలా చేయటం వల్ల బాడీ రిలాక్స్ అవుతుంది. ఆత్మ విశ్వాసం పెరుగుతుంది. దాంతో టెన్షన్ సద్దుమణిగి మామూలు స్థితికొస్తాం.





ప్రాక్టీస్ చేయాలి

పర్‌ఫెక్షన్ కోసం ప్రాక్టీస్ చేయాలి. కాబట్టి ప్రెజెంటేషన్ స్క్రిప్ట్ ముందుగానే తయారుచేసుకుని దాని గురించి అనుమానాలుంటే స్నేహితుల ముందు ప్రెజెంట్ చేసి నివృత్తి చేసుకోవాలి. వాళ్లూ ఆడియన్స్‌లాంటివాళ్లే కాబట్టి ప్రసంగిస్తున్నప్పుడు ఏవైనా అనుమానాలు తలెత్తితే ప్రశ్నిస్తారు. ఇన్‌పుట్స్ ఏవైనా అవసరమనుకుంటే సూచిస్తారు. అలాగే అద్దం ముందు నిలబడి ప్రాక్టీస్ చేసినా ఫలితం ఉంటుంది.

నచ్చిన టాపిక్ ఎంచుకోవాలి

ఇష్టమైన విషయం గురించి మాట్లాడటం తేలిక. కాబట్టి వీలైనంత వరకూ నచ్చిన టాపిక్ ఎంచుకోవాలి. తెలిసినది, ఇష్టమైనదాని గురించి మాట్లాడటం సౌకర్యంగా ఉంటుంది. ప్రసంగంలో స్వీయానుభవాలను చొప్పిస్తే మరింత ఈజ్‌తో ఆత్మవిశ్వాసంతో మాట్లాడగలుగుతారు.





బిగుసుకుపోతే...

గుండెల్నిండా ఊపిరి పీల్చి వదలాలి. ఇలా చేస్తే రక్తప్రసరణ పెరిగి గుండె వేగం తగ్గుతుంది. దాంతో ఆలోచనల్లో స్పష్టత వస్తుంది. మానసిక స్థితి మీద బాడీ లాంగ్వేజ్ ప్రభావం ఉంటుందని ఎన్నో అధ్యయనాల్లో తేలింది. టెన్షన్‌తో బిగుసుకు పోతే సమస్య మరింత రెట్టింపవుతుంది కాబట్టి చిరునవ్వుతో స్నేహ పూర్వకంగా కనిపించే ప్రయత్నం చేయాలి. అంతా సవ్యంగానే ఉందనే భావన మెదడుకు కలిగిస్తే పరిస్థితి చక్కబడుతుంది.

అనుమానాలు వద్దు

ఏం మాట్లాడితే ఏమవుతుందో? ఎవరు ఏమనుకుంటారో? అనే ఆలోచనలను వదిలేయాలి. ఆడియన్స్ మిమ్మల్ని చూసి నవ్వుకోడానికి అక్కడికి రాలేదని తెలుసుకోండి. వాళ్లక్కడికి వచ్చింది మీ మాటలు వినటానికి. కాబట్టి 'నా ప్రెజెంటేషన్ వాళ్లకు నచ్చదు' అని అనుకునే బదులు 'ఎలాంటి విషయాలు చెప్తే ఆడియన్స్‌కు ఉపయోగకరం?' అనే దిశగా ఆలోచించండి.



ఫన్.కాం

ప్లాస్టిక్ సర్జరీకి ఎంతవుతుంది..?



పేషెంట్: డాక్టర్ గారూ.. ప్లాస్టిక్ సర్జరీకి ఎంతవుతుంది..?
డాక్టర్: యాభై వేలు..
పేషెంట్: ప్లాస్టిక్ మేం తెచ్చుకుంటే..?
డాక్టర్: లక్ష అవుతుంది.. కరిగించి అతికించాలి కదా..!

గూగుల్‌లో కూడా ఈ ప్రశ్నకు జవాబు దొరకదు..?

ప్రశ్న: అధికమోతాదు ఉష్ణోగ్రతలో ద్రవపదార్థం నుండి ఘన పదార్థంగా మారేది ఏది..?



యుయస్ఎ: సైన్స్ ఒప్పుకోదు..
ఫ్రాన్స్: పిచ్చి ప్రశ్న..
యుకె: గూగుల్‌లో కూడా ఈ ప్రశ్నకు జవాజు దొరకదు..
జపాన్: మాకు తెలియదు..
రష్యా: ఈ ప్రశ్న అడిగిన వాళ్ళకు బుర్రలేదు..
ఇండియా: హ.. హ.. హ.. పిచ్చోళ్ళారా..! జవాబు.. ఇడ్లీ..

పేరడీ సాంగ్ (భలే మంచి రోజు)



పల్లవి:
సైన్సు ఫెయిరు రోజు
చదువుల పండుగ రోజు
విజ్ఞానాలు పూచే నేటి రోజు..అ..
॥2॥

సైన్సు ఫెయిరు రోజు
చదువుల పండుగ రోజు
విజ్ఞానాలు పూచే నేటి రోజు..అ..
॥2॥

చరణం:
బుర్రలోని ఆలోచనలు
ప్రయోగాలుగా చేసిన రోజు
ప్రయోగాలైన ఆ ఆలోచనలే
నమూనాలుగా పెట్టిన రోజు
॥2॥

విశ్వంలోని జ్ఞానమంతా
అరచేతిలోకి వచ్చిన రోజు
సైన్సు ఫెయిరు రోజు
చదువుల పండుగ రోజు
విజ్ఞానాలు పూచే నేటి రోజు..అ..
॥2॥

చరణం:
ఆవిష్కరణలు తెచ్చిన రోజు
మేధస్సు వికసించిన రోజు
బాల మేధావులు పుట్టిన రోజు
గురువులు గర్వించిన రోజు
॥2॥

బడిలోని పాఠాలన్ని
శాస్త్రీయ ఫలాలై పండిన రోజు
సైన్సు ఫెయిరు రోజు
చదువుల పండుగ రోజు
విజ్ఞానాలు పూచే నేటి రోజు..అ..
॥2॥

- శ్రీ నాగాస్త్ర

హ్యాపీనెస్‌ను లెక్కగడితే...



ప్రపంచంలోనే అత్యంత సంతోషంగా ఉండే యువత ఏదేశంలో ఉన్నారని యూకేలోని వార్కే ఫౌండేషన్ సర్వే చేసింది. యువత ఆలోచనలు, ఆశయాలు, నమ్మకాలు ఇలా అనేక విషయాలతో పాటు వారి హ్యాపీనెస్‌ను కూడా లెక్కగట్టింది సర్వే. ఆ విశేషాలే ఇవి.

ఎక్కడైనా సరే యువత ఉంటే సందడి. వాతావరణంలో ఓ ఎనర్జీపాస్ అవుతుంది. చదువులతో పాటు ఆనందాన్ని ఆస్వాదించటమే యువత లక్షణం. గాడ్జెట్స్, ఆలోచనలు, నమ్మకాలు, ఉద్యోగాలు.. ఇలా అన్నింటితో కలిసి ముందుకు ప్రయాణిస్తుంటారు. కలల సాకారం కోసం ప్రయత్నిస్తుంటారు. అయితే యూకేలోని వార్కే ఫౌండేషన్ ఎడ్యుకేషన్ చారిటీ సంతోషంగా ఉండే యువత ఎవరిని 20 దేశాలో సర్వే చేశారు. ఇందుకోసం 15 నుంచి 21 ఏండ్ల లోపు యువతను పరిగణలోకి తీసుకున్నారు. రష్యాలోని యువత 64 శాతం సంతోషంగా ఉంటే బ్రెజిల్ 69 శాతం. కెనడా, చైనా, అర్జెంటీనా లోని యువత 70 శాతం సంతోషంగా ఉన్నారు. అమెరికాలో 73 శాతం కాగా ఇజ్రాయిల్ 78 శాతంతో ముందుంది. ఇక మన దేశం విషయానికి వస్తే 80 శాతం ఉంది. రెండోస్థానంలో నైజీరియా ఉంది. మొత్తానికి ప్రపంచంలోనే సంతోషంగా ఉండే యువతగా తొలిస్థానం ఇండోనేషియా దక్కించుకుంది. ఇండోనేషియాలో సంతోషంగా ఉండే యువత 92 శాతం. మొత్తానికి తొలిస్థానం ఇండోనేషియా దక్కించుకోవడానికి కారణాలేంటని సర్వే సంస్థ విశ్లేషించింది. విషయమేమంటే ఇండోనేషియన్లు ఎమోషనల్‌గా అందరితో కలిసిమెలిసి ఉంటారట. ఆందోళన చెందకుండా ఉండటం. సమస్యల గురించి మరీమరీ ఆలోచించక పోవటం వారి లక్షణాలట. వీటితో పాటు ప్రేమించేగుణం, ఒంటరిగా ఉండకపోవటమే వారి ఆనంద రహస్యమని తేలింది.



గజల్

వలపు సరిగమలు

ఉషోదయం పులకించెను నీ మోమును చూసి
కలువపూలు తరియించెను నీ కనులై పూసి
నిరంతరం కాంతి చిందు సూర్యబింబమైనా
తిలకముగా వెలిగిపోవు నీ నుదుటను మెరిసి
కొండమల్లె జాజిమల్లె గులాబీలు అన్నీ
పరిమళాలు వెదజల్లెను నీ చెమటను తడిసి
సరిగమలను స్వరజతులను చిలికే నీ మాటలో
వరదలుగా పొంగిపోయె వెన్నెలలే కురిసి
ఆ నింగీ ఈ నేలా వేరువేరుగా ఉన్నా
అవి రెండూ కలిసిపోయె నీ తలపున విరిసి
అవనిలోన నడయాడిన పాలరాతి బొమ్మవా?
పవనాలే పులకించెను నీ ఊహలు మోసి
ఆరాధన భావాలను రాశులుగా పేర్చి
'శరత్ 'మురిసిపోయేను ఈ గజల్ ని రాసి.

- తిరునగరి శరత్‌చంద్ర,
6309873682

ఆకలి తీర్చే రోబో

అమెరికాలోని శాన్‌కార్లోస్ నివాసి "భవిష్యత్ రైతన్న" ను మనకు పరిచయం చేస్తున్నాడు. ఈ భావితరం రైతు పేరు "యాంగస్". బరువు దాదాపు 455 కిలోలు. ఇంతటి మహాకాయం కాబట్టి కదలికలు కాస్త నెమ్మదిగానే ఉంటాయిగా. అయితేనేం ఈ రైతు బలం ఎంతటిదంటే ఏకంగా 363 కిలోల కూరగాయల కొయ్య తొట్టెను అవలీలగా ఒక చోట నుంచి మరొక చోటకు మోసుకెళ్లగలడు. మానవమాత్రులు ఇంత బరువుండటం, మోయడం సాధ్యమేనా అని సందేహిస్తున్నారు కదూ? మీ అనుమానం నిజమే... యాంగస్ ఒక రోబో! ఈ భారీ రైతు రోబోతో పాటు ఇతర చిన్న రోబోలతో వ్యవసాయాన్ని కొత్త పుంతలు తొక్కిస్తున్న యువకుడు అలెగ్జాండర్.



ఎంతో కృషి చేసి

"మూన్‌షాట్" లేబొరేటరీ రోబోటిక్స్ విభాగంలో ఇంజనీరుగా అలెగ్జాండర్ పనిచేశాడు. అక్కడ అతని బాధ్యత డ్రోన్ల రూపకల్పన. అక్కడే పని చేస్తున్న జోన్ బిన్నీతో అతడికి స్నేహం కుదిరింది. వారిద్దరూ ఎంతో కృషి చేసి ఐరన్ ఆక్స్ సంస్థకు ఊపిరిపోశారు. ఈ సంస్థకు అలెగ్జాండర్ సీఈవో, బిన్నీ చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్. కేవలం 33 ఏండ్ల వయసులోనే వీరిద్దరూ కలిసి రోబోలతో వ్యవసాయం కోసం దాదాపు 60 లక్షల డాలర్ల మేర నిధులు సేకరించారు. తర్వాత అంకుర సంస్థను ఏర్పాటు చేసి రెండేండ్లపాటు కిందామీదా పడ్డారు. చివరకు "మూన్‌షాట్" లేబొరేటరీ సాధించలేని ఘనతను సొంతం చేసుకున్నారు. "ఇప్పుడు మా రోబోలు సాగుచేసిన కూరగాయలు సరఫరాకు సిద్ధంగా ఉన్నాయి. ఈ కూరగాయలతో చేసిన సలాడ్ మీరెన్నడూ ఎరుగనంత రుచిగా ఉంటుంది" అని ఊరిస్తున్నాడు అలెగ్జాండర్.

గ్రీన్ హౌజ్ వ్యవసాయ క్షేత్రాలు

కాలిఫోర్నియాలోని శాన్ కార్లోస్ పట్టణ శివారులో "ఐరన్ ఆక్స్" కంపెనీ 8 వేల చదరపు అడుగుల గిడ్డంకి ప్రాంగణంలో రోబో వ్యవసాయ క్షేత్రాన్ని తీర్చిదిద్ది పంటల సాగు చేపట్టారు. ఈ కూరగాయల అమ్మకానికి శాన్ ఫ్రాన్సిస్కో తీరప్రాంత రెస్టారెంట్లతో అలెగ్జాండర్



సంప్రదింపులు సాగిస్తున్నాడు. అలెగ్జాండర్ మాట్లాడుతూ 'వచ్చే ఏడాదికల్లా మా రోబో పండించిన కూరగాయలు సూపర్ మార్కెట్లకు చేరతాయి. నీటి అవసరం ఎక్కువగా లేకుండా సహజ సూర్యకాంతిపై ఆధారపడే గ్రీన్ హౌజ్‌లలో వ్యవసాయ క్షేత్రాల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేశాం. అత్యంత ఖర్చుతో కూడుకున్న హైపవర్ విద్యుద్దీప కాంతి ఆధారిత ఇన్‌డోర్ సాగుకన్నా ఇది ప్రకృతికి దగ్గరగా ఉంటుంది. ప్రారంభంలో కాస్త నష్టమొచ్చినా తమ దిగుబడిని-మార్కెట్ ధరకన్నా తక్కువకే విక్రయిస్తూ పోటీలో నెగ్గుకొస్తాం. అలాగే ఐదేండ్లలో అమెరికాలోని అన్ని మెట్రో ప్రాంతాల్లో ఐరన్ ఆక్స్ రోబో వ్యవసాయ క్షేత్రాల ఏర్పాటు చేయడమే మా లక్ష్యం' అంటున్నాడు.

మట్టితో పనిలేదు

వ్యవసాయ రంగంలో పనికి అమెరికా కార్మిక శక్తి పెద్దగా మొగ్గు చూపడంలేదు. అందుకే రోబోలతో సాగు, అందునా మట్టిరహిత (హైడ్రోపోనిక్) పద్ధతిలో వ్యవసాయమే మెరుగని అలెగ్జాండర్ అంటున్నాడు. అంతేకాకుండా రోబో క్షేత్రాల్లో నీటి సంరక్షణకూ అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపాడు. తన ఇన్‌డోర్ రోబో క్షేత్రాల్లో భారీ బరువులెత్తే పనిని అన్ని దిశలకూ కదలగల చక్రాలతో నడిచే యాంగస్ చూసుకుంటుందని చెప్పాడు. పక్వానికి వచ్చిన పంట ఉత్పత్తులను మానవ కార్మిక శక్తితో సేకరించినా, భారీ మొత్తంలో వాటిని ఒక చోట నుంచి మరో చోటికి యాంగస్ సునాయాసంగా తరలిస్తుందన్నాడు. ఇంకా పేరు పెట్టని మరో రోబో చిన్న పాదులలో కాస్త ఎదిగిన మొక్కలను తన యాంత్రిక హస్తంతో సున్నితంగా తీసి, పెద్ద పాదుల్లోకి మారుస్తుందట. ఇలా వివిధ చిన్నచిన్న పనులు చేసే రోబోల యాంత్రిక హస్తాల కీళ్లకు రాపిడి సమస్య లేకుండా కూరగాయలకు హాని కలిగించని లక్షణంగల గ్రీస్ వాడతాడట. ఒక్కొక్క తెట్టెలోని సుమారు 250 మొక్కలను పెద్ద పాదుల్లోకి మార్చడం చాలా శ్రమతో కూడిన పనే అయినా ఆ చిన్న రోబో అలుపు లేకుండా చేసుకుపోతుంది. ఇప్పటికే పక్వానికి వచ్చిన పంటను గుర్తించి ఉత్పత్తిని సేకరించగల రోబో తయారీలో ఐరన్ ఆక్స్ నిమగ్నమైన ఉందని అలెగ్జాండర్ చెబుతున్నాడు. "రోబోల సాయంతో మానవాళి ఆకలి తీర్చగలిగితే ప్రపంచంపై ప్రభావం చూపగల ఘనకార్యం అంతకన్నా మరొకటి ఏముంటుంది?' అంటున్నాడతడు.

మహేంద్రసింగ్ ధోని హెలికాప్టర్ షాట్ల జోరు నెమ్మదిగా క్షీణ దశకు చేరుతోందా? అంటే అవుననే చెప్పాలి. ముగింపు మొనగాడు ఇప్పటికీ భారత జట్టులో స్థానానికి అర్హుడా? అంటే మళ్లీ అవుననే సమాధానం. 2019 ప్రపంచకప్ సమీపిస్తోన్న తరుణంలో వన్డే జట్టులో ఎం.ఎస్ స్థానంపై విపరీతమైన చర్చ జరుగుతోంది. ధనాధన్ సామర్థ్యం కోల్పోతున్న ధోని వరల్డ్‌కప్‌లో ఏ పాత్ర పోషించనున్నాడు!?



మహిమ ఉందింకా!

● సత్తా చాటిన ఎం.ఎస్ ధోని ● విమర్శకులకు బ్యాట్‌తోనే బదులు

నవతెలంగాణ క్రీడా విభాగం

ధోని ధనాధన్ సత్తా క్షీణిస్తుందనే వాస్తవాన్ని, మహి ఇప్పటికీ జట్టుకు ఎంతో ఉపయోగకారి అనే నిజానికి వేదికైంది ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్. తొలి వన్డేలో 4/3తో భారత్ విపత్కర పరిస్థితుల్లో చిక్కుకున్నది. ఐదు ఓవర్లలోపే క్రీజులోకి వచ్చిన మహి తక్షణ కర్తవ్యం వికెట్ల పతనాన్ని నిలువరించటం. ఇటువంటి సందర్భాల్లో మహి ఎన్నో సార్లు నిరూపించుకున్నాడు, సిడ్నీ బాధ్యత కొత్త కాదు. ధోని మిడిల్ ఆర్డర్‌లో ఉండగా, జట్టు సైకిల్ స్టాండ్‌లా కుప్పకూలదనే భరోసా ఉంటుంది. అలాగని, అతడు ఉంటే ఓటమి తప్పిస్తాడని కాదు. కానీ కనీసం మ్యాచ్‌ను చివరి వరకూ తీసుకెళ్లగలడు. ఆఖరు వరకూ పోరాడగలడు. సిడ్నీలో రోహిత్ శర్మ తోడుగా ధోని ఆపద్బాంధవుడి పాత్ర పోషించాడు. ఈ క్రమంలో సాధించాల్సిన రన్‌రేట్ ఆకాశానికి చేరింది. ఈ సందర్భం ధోనిలోని మునుపటి ధనాధన్ పవర్ లేదని నిరూపించింది. ఇదేదో సిడ్నీ ఇన్నింగ్స్ ఆధారంగా నిర్ధారణకు వచ్చినది కాదు, గత కొన్నేండ్లుగా మహి ప్రదర్శన చెబుతోన్న సత్యం. ఇక రెండో మ్యాచ్ విషయానికొస్తే ధోనికి తోడుగా కోహ్లి ఉన్నాడు. కుదురుకునేందుకు ధోని సమయం తీసుకోగా, మరో ఎండ్‌లో కోహ్లి బాధ్యత తీసుకున్నాడు. వేగంగా పరుగుల సాధించి, మహిపై ఒత్తిడి తగ్గించాడు. ఆరోగ్యకర భాగస్వామ్యాలకు ఉండే లక్షణమిదే. కోహ్లి అవుటైనా, అప్పటికే క్రీజులో కుదురుకున్న ధోని.. ఎవరిని వేటాడలనే నిర్ధారణకు వచ్చేశాడు. నాథన్ లైయాన్‌ను లక్ష్యంగా చేసుకుని పరుగులు పిండుకున్నాడు. దినేశ్ కార్తీక్ మంచి సహకారం అందించాడు. ఛేదనలు ఎప్పుడూ తుది లక్ష్యంపై కాకుండా, చిన్న చిన్న లక్ష్యాలుగా ఛేదించటం సులువు. ఈ విషయంలో మహిని మించిన మొనగాడు లేడు, అతడి సామర్థ్యం వెలకట్టలేనిది. ఇటువంటి ఎన్నో మ్యాచులను ధోని విజయవంతంగా ముగించాడు, ఆడిలైడ్‌లో అదే జరిగింది. ఇక మెల్‌బోర్న్‌లో ఆరంభంలో కోహ్లి, తర్వాత కేదార్ జాదవ్ తోడుగా ధోని ముగింపు మహిమ చూపించాడు. ఇక్కడా భారీ షాట్లకు వెళ్లకుండా, తనదైన శైలిలో మ్యాచ్‌ను చివరి వరకూ తీసుకెళ్లి విజయాన్ని అందించాడు.

జోరు తగ్గినా, విలువ పెరిగింది!

ఆస్ట్రేలియాపై మూడు వన్డేల్లో అతడి ప్రదర్శన గతంలో మాదిరి ధనాధన్‌ను తలపించలేదు. కానీ తుది జట్టులో నిలిచేందుకు అతడు ఇంకా విలువైన ఆటగాడే. గతంలో ధోని 'ది బ్యాట్స్‌మన్' ట్యాగ్ తుది జట్టులోకి చోటు కోసం సరిపోయేది. అయితే, ఇప్పుడు ధోని 'ది ప్యాకేజ్' ట్యాగ్ అతడిని జట్టులో నిలుపుతోంది. వికెట్ల వెనకాల పరిపూర్ణమైన కీపింగ్, డీఆర్‌ఎస్‌లో కచ్చితత్వం, మైదానంలో వ్యూహాత్మక సలహాలు ధోనీని ఇప్పటికీ జట్టులో నిలిచేలా చేస్తున్నాయి. భారత టాప్-3 రోహిత్ శర్మ, శిఖర్ ధావన్, విరాట్ కోహ్లి ప్రపంచ అత్యుత్తమ త్రయం. కానీ వారి తర్వాతి వరుసలో అనుభవం ఉన్న ఆటగాడే లేడు. కానీ ఆ లోటును ధోని భర్తీ చేస్తున్నాడు.

అనుకున్నప్పుడు అలవోకగా సిక్సర్లు బాదటం, ఫీల్డర్ల మధ్య బంతిని



పంపించి విలువైన పరుగులు సాధించటం, వికెట్ల మధ్య వేగవంతమైన పరుగు, ఎప్పుడు ఏ విధంగా ఆడాలనే అసమాన ప్రతిభ తెలిసినోడు.. ఏండ్లుగా ధోని అతిపెద్ద సాంకేతిక సానుకూలతలు. వీటిలో తొలి రెండింటిలో స్పష్టమైన తగ్గుదల కనిపించినా, చివరి రెండింటిలో మహి ఇప్పటికీ ప్రభావశీలుడు. వయసు పెరిగితే తెలివేమీ నెమ్మదించదు, అందుకే అతడు వికెట్ల మధ్య పరుగులో క్రియాశీలంగా ఉన్నాడు. తనను తాను పూర్తి ఫిట్‌నెస్‌గా చూసుకున్నాడు. గతంలో మాదిరి భారీ షాట్లు ఆడేందుకు ధోనికి ఇప్పుడు సమయం అవసరం. అందుకే క్రీజులోకి రాగానే కాస్త సమయం తీసుకుంటున్నాడు. భారీ షాట్లకు వెళ్లటంలో అతడు ఎంపిక చేసుకునే బంతులు, టార్గెట్ చేసుకునే బౌలర్లు తక్కువవుతున్నారు. ఇది ఆందోళన కలిగించే పరిణామం. బ్యాట్స్‌మన్ పరిమితులు ఒకసారి బౌలర్ పసిగడితే, ఆ ప్రభావం ప్రతికూలం. ధోని మునుపటిలా ప్రతి బంతినీ సిక్సర్ సంధించలేడనే విషయం బౌలర్‌కు తెలిసిపోవటంతో, బౌలర్లు మరింత దూకుడుగా బంతులేస్తున్నారు. గతంలో చివరి ఓవర్‌లో 20 పరుగులు చేయాల్సి ఉన్నా.. క్రీజులో ధోని ఉంటే ఒత్తిడి బౌలర్‌పైనే. కానీ ఇప్పుడు మహికి బంతులేసేందుకు బౌలర్లు ఏమాత్రం సంకోచించటం లేదు. ఫీల్డర్ల మోహరింపులు సైతం ధోనికి ప్రతికూలంగా ఉంటున్నాయి. గతంలో సర్కిల్ బయట కాచుకునే ఫీల్డర్లు ఇప్పుడు సర్కిల్ లోపల మరింత దగ్గరగా కాపు కాస్తున్నారు. దీంతో సింగిల్స్ తీసేందుకు ధోని ఇబ్బంది పడుతున్నాడు. దీంతో పరుగుల కోసం కచ్చితంగా రిస్క్ తీసుకొని, షాట్‌కు వెళ్లాల్సిందే. కానీ రిస్క్ తీసుకోవటం ధోని డీఎన్‌ఏలోనే లేదు!. సహనంతో క్రీజులోనే నిలిచి ఎప్పట్లాగే మ్యాచ్‌ను ఆఖరి ఓవర్ వరకూ తీసుకెళ్తున్నాడు. ఈ క్రమంలో మిడిల్ ఓవర్లలో కొన్ని బంతులను వృథా చేసినా, అది జట్టు మూల్యం చెల్లించుకునే పరిస్థితికి దారితీయదని ధోని నమ్మకం.

ధోని ది డిఫెన్స్!

ఆస్ట్రేలియా పర్యటనలో రెండు మంచి విషయాలు. విదేశీ పిచ్‌లపై నిలబడి పరుగులు చేయలేడు అని విమర్శలు ఎదుర్కొన్న చతేశ్వర్ పుజార టెస్టుల్లో చరిత్ర సృష్టించగా, మునుపటి ముగింపు మహిమ కోల్పోయాడు అని నిందలు మోసిన మహేంద్రుడు వన్డేల్లో చెలరేగాడు. గత కొన్నేండ్లుగా ధోని స్ట్రయిక్ రేట్, బౌండరీల సగటు గణనీయంగ తగ్గుతోంది. 2015 ప్రపంచకప్‌కు ముందు తొలి 20 బంతులకు ధోని స్ట్రయిక్‌రేట్ 74.80. అదే 2015-2018 వరకు 74.80 కాగా, 2018 నుంచి 65.85కు చేరుకున్నది. ఇదే విధంగా 21-40 బంతుల్లో స్ట్రయిక్ రేట్ వరుసగా 90.88, 79.08, 79.86గా ఉంది. ఇక 41 బంతుల తర్వాత ధోని స్ట్రయిక్ రేట్ 106.67, 97.73, 71.72. ఆఖర్లో జూలు విదిల్చే మహి అక్కడే స్ట్రయిక్‌రేట్‌ను గణనీయంగా కోల్పోయాడు. ఇదే విధంగా బౌండరీలు బాదే విషయంలోనూ ధోని సత్తా తగ్గుతూ వస్తోంది. తొలి 20 బంతుల్లో 2015 వరల్డ్‌కప్ వరకు 13.7 బంతులకో బౌండరీ బాదగా, అది 2015-18 కాలానికి 15.4కు పెరిగింది. 2018 నుంచి 22.4 బంతులకు గానీ ఓ బౌండరీ బాదటం లేదు. 40 బంతులు ఎదుర్కొన్న తర్వాత ధోని గతంలో ప్రతి 9.3 బంతులకో బౌండరీ కొట్టేవాడు. ప్రపంచకప్ నుంచి అది 9.9 బంతులకు చేరింది, 2018 నుంచి 18.1 బంతులకు చేరటం మహి ధనాధన్ పవర్ పడిపోవటం స్పష్టంగా తెలిసేలా చేస్తోంది.

ప్రపంచకప్ జట్టులో ఉండాలి అతడు..

2018 ప్రపంచకప్ జట్టులో ధోని ఉంటాడా? లేదా చర్చ ఇక అనవసరం. అతడు ఏ స్థానానికి సరిపోతాడనే విషయాన్ని కనుక్కోవటం జట్టుకు కీలకం. ప్రస్తుతం అతడు ఐదో స్థానంలో ఆడుతున్నాడు. మరింత ముందుగా ఆడించాలనే ఆలోచనలో తప్పేమీ లేదు.. ముందుగా వస్తే కొత్త బంతితో సీమర్లను ఎదుర్కోలేడు అనే విమర్శ వినిపిస్తోంది. ధోని ఎదుర్కొనే విధానం కొత్తగా కనిపించినా, కొత్త బంతిని అలవోకగా ఎదుర్కొని నిలబడగలడు. ఇక స్పిన్నర్లపై గతంలో నేరుగా దాడి చేసే ధోని, ఇప్పుడు స్వీప్, స్క్వేర్‌లో పరుగుల కోసం చూస్తున్నాడు. ఎదురుదాడి పొజిషన్ నుంచి రక్షణాత్మక దారి ఎంచుకోవటంలో తప్పేమీ లేదు. ప్రపంచకప్‌లో టాప్-3 త్రయం రాణించి జట్టు స్కోరు 30 ఓవర్ల తర్వాత 220/2-230/2గా ఉన్నప్పుడు కచ్చితంగా ధోనిని పంపించరాదు. హార్దిక్ పాండ్య, దినేశ్ కార్తీక్ సహా అవసరమైతే కేదార్ జాదవ్‌నూ ముందుగా పంపించాలి. అదే ఆరంభ ఓవర్లలోనే టాప్-3 విఫలమైతే అప్పుడు జట్టును ఆదుకునేది ధోని మాత్రమే, ఇందులో మరో ఆలోచనకు చోటు లేదు.

కెరీర్‌లో భిన్న పరిస్థితుల్లో, భిన్న సమయాల్లో విభిన్న పాత్రల్లో ఒదిగిపోవటమే చాంపియన్ల లక్షణం. 25 ఏండ్ల చేసిన విధ్వంసం 35 ఏండ్ల వయసులో చేయలేమని వాస్తవాన్ని అంగీకరించటంలో తప్పేమీ లేదు. ధోనీకి సైతం ఇది వర్తిస్తుంది, అందుకే మహి దిగ్గజ చాంపియన్.

సెరెనా X హలెప్

● క్వార్టర్స్ బెర్త్ కోసం స్టార్స్ ఢీ ● జకోవిచ్, జ్వెరెవ్ ముందంజ ● ఆస్ట్రేలియన్ ఓపెన్



మెల్‌బోర్న్ : మహిళల సింగిల్స్‌లో క్వార్టర్స్‌కు ముందే స్టార్స్ ముఖాముఖి. దిగ్గజ క్రీడాకారిణి సెరెనా విలియమ్స్, టాప్ సీడ్ సిమోన హలెప్ (రొమానియా)లు ప్రీ క్వార్టర్స్‌లోనే తాడోపేడో తేల్చుకునేందుకు సిద్ధమవుతున్నారు. మూడో రౌండ్లో వీనస్ విలియమ్స్‌పై 6-2, 6-3తో గెలుపొందిన హలెప్, నాల్గో రౌండ్లో సెరెనాతో సమరానికి సై అంటోంది. మహిళల సింగిల్స్ విజేతను నిర్ణయించే ఈ ప్రీ క్వార్టర్స్‌పైనే ఇప్పుడు అభిమానుల ఆసక్తి నెలకొన్నది. మరోవైపు సెరెనా జోరు కొనసాగుతోంది. 6-2, 6-1తో ఉక్రెయిన్ ప్లేయర్ దయానపై వరుస సెట్లలో గెలుపొందిన సెరెనా రికార్డు టైటిల్ వైపు వడివడిగా అడుగులు వేస్తోంది. స్పెయిన్ భామ గార్బినె ముగురుజా 7-6(7-5), 6-2తో స్విస్ అమ్మాయిపై చెమటోడ్చింది. కరిలినా ప్లిస్కోవా 6-4, 3-6, 6-2తో మూడు సెట్లలో గియోర్గిపై గెలుపొందింది. నాల్గో సీడ్ నవొమి ఒసాక (జపాన్) 5-7, 6-4, 6-1తో మెరుపు విజయం సాధించి నాల్గో రౌండ్లోకి ప్రవేశించింది. అమెరికా స్టార్ మడిసన్ కీస్ 6-3, 6-2తో మెర్టన్స్‌పై గెలుపొందింది.

పురుషుల సింగిల్స్‌లో టాప్ సీడ్ నొవాక్ జకోవిచ్ (సెర్బియా) 6-3, 6-4, 4-6, 6-0తో డెనిస్‌పై అలవోక విజయం సాధించి నాల్గో రౌండ్లోకి చేరుకున్నాడు. యువ సంచలనం, జర్మనీ ఆశా కెరటం అలెగ్జాండర్ జ్వెరెవ్ జోరు కొనసాగుతోంది. ఆస్ట్రేలియా ఆటగాడు బోల్ట్‌పై 6-3, 6-3, 6-2తో వరుస సెట్లలో గెలుపొందిన జ్వెరెవ్ తొలి టైటిల్ వేటలో కసిగా దూసుకెళ్తున్నాడు. డెవిడ్ గోఫిన్‌పై మెద్వదెవ్ 6-2, 7-6(7-2), 6-2తో నెగ్గగా, జపాన్ స్టార్ కియ్ నిషికొరి 7-6(8-6), 6-1, 6-2తో మూడో రౌండ్లో విజయం సాధించాడు. మిలోస్ రావోనిక్ 6-4, 6-4, 7-6(8-6)తో పైచేయి సాధించగా, కొరిచ్ 2-6, 6-3, 6-4, 6-3తో ప్రీ క్వార్టర్స్‌కు చేరుకున్నాడు. ఫ్రాన్స్ ఆటగాడు పొలీ 7-6(7-3), 6-3, 6-7(10-12), 4-6, 6-3తో పాపిరీన్‌పై పోరాడి గెలుపొందాడు.

ఎ జట్టుకు రహానె సారథ్యం



ముంబయి : భారత టెస్టు జట్టు వైస్ కెప్టెన్ అజింక్య రహానెకు భారత్-ఎ జట్టు పగ్గాలు అప్పగించారు. ఇంగ్లాండ్ లయన్స్‌తో ఐదు వన్డేలు, రెండు నాలుగు రోజుల మ్యాచులకు సెలక్షన్ కమిటీ శనివారం జట్లను ప్రకటించింది. తొలి మూడు వన్డేలకు రహానె కెప్టెన్సీ వహించనుండగా, చివరి రెండు మ్యాచులకు అంకిత్ భవ్నె కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. వన్డే మ్యాచులు జనవరి 23 నుంచి తిరువనంతపురంలో జరుగనున్నాయి. నాలుగు రోజుల మ్యాచులకు వయాండ్ (కేరళ), మైసూర్ (కర్ణాటక)లు ఆతిథ్యం ఇవ్వనున్నాయి. రంజీ సెమీస్‌కు చేరిన జట్ల నుంచి ఎ జట్టుకు ఎవరినీ ఎంపిక చేయలేదు. తెలుగు కుర్రాడు తొలి మూడు వన్డేలకు ఎంపికయ్యాడు.



వాళ్లను ఆడనివ్వండి

● సీఓఏకు ఖన్నా సూచన


న్యూఢిల్లీ : ఓ టీవీ షోలో మాట్లాడుతూ మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన హార్దిక్ పాండ్య, కెఎల్ రాహుల్‌లను విచారణ ముగిసే లోపు జాతీయ జట్టుకు ఆడనివ్వాలని పాలకుల కమిటీకి బీసీసీఐ తాత్కాలిక అధ్యక్షుడు సి.కె ఖన్నా సూచించారు. 'వారు తప్పు చేశారు. ఇప్పటికే బేషరతు క్షమాపణలు కోరారు. ఆసీస్ పర్యటన నుంచి సస్పెన్షన్‌కు గురయ్యారు. అంబుడ్స్‌మన్ నియామకం కోసం కొందరు ఎస్‌జీఎం డిమాండ్ చేశారు. కానీ వచ్చే వారం సుప్రీంకోర్టు దీనిపై ఓ నిర్ణయం తీసుకోనున్నది. మళ్లీ ఎస్‌జీఎం అవసరం లేదు. విచారణ జరిగేలోపు వారిని సస్పెన్షన్‌లో ఉంచకుండా, ఆడనివ్వాలి. వీలైనంత త్వరగా న్యూజిలాండ్‌లో భారత జట్టుతో కలిసేలా చేయటం మంచిది' అని వినోద్ రాయ్‌కు రాసిన లేఖలో ఖన్నా కోరారు. రాయ్ సైతం రెండు వన్డేల నిషేధంతో సరిపెట్టాలని భావించినా, సీఓఏ సభ్యురాలు ఎదుల్జీ న్యాయ సలహా కోరటంతో ఇప్పుడు విషయం అంబుడ్స్‌మన్ వరకూ వెళ్లిన సంగతి తెలిసిందే. మాజీలు సైతం యువ క్రికెటర్లకు మరో అవకాశం ఇవ్వాలని సూచిస్తున్నారు. దీంతో వినోద్ రాయ్ సానుకూల నిర్ణయం తీసుకునే అవకాశం లేకపోలేదు.

సౌరాష్ట్ర రికార్డు ఛేదన

● యూపీతో రంజీ క్వార్టర్స్



లక్నో : రంజీ ట్రోఫీలో సౌరాష్ట్ర రికార్డు లక్ష్యాన్ని ఛేదించింది. ఉత్తరప్రదేశ్‌పై 372 పరుగుల భారీ లక్ష్యాన్ని ఊదేసి, రికార్డు నెలకొల్పింది. హర్విక్ దేశాయ్ (116) తొలి రంజీ శతకంతో చెలరేగగా.. చతేశ్వర్ పుజార (67 నాటౌట్), స్నేల్ పటేల్ 72, షెల్డన్ జాక్సన్ 73 నాటౌట్) రాణించటంతో సౌరాష్ట్ర రంజీ సెమీఫైనల్లోకి ప్రవేశించింది. 195/2తో మరో 177 పరుగుల కోసం బరిలోకి దిగిన సౌరాష్ట్ర శతక హీరోను తొలి సెషన్లోనే కోల్పోయింది. కానీ పుజార, జాక్సన్‌లు పరిణితి చూపించారు. తొలుత డిఫెన్స్‌తో విసిగించి, తర్వాత పరుగుల వేటలో జోరందుకున్నారు. దీంతో సౌరాష్ట్ర మరో ఆరు వికెట్లు ఉండగానే విజయాన్ని అందుకున్నది. సెమీఫైనల్లో కర్ణాటకతో సౌరాష్ట్ర తలపడనుండగా.. మరో సెమీస్‌లో విదర్భ, కేరళలు పోటీపడనున్నాయి.



సైనాకు చుక్కెదురు

● సెమీస్‌లో మారిన్ చేతిలో ఓటమి ● మలేషియా మాస్టర్స్ టోర్నీ

కౌలాలంపూర్ : భారత స్టార్ షట్లర్ సైనా నెహ్వాల్ జోరుకు సెమీస్‌లోనే శుభం కార్డు పడింది. సీజన్‌ను ఆశాజనకంగా ఆరంభించిన సైనా సెమీఫైనల్లో అంచనాలను అందుకోలేదు. ఒలింపిక్ చాంప్ కరొలినా మారిన్ (స్పెయిన్) చేతిలో 16-21, 13-21తో వరుస గేముల్లో ఓటమిపాలైంది. తొలి గేమ్‌లో 5-2తో ఆధిక్యంతో ఆటను ఆరంభించిన సైనా నెహ్వాల్ వేగంగా వెనుకంజలోకి వెళ్లిపోయింది. వరుసగా ఏడు పాయింట్లు సాధించిన మారిన్ 11-9తో విరామ సమయానికి ముందంజలో నిలిచింది. 13-9తో ఆధిక్యం పెంచుకున్నా, సైనా 14-14తో మళ్లీ రేసులోకొచ్చింది. ఇక్కడ తెలివిగా ఆడిన మారిన్ తొలి గేమ్‌ను సొంతం చేసుకున్నది. రెండో గేమ్‌లో మారిన్ మరింత దూకుడుగా ఆడింది. 6-1తో ముందంజ వేసి, విరామ సమయానికి 11-6తో నిలిచింది. ద్వితీయార్థంలోనూ సైనా ఆశించిన స్థాయిలో పుంజుకోలేదు. దీంతో మారిన్ విజయం సులువైంది.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State Editor : S.Veeraiah.Tel Tel/2014/59462.